మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 61 • పేజీలు:12+16 • వెల: రూ.5 | మంగళవారం • 30-1-2018 | www.manamnews.com | /manamnews



సమస్యలున్నా.. ముమ్మందుకే

వృద్ధి రేటు 7-7.5 శాతంగా నమోదయ్యే అవకాశం

ఈ ఆర్థిక సంవత్సరంలో 6.75%

6.1%కు తగ్గనున్న జీవీఏ వృద్ధి

పెరగనున్న ముడి చమురు ధరలు

స్టాక్ ధరలలో కరెక్షన్‌కు చాన్స్

ఆర్థిక సర్వేలో అరవింద్ వెల్లడి

పార్లమెంటులో ప్రవేశపెట్టిన జైట్లీ

6 లో..



ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదిద్దాం

ముస్లిం మహిళలకు కానుకగా ఇద్దాం

అన్ని పార్టీలకూ మోదీ వినతి

7 లో..



నల్లగొండ ఎస్పీవి అబద్ధాలు

శ్రీనివాస్ హత్యపై అనుమానాలు

ప్రశ్నలకు ఆయన బదులివ్వట్లేదు

ఒక్క సమాధానం కూడా చెప్పలేదు

ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యే

సీఎం కేసీఆర్, డీజీపీ, ఎస్పీకి పాత్ర..

మాజీ ఎమ్మెల్యే తిరుమర్తికి బెదిరింపులు

అయినా పోలీసులు పట్టించుకోవట్లేదు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపణ

కోదండరాంనూ చంపేస్తారేమో?: వీహెచ్

హైదరాబాద్, జనవరి 29 (మనం ప్రతినిధి):

నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య విషయంలో నల్లగొండ జిల్లా ఎస్పీ చెబుతున్నవన్నీ అబద్ధాలేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. ఈ కేసులో తాము అడిగిన ప్రశ్నలకు, అనుమానాలకు ఎస్పీ ఒక్క సమాధానం కూడా చెప్పలేదని అన్నారు. శ్రీనివాస్‌ది ముమ్మాటికీ మిగతా 6లో..

పరిశోధనలకు అండ

టీ హబ్‌తో ఆర్ఈసీ ఒప్పందం

సంయుక్తంగా ప్లాట్‌ఫాం ఏర్పాటు

కేటీఆర్ సమక్షంలో సంతకాలు.. 1800 మంది విద్యార్థులకు శిక్షణ

హైదరాబాద్, జనవరి 29 (మనం ప్రతినిధి):

విద్యార్థుల్లో సాంకేతికత, పరిశోధనా ధోరణిని పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇందుకోసమే గ్రామీణ విద్యుదీక రణ కార్పొరేషన్ (ఆర్ఈసీ)తో ఒప్పందం కుదుర్చుకు న్నామని చెప్పారు. సోమవారం కేటీఆర్ సమక్షంలో ఆర్ఈసీతో టీ-హబ్ ఓ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం టీ హబ్-ఆర్ఈసీ సంయుక్తంగా ఇన్నో వేషన్ ప్లాట్‌ఫాంను ప్రారంభిస్తాయి. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ, ఏపీలోని 30 వర్సిటీలకు చెందిన 1800 మంది విద్యార్థులు, సౌర, పవన, బయోవేస్ట్ పవర్‌పై పరిశోధన చేయను న్నారని తెలిపారు. విశ్వవిద్యాలయాలకు సాంకేతికతను జోడించి సుమారు 600 ప్రాజెక్టులపై పరిశోధన చేస్తారని తెలిపారు. 30 ప్రాజెక్టులను ఎంపిక చేసి పరిశోధనలకు నిధులు ఇస్తామని పేర్కొన్నారు. ఆర్ఈ సీతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతోషదా యకమని టీ-హబ్ సీఈవో జయకృష్ణ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం మిగతా 6లో..





ఇదీలోకం!



తనతో ఏ విధమైన సంప్రదింపులూ లేకుండా నిర్ణయం తీసుకున్నందుకు గుర్రుగా ఉన్నాడు సార్!



పుణ్యక్షేత్రాల అభివృద్ధికి వంద కోట్లు

మల్లెల తీర్థంలో ఎంపీ కవిత వెల్లడి

కుటుంబ సమేతంగా క్షేత్ర సందర్శన

ఎంపీకి పార్టీ శ్రేణుల ఘనస్వాగతం

జలపాతం వద్ద సేదదీరిన కవిత

వెన్నంటి ఉన్న ఎమ్మెల్యే దంపతులు

అచ్చంపేట, శ్రీశైలంప్రాజెక్టు, జనవరి 29 (మనం న్యూస్):

ప్రముఖ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.100 కోట్లను కేటా యించామని జాగృతి మిగతా 6లో..

నువ్వా.. నేనా!



పొగరుబోతు పోట్లగిత్త కాలుదువ్వి.. రంకెవేసి దూసుకొచ్చింది. వాడెక్కిన కొమ్ములతో ఇలా సవాలు విసిరితే కిందపడినా పైచేయి సాధిస్తానన్నట్లు కోడెద్దు కొమ్ము పట్టి వంచేందుకు ప్రయత్నిస్తున్న సాహసి.. తమిళనాడులోని కోయంబత్తూరులో జల్లికట్టు నిర్వహించినప్పటి దృశ్యమిది.



ఘాతుకం!

ఐదేళ్ల పాపతోపాటు ఇద్దరు మహిళల హత్య

అమ్మమ్మ.. అమ్మ.. కుమార్తెలుగా గుర్తింపు

పోలీసులకు లొంగిన భర్త.. మరొకరి అరెస్ట్

హైదరాబాద్ చందానగర్‌లో సంఘటన

హైదరాబాద్/చందానగర్, జనవరి 29 (మనం న్యూస్):



రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో దుండగులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ మేరకు చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంట్లో ఐదేళ్ల పాపతోపాటు ఇద్దరు మహిళలను హత్యచేశారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఉదంతం వివరాలిలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నివాసి అపర్ణాదేవి (35), మధు ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే, ఈ దంపతులకు పాప పుట్టిన తర్వాత అతడికి అంతకుముందే పెళ్లయినట్లు అపర్ణకు తెలిసింది. దీంతో భార్యాభర్తల మధ్య ఘర్షణ తీవ్రం కాగా ప్రస్తుతం వారిద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. మధు కూకట్‌పల్లిలోని ఓ మొబైల్ షాప్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తుంటే, అపర్ణ చందానగర్‌లోగల ఒక ఎలక్ట్రానిక్ ఉపకరణాల షోరూంలో పనిచేస్తోంది. చందానగర్‌లోనే వేముకుంట ప్రాంతంలో తన తల్లి విజయలక్ష్మి, కూతురు కార్తికేయిని (5)లతో అపర్ణ ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. ఈ నేప థ్యంలో ఈ నెల 27వ తేదీ రాత్రినుంచి ఆ ఇంటి సభ్యుల సంచారం లేకపోవడమేగాక దుర్వాసన రావడాన్ని సోమవారం మిగతా 6లో..

నల్లగొండలో మరో దారుణం

నాలుగు రోజుల్లో రెండో హత్య

2 లో..

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 39 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి రా.10.23 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పునర్వసు రా.8.16 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ.9.39-11.04, తె.3.22-4.48; దుర్ముహూర్తం: ఉ.9.07-9.52, మ.2.22-3.07; రాహుకాలం: మ.3.18-4.42; అమృతఘడియలు: సా.6.11-7.36; శుభసమయం: సా.4.43-6.00

సూర్యోదయం: 6.52

సూర్యాస్తమయం: 6.07

పగిడిద్దరాజు పధార్ రహే హై!

నేడు మేడారానికి పయనం

పొనుగొండ్లలో 15 రోజుల ముందునుంచే జాతర పనులు

అక్కడ ఆయన గుడి పట్ల వివక్ష.. పెనిక వంశస్థుల ఆగ్రహం



పొనుగొండ్ల నుంచి 'మనం' ప్రతినిధి బాదిని నర్సింహ

సమ్మక్కను పెండ్లి చేసుకోవడానికి పొనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజు మేడారం బయలుదేరాడు. పెనిక వంశస్థులు 60 కిలో మీటర్లు కాలినడకనే ఆయనను తీసుకొస్తారు. అయితే సమ్మక్క, సారలమ్మలకు అధికార లాంఛనాలతో స్వాగతం పలుకుతుండగా యుద్ధవీరుడు, అసమాన ధైర్యవంతుడు సమ్మక్క భర్త పగిడిద్దరాజుకు అంతటి ప్రాముఖ్యత ఇవ్వకపోవడం, ఆయన గుడిని కూడా పట్టించుకోకపోవడంతో మిగతా 6లో..



మరో దారుణం

- **నల్లగొండలో నాలుగు రోజుల్లో రెండో హత్య**
- **హతుడి శరీరం.. తలను వేరుచేసిన దుండగులు**
- **దర్గా జెండా దిమ్మెపై శిరస్సు.. పొదల్లో మొండెం**
- **అదుపులో ఇద్దరు... మరో ఇద్దరి కోసం గాలింపు**

నల్లగొండ, జనవరి 29 (మనం ప్రతినిధి): నల్లగొండ జిల్లా కేంద్రంలో నాలుగు రోజుల వ్యవధిలోనే మరో దారుణం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యోదంతాన్ని మరువక ముందే సోమవారం మరో ఘోరం వెలుగుచూడటంతో పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకాశం బజార్‌లో కొందరు దుండగులు ఒక వ్యక్తిని దారుణంగా హత్యచేశారు. అనంతరం అతడి తలను వేరుచేసి బొట్టుగూడ ప్రాంతంలోని దర్గా జెండా దిమ్మెపై ఉంచారు. మొండేన్ని భారత్ గ్యాస్ ప్రాంతంలోని పొదల్లో పడేశారు. హతుడిని కనగల్ మండల కేంద్రంలో నివసించే పాలకూరి రమేష్ (33)గా పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు జాగిలాలను రంగంలో దింపగా అవి ఇద్దరు అనుమానితుల ఇళ్లవద్దకు తీసుకెళ్లాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు- ప్రాథమిక



విచారణ తర్వాత తెలిపిన వివరాల ప్రకారం...

ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే రమేష్ కామెర్ల వ్యాధికి మందు కూడా ఇస్తుంటాడు. ఇతడి భార్యకు అదే గ్రామంలోని రామ కృష్ణతో వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఆరు నెలల కిందట వారిద్దరూ గొడవ పడ్డారు. దీంతో రమేష్‌ను అడ్డు తొలగించుకోవాలని రామకృష్ణ నిర్ణయించుకున్నాడు. ఆ మేరకు నల్లగొండకు చెందిన తన స్నేహితుడు సత్తార్‌తో కలసి పథకం రచించాడు. తదనుగుణంగా సత్తార్ తన సమీప బంధువు మొహిసిన్‌ను రంగంలో దించాడు. ముందుగా సిద్ధం చేసుకున్న పథకంలో భాగంగా కామెర్లకు మందు కావాలంటూ అతడు రమేష్‌కు ఫోన్‌చేశాడు. నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులోగల భారత్ గ్యాస్ గోడౌన్ వద్దకు రావాల్సిందిగా కోరాడు. రమేష్ మందు ఇవ్వడానికి అక్కడికి రాగా నలుగురు వ్యక్తులు అతనితో మాట్లాడారు. ఆ తర్వాత అందరూ కలిసి మద్యం సేవించారు. రమేష్ మత్తులోకి వెళ్లగానే అతణ్ని హత్య చేసిన దుండగులు తలను వేరుచేసి, మొండేన్ని అక్కడి పొదల్లో పడేశారు. అటుపైన రమేష్ తలను తీసుకొచ్చి బొట్టుగూడ దర్గా దిమ్మమీద పెట్టారు. ఈ ఉదంతానికి సంబంధించి సత్తార్, మొహిసిన్‌లను పోలీసుల అదుపులోకి తీసుకుని రామకృష్ణ, శివ అనే మరో ఇద్దరికోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ హత్యపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతుందని ఉన్నతాధికారులు తెలిపారు.



కోటి ఎకరాలకు సాగునీరు

- రైతన్న సంక్షేమమే సీఎం ఆకాంక్ష
- **జిల్లాలో 173 కొత్త పంచాయతీలు: తుమ్మల**

ఖమ్మం బ్యూరో, జనవరి 29(మనం న్యూస్): తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సంకల్పమని రాష్ట్ర రోడ్లు భవనాలు, స్త్రీ శిశు అభివృద్ధి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డి గ్రామంలో ఆకేరు నదిపై రూ.73.67 లక్షలతో చెక్‌డ్యాంకు శంకుస్థాపన చేశారు. రాకాసి తండాలో ఓడిఎఫ్ అయిన సందర్భంగా రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. మరుగుదొడ్లను పూర్తిగా నిర్మించుకున్న గ్రామపంచాయితీకి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని మంత్రి చెప్పారు. మండలంలో రూ.38 కోట్లతో రహదారుల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్తగా 173 గ్రామపంచాయితీలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో 71 మంది లబ్ది దారులకు మంత్రి కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. అనంతరం హైదర్‌సాయిపేట గ్రామంలో ఆర్.ఇ.సి ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలను జడ్పీచైర్‌పర్సన్ గడిపల్లి కవిత ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. భక్తరామదాసు ఎత్తిపోతల పథకం కాలువలకు గండ్లు పెట్టకూడదని హెచ్చరిస్తూ అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ధూల్‌పేటలో పరిశ్రమ

- **స్థలముంటే ఏర్పాటు చేస్తాం**
- **గుడుంబా తయారీ మానేస్తే ఉపాధి: పద్మారావు**



హైదరాబాద్, జనవరి 29 (మనం ప్రతినిధి): గుడుంబా తయారీ, వాడకం దారులకు పునరావాసంతోపాటు ఉపాధి కల్పించడానికి స్థలముంటే ధూల్‌పేటలో పరిశ్రమ నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు స్పష్టం చేశారు. సోమవారం నెక్లెస్ రోడ్డులోదూల్‌పేట్ గుడుంబా తయారీదారుల పునరావాస కార్యక్రమంలో భాగంగా 47 కుటుంబాలకు ఆటోలు, 58 కుటుంబాలకు ఆటో ట్రాలీస్, 9 కుటుంబాలకు టాటా ఏస్ వాహనాలను అందించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ... ధూల్‌పేటలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే అన్నీ వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, అధికారులు స్థల సేకరణ చేసి ఏవిధమైన పరిశ్రమను స్థాపించాలనే అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు కోటి!

- **కలెక్టర్ నిధుల నుంచి కేటాయింపు**
- **తొలిదశలో 20 లైబ్రరీల అభివృద్ధి : తలసాని**

హైదరాబాద్, జనవరి 29 (మనం ప్రతినిధి): గ్రంథాలయాలు సమాజానికి ఎంతో అవసరమని, వాటిని సొంతింటిలా చూసుకోవాలని మంత్రి త లసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సోమవారం సచివాలయంలో గ్రంథాలయాల అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ పరిధిలో మొదటి దశలో అభివృద్ధి చేయడానికి 20 గ్రంథాలయాలను ఎంపిక చేసి వాటిలో కనీస అవసరాలు కల్పించేందుకు కలెక్టర్ ప్రత్యేక నిధి నుంచి కోటి రూపాయలను ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు. నగరంలో మొత్తం 86 గ్రంథాయాలు పనిచేస్తున్నాయని, వాటి అభివృద్ధి కోసం 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

త్వరలో టీడీపీ బహిరంగ సభ

- **చంద్రబాబు హాజరవుతారు: ఎల్. రమణ**

హైదరాబాద్, జనవరి 29(మనం ప్రతినిధి): టీటీడీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బహిరంగ సభను నిర్వహిస్తామని ఆ పార్టీ నేతలు వెల్లడించారు. ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం, పల్లె పల్లెకూ టీడీపీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, గరికపాటి మోహన్‌రావు, బక్కని నర్సింహులు, తదితర పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు. పల్లె పల్లెకూ టీడీపీ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామన్నారు. మార్చి 29న కార్యక్రమం ముగిస్తుందని పెద్దిరెడ్డి తెలిపారు. ఆ వెంటనే హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామని ఆయన చెప్పారు. ఈ సభకు పార్టీ జాతీయాధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కూడా హాజరవుతారన్నారు.

ఉత్తమ్ ఉత్తర ప్రగల్భాలు


మీ హయాంలో ఎకరానికన్నా నీళ్లిచ్చారా?.. పదేళ్ల పాలనలో పాలమూరు పెండింగ్..

- **కాంగ్రెస్ నేతల ధ్యాస పర్సంటేజీలపైనే..**
- **6.50 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం: హరీశ్**

వనపర్తి, జనవరి 29(మనంప్రతినిధి): ఉత్తమ్ కుమార్‌వి ఉత్తర ప్రగల్భాలని ఆయన మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో పెద్దమందడి బ్రాంచి కెనాల్ పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఒక్క ఎకరాకైనా సాగునీరు అందించారా? ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిన్నారెడ్డి మంత్రులుగా ఉండి ప్రజలను పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులను పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చారని, కాంగ్రెస్ హయంలో 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తే టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరందించామన్నారు. 'నిన్న వరంగల్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు 70 సీట్లు వస్తాయన్నారు. అవి వట్టి భ్రమలే.. పగటి కలలే! పదేళ్ళ కాంగ్రెస్ పాలనలో పాలమూరు జిల్లాలో 4 ప్రాజెక్టులకింద 50,000 ఎకరాలకు సాగునీరిస్తే, ఆరున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు మేం సాగునీరిచ్చాం. కాంట్రాక్టుల మీద, కమిషన్లు, మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పైనే కాంగ్రెస్ నాయకుల దృష్టి. కల్వకుర్తి పనులు 90 శాతం పూర్తయినట్టు బూటకపు మాటలు చెబుతున్నారు. అదే నిజమైతే కల్వకుర్తి కింద 13 వేల ఎకరాలకే నీరెందుకు ఇచ్చారో సమాధానం చెప్పాలి' అని హరీశ్ నిలదీశారు. కోర్టులో వేసిన కేసులను బేషరతుగా ఉపసంహరిం చుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రైతు పక్షపాతి కాబట్టే సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుడు మేనిఫెస్టోలో 9గంటలు కరెంటు ఇస్తామని హామీ ఇచ్చారని కానీ పగటిపూట 3గంటలు కూడా కరెంటు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడి ఆంధ్రకు ఇచ్చారని తెలంగాణకు మొండి చేయ్యి చుపారని ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్‌లో 4 సంవత్సరాల క్రితం చనిపోయిన రైతుల పేరు మీద కేసులు వేశారని వారికి ప్రాజెక్టులంటే ఇష్టం లేదన్నారు.



లక్ష ఎకరాలకు సాగునీరిస్తాం..



వనపర్తి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని హరీశ్ రావు పేర్కొన్నారు. జిల్లాలను అన్ని రకాలు అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. ఇటీవలే ఘనపురం బ్రాంచ్ కెనాల్‌ను రూ.180 కోట్లతో రికార్డ్ టైంలో పూర్తి చేశామ న్నారు. బీమా, కల్వకుర్తి, మైనర్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా వనపర్తి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరిస్తామని స్పష్టం చేశారు. ఒకప్పుడు గడ్డి మొలవని పాలమూరు జిల్లాలో ఇప్పుడు తుంగ మొలుస్తుం దంటే.. నీటి ప్రవాహం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వనపర్తి మార్కెట్‌ను అన్నిరకాల వసతులతో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సాగునీటి రంగంలో ఉమ్మడి రాష్ట్రంలో వనపర్తికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నికర జలాలు పాలమూరు జిల్లాకు దక్కాలన్నదే సీఎం కేసీఆర్ తపన అని హరీశ్‌రావు స్పష్టంచేశారు.

మద్దతు ధర కోసం చర్చలు..

సీతరామా ప్రాజెక్టు, కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిచేసి పాలమూరు జిల్లాకు పూర్తిగా నల్లగొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. కృష్ణ నికర జలాలు పాలమూరుకు చెందాలన్నదే సీఎం లక్ష్యమని, నికర జలాల ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పారు. పాలమూరు జిల్లాలో వేరుశనగ మద్దతు ధర కోసం ఢిల్లీలో ఎంపీ జితేందర్‌రెడ్డి ప్రభుత్వం తో మాట్లాడు తున్నారని మద్దతు ధర సాధిస్తామని మంత్రి హరీశ్ రావు ప్రజలకు భరోసానిచ్చారు. రైతులకు పంట పెట్టుబడి కింద 2 పంటలకు రూ. 8 వేలు ఇవ్వబోతున్నామని చెప్పారు. వేరుశనగకు మద్దతు ధర కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభి స్తామని చెబుతూ తొందరపడి అమ్ముకోవద్దని మంత్రి సూచించారు.

సర్పంచ్ ఎన్నికల ఫలితంతేల్చిన టాస్

- **రాయికోడ్ సర్పంచ్‌గా సరోజనమ్మ**
- **టీఆర్‌ఎస్-కాంగ్రెస్‌కు సమాన ఓట్లు**
- **కాంగ్రెస్ పార్టీకి తోడైన అదృష్టం**



రాయికోడ్, జనవరి 29(మనం న్యూస్): రాయికోడ్ గ్రామ నూతన సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తాలెల్మ సరోజనమ్మ 744 ఓట్ల టాస్‌తో ఘన విజయం సాధించారని ఎన్నికల అధికారి కృష్ణమూర్తి తెలిపారు. అనారోగ్యం కారణంగా రాయికోడ్ సర్పంచ్ బక్కాగౌడ్ ఇటీవల మరణించడంతో ఉప్ప ఎన్నిక నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఓటింగ్‌లో గ్రామస్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు కొనసాగింది. కాంగ్రెస్, టీఆర్‌ఎస్ మధ్య నువ్వా-నేనా అన్నరీతిలో కొనసాగిన లెక్కింపు అనుక్షణం ఉత్కంఠభరితంగా మారింది. పంచాయతీ పరిధిలో 2,136 ఓట్లు ఉండగా 1808 ఓట్ల పోలయ్యాయి. టీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మణ్‌కు 744 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి వినయ్ కుమార్‌కు 88 ఓట్లు వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి మల్లన్నకు 18 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సరోజన మ్మకు 744 ఓట్లు, సీపీఎం అభ్యర్థి నసేమాకు 59 ఓట్లు, టీడీపీ అభ్యర్థి రాములు కు 19 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 36 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి తెలిపారు. కాంగ్రెస్-టీఆర్‌ఎస్ అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో ఎన్నికల సిబ్బంది టాస్ పద్ధతిలో విజేతను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఇందులో టాస్ కాంగ్రెస్‌ను వరించడంతో సరోజనమ్మ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత

అందరి బాధ్యత

- **ప్రధాని దృష్టికి తీసుకెళతాం**
- **ఇది కుల స్పృహ ఉద్యమం**
- **ఎమ్మార్పీఎస్ ఒంటరి కాదు**
- **అఖిలపక్ష భేటీలో పార్టీల నేతలు**



హైదరాబాద్, జనవరి 29(మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం అందరి బాధ్యతని చెబుతూ.. కాంగ్రెస్ పార్టీ మద్దతి స్తుందని స్పష్టంచేశారు. మోదీ, కేసీఆర్ ఇద్దరూ ఇద్దరేనని విమర్శించారు. ఈ అంశంపై రాహుల్ గాంధీతో ప్రధానికి లేఖ రాయిస్తామని, ప్రభుత్వం, ప్రతిపక్షాలు ముందుకు రాకపోతే అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లేందుకు సీపీఐ చొరవ తీసుకుంటే సంపూర్ణ మద్దతిస్తామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకోసం సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమా దంలో ఉందన్నారు. కేసీఆర్ మానవ, దళిత హక్కులను కాలరాస్తున్నారన్నారు.

ప్రధాని దృష్టికి తీసుకెళ్తాం.. లక్ష్మణ్

రాష్ట్రస్థాయిలో అన్ని పార్టీలు తీర్మానాలు చేసి, సమర్థించినా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోవటం బాధాకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. వర్గీకరణ విషయాన్నీ పార్లమెంట్ సమావేశాలకు ముందే జాతీయ నాయకులతో పాటు, ప్రధాని దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ చొరవ తీసుకోవాలని, బిల్లు వీగిపోకుండా చూడాలన్నారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు రావాలని, ఎస్సీ వర్గీకరణ కు అందరూ కలిసికట్టుగా సహకారం అందిం చాలని టీటీడీపీ నేత ఎల్ రమణ పిలుపు నిచ్చారు.

ఢిల్లీకి వెళదాం.. కోదండరాం

ఎస్సీ వర్గీకరణకు టీటీడీపీ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. వర్గీకరణపై అఖిలపక్షాన్ని సీఎం కేసీఆర్ ఢిల్లీకి తీసుకెళ్లాలని, లేకపోతే అందరం కలిసి ఢిల్లీకి వెళదామని జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ కుల పిచ్చి ఉద్యమంకాదని, కుల స్పృహ కలిగిన ఉద్యమమని ప్రజా గాయకుడు గద్దర్ చెప్పారు. అందుకే తాను ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. నక్సలైట్‌గా ఉన్నప్పటి నుంచే ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతిచ్చానని, ఇప్పుడు కూడా ఉడతా భక్తిలా తన వంతు సాయం చేస్తానన్నారు. వర్గీకరణకోసం పల్లెపల్లెన పాట.. పార్లమెంట్‌కు బాట అనే నినాదాన్నిచ్చారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ జరగకపోతే.. ఉద్యమం ఉధృతమై దేశాన్ని ఊపేస్తుందన్నారు.

చొరవ తీసుకోవడానికి సిద్ధం.. చాడ

ప్రభుత్వం, ప్రతిపక్షాలు ముందుకు రాకపోతే అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లేందుకు చొరవ తీసుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ఎమ్మార్పీఎస్ ఒంటరిగాలేదని, తామంతా మంద కృష్ణ మాదిగ వెంట ఉన్నామన్నారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి.. మంద కృష్ణ

సీఎం కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. కేసీఆర్ చొరవ తీసుకోకపోతే సీపీఐ ఆధ్వర్యంలో అందరం ఢిల్లీకి వెళదామని, రాహుల్‌గాంధీతో ప్రధానికి లేఖ రాయించాలని అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీలను ఆయన కోరారు.

దావోస్‌కు పిలిచారా?

దరఖాస్తు చేసుకున్నారా?

- **మంత్రి కేటీఆర్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్న**

హైదరాబాద్, జనవరి 29 (మనం ప్రతినిధి): వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నాడు గాంధీభవన్‌లో ఇబ్రహింపట్నం నియోజక వర్గం పరిధిలోని మాల్ గ్రామ సర్పంచ్, టీఆర్‌ఎస్ నాయకుడు జహంగీర్ తన అనుచరులతో ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ వస్తే మేలు జరుగుతుందని భావించిన అన్ని వర్గాలు అన్యాయమయ్యారని విమర్శిం చారు. దావోస్ సదస్సుకు తనను అహ్వానించారని కేటీఆర్ చేసుకున్న ప్రచారం అసత్యమన్నారు. ఏ ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్నా అహ్వానిస్తారని ఉత్తమ్ తెలిపారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించి కేటీఆర్ దరఖాస్తు చేసుకున్న విషయం నిజం కాదా? అని ఉత్తమ్ ప్రశ్నించారు. కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే దావోస్‌కు పిలిచారో, దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని డిమా ండ్ చేశారు. దావోస్ సమావేశంలో వచ్చాయని చెబుతున్న పెట్టుబడులన్నీ అబద్దమేనన్నారు. కేటీఆర్ చెబుతున్న బీఆర్ శెట్టి గతంలో ప్రకటించిన పెట్టుడులు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలన్నారు. గతంలోనూ వారణాసి, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్ల ప్రకటించినా, ఇంత వరకు ఒక్క రూపాయ కూడా పెట్టలేదన్నారు. తెలంగాణలో బంగారు కుటుంబం తప్ప, బంగారు తెలంగాణలేదని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబం తప్ప రాష్ట్రంలోఎవరూ సంతోషంగా లేరని విమర్శించారు.

సమగ్ర సర్వే పేరుతో వేధింపులు

- **న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితుడు**

హైదరాబాద్, జనవరి 29(మనం లీగల్ ప్రతినిధి): నేరస్తుల వివరాల్ని పూర్తిగా సేకరించే క్రమంలో నేరస్తుల సమగ్ర సర్వే పేరిట తమను పోలీసులు వేధిస్తున్నారంటూ కల్వకుర్తికి చెందిన అబ్దుల్ హఫీజ్ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. తన వేలిముద్రల దగ్గర నుంచి ఫొటోలు/ఆధార్/ఓటర్ ఐడీ వరకూ అన్ని వివరాలు బలవంతంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. తనపై ఏడేళ్ల క్రితం 420/465 సెక్షన్ల కింద నమోదైన కేసును నాలుగేళ్ల క్రితమే కోర్టు కొట్టేసినా తన వివరాలు సేకరించడం చట్ట వ్యతిరేకమన్నారు. హత్యలు, దోపిడీలు, విదేశీ కరెన్సీ, పాస్‌పోర్టు వంటి కీలక నేరాలకు పాల్పడిన వారి వివరాలను సేకరించే ఉద్దేశంతో జరిపే సర్వేలో తన వివరాలు ఎందుకు సేకరిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. వెంటనే కోర్టు జోక్యం చేసుకుని అన్యాయాన్ని అడ్డుకోవాలని కోరారు. ఈ రిట్‌లో హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నాగర్ కర్నూల్ ఎస్పీ, కల్వకుర్తి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ప్రతివాదులుగా చేశారు.

మూడేళ్లలో రూ.1500 కోట్లు

- **ఈసారి ఒక్క ఏడాదికే బడ్జెట్**
- **14 వేల మందికి కళ్యాణలక్ష్మి శోభ**

హైదరాబాద్, జనవరి 29(మనం ప్రతినిధి): దళితుల అభ్యున్నతే లక్ష్యంగా బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చేలా ఎస్సీ కార్పొరేషన్ ప్రతిపాధనలను రూపొందిస్తుంది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో దాదాపుగా రూ.1500 కోట్లు ఖర్చు పెడితే ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1500 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను అధికారులు తయారు చేస్తున్నారు. దళితుల సంక్షేమంలో భాగంగా ప్రత్యేక నిధుల కేటాయింపుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో దళితులకు భూ పంపిణీ కోసం 4,645 మందికిగానూ రూ.518కోట్లను ప్రభుత్వం కేటాయించింది. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో 4 వేల మందికి గానూ రూ.12 వేల ఎకరాలను పంపిణీ చేసేందుకు దాదాపుగా రూ.600 కోట్లు కేటాయించేలా అధికారులు ప్రతిపాధనలు రూపొందిస్తున్నారు. స్వయం ఉపాధి పథకాలతో దళితులకు ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సబ్సిడీతో కూడిన రుణాలను ఇస్తూ దళిత యువతను ప్రోత్సహిస్తోంది. కాగా, దళిత యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఇందులో భాగంగా గత నాలుగేండ్లలో 1,764 మందికి గానూ రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. గుడుంబా నిర్మూలనలో సారా పునరావాస బాధితులకు కార్పొరేషన్ ద్వారా రూ. 20 కోట్లు ఖర్చు చేశారు.

లక్ష మందికి ఒకేసారి రుణం.. పిడమర్తి రవి

ఈ ఆర్థిక సంవత్సరంలో లక్షమందికి ఒకే రోజు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సబ్సిడీ రుణాలను అందజేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి'మనం ప్రతినిధి'కి తెలిపారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, 80 శాతం సబ్సిడీతో రుణాలను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో ఉద్యమ కారులకు ప్రాధాన్యమిస్తామని వివరించారు. ఈ బడ్జెట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితుల సంక్షేమానికి రూ.1500కోట్లతో బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెడ్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. భూ పంపిణీకి భూమి లభ్యం కాకపోవడంతో ఈ ఏడాది భూముల కొనుగోలుకు ఎక్కువ మొత్తాన్ని వెచ్చిస్తున్నామని చెప్పారు. గతంలో ఎకరాకు రూ.7 లక్షల వరకు చెల్లించగా.. ప్రస్తుతం దీనిని రూ.10 లక్షలకు పెంచేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు.



వనదేవతలకు వందనం..

ఆదిపరాశక్తి సమ్మక్క!!

బయ్యక్కపేటలో జన్మించిన దేవత

ఇక్కడే గుడి, అమ్మ ఆయుధాలు

దేవరగుట్టపై జలకంబావి

(బయ్యక్కపేట నుంచి మనం ప్రతినిధి బాదిని నర్సింహ:

సమ్మక్క పుట్టినూరు బయ్యక్కపేట. సమ్మక్క-సారలమ్మ జాతర మొదట్లో అక్కడే జరిగేది. అయితే భక్తులు ఎక్కువగా రావడంతో బయ్యక్కపేటలో జాతర నిర్వహించడం సమ్మక్క వంశస్థులూ చందా వారికి వసతులు కల్పించడం ఆర్థికంగా కష్టమైంది. దీంతో పాటు మరికొన్ని కారణాల వల్ల 1940 నాటికి జాతరను మేడారంలో జరపడం ప్రారంభమైంది. మేడారానికి 15 కిలోమీటర్ల దూరంలో ప్రస్తుతం తాడ్వాయి మండలంలో బయ్యక్కపేట ఉంది. సమ్మక్కకు ఇక్కడ గుడి ఉంది. సమ్మక్క గద్దెలూ ఇక్కడ దర్శనమిస్తాయి. గుడిలో సమ్మక్క వాడిన ఆయుధాలు సమ్మక్క చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్నాయి. జాతర తరలింపునకు సంబంధించి సిద్ధబోయిన వంశస్థులతో చేసుకున్న ఒప్పంద కాగితాలు ఇక్కడ అందుబాటులో ఉన్నట్లు చందా పరమయ్య తెలిపారు. జాతరకు సంబంధించిన ఆదాయ, వ్యయాల వాటాలను దీనిలో రాసుకున్నట్లు చందా వంశస్థులు చెబుతున్నారు.

సమ్మక్క దొరికింది ఇలా..

12వ శతాబ్దంలో పొలాస(ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఉంది)ను మేడరాజు పాలించేవాడు. మేడరాజుకు చిన్నబోయిరాలు, కనకంబోయిరాలు అని ఇద్దరు భార్యలు. ఓ కార్తీకపౌర్ణమి రోజు పెద్ద భార్య చిన్నబోయిరాలు దుంపల కోసం కొంతమంది మహిళలతో కలసి అడవికి వెళ్లింది. అక్కడ తవ్వుతుండగా.. పెట్టె ఒకటి బయటపడింది. దాన్ని తెరిచి చూస్తే అందులో ఓ ఆడబిడ్డ కన్పించింది. పిల్లలు లేని మేడరాజు దంపతులు దైవ ప్రసాదంగా భావించి ఆ పాపను పెంచుకునేందుకు తీసుకెళ్లారు. బిడ్డకు సమ్మక్క అని పేరు పెట్టారు. కొద్దిరోజుల తర్వాత మేడరాజు పెద్ద భార్యకు మన్యుడు, గండ్రగొడ్డలి అనే ఇద్దరు కొడుకులు పుట్టగా, చిన్నభార్యకు నాగులమ్మతో పాటు మరో ఇద్దరు పిల్లలు జన్మించారు. సమ్మక్క మేడరాజు ఇంట్లోనే పెరుగుతూ.. గూడెంలో ఎవరికీ ఏ వ్యాధి వచ్చినా పసరు వైద్యంతోనే నయం చేసేది. ఆమె మాట తీరు, ప్రవర్తన పట్ల గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేసేవారు. మానవ మాత్రులు తినే ఆహారం సరిపోక పోవడంతో.. రాత్రిళ్లు అందరూ నిద్రపోయిన తర్వాత.. పక్కనే ఉన్న దేవరగుట్టకు పోయి ఆదిశక్తి అవతారం ఎత్తి తనకు నచ్చిన ఆహారాన్ని తిని.. బాలికగా మారి తిరిగి ఇంటికి వచ్చేది. బాలిక ప్రవర్తనలో మార్పును గమనించిన మేడరాజు, కుటుంబ సభ్యులు ఓరోజు రాత్రి బాలికను అనుసరించి దేవరగుట్టకు వెళ్లారు. బిడ్డ ఆదిశక్తి రూపం దర్శించారు. అప్పటి నుంచి బాలిక ఆదిశక్తిగా భావించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేకంగా చూడడం మొదలుపెడతారు. ఇది నచ్చని సమ్మక్క.. తనను దేవరగుట్టపై వదిలిరావాలని కోరుతుంది. దీనికి మేడరాజు, గ్రామస్తులు ఒప్పుకోరు. కానీ సమ్మక్క గట్టిగా పట్టుపట్టడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దేవరగుట్టపై వదిలిపెట్టారట. అక్కడ నీటి వసతి కల్పించాలని కోరడంతో మేడరాజు గుట్టకు దగ్గరలో బావిని తవ్వించాడు. ఆ బావిలోనే అమ్మవారు జలకాలాడేదట. అందుకే ఆ బావికి జలకంబావి అని పేరు వచ్చిందని బయ్యక్కపేట గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం అది గక్కవనం అనే దట్టమైన అడవి ప్రాంతంలో ఉంది.



సమ్మక్కను శాంతింపజేసేందుకు జలకంబావి నీరు

గిరిజనులు ఈ బావిని నీటిని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారు కాళ్లకు చెప్పులతో బావిదగ్గరకు పోరు. సమ్మక్క ఉగ్రరూపం దాలిస్తే.. ఆమెను శాంతింపజేసేందుకు ఆనక్కాయ(సొరకాయ) బుర్రలో జలకం బావి నీటిని తీసుకెళ్లి ఆమెపై చల్లుతారు. దీంతో సమ్మక్క శాంతిస్తుందంటూ ఇక్కడి గిరిజనులు చెబుతారు. అదే ఆనవాయితీని నేటికి కొనసాగిస్తున్నామని చందా వంశస్తులు తెలిపారు. మాములు రోజుల్లో ఇక్కడికి వచ్చే సాహసం ఎవరూ చేయరు. జాతర సమయంలో మాత్రమే పుజారులు కాళ్లకు చెప్పులు వేసుకోకుండా వచ్చి ఆనక్కాయ బుర్రలో నీటిని తీసుకెళతారు. ఉగ్రరూపంలో ఉన్న అమ్మవారిని తీసుకెళ్లే సమయంలో జలకం బావి నీటిని ఆమెపై చల్లుతారు. ప్రస్తుతం ఈ బావి ఎలాంటి ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది.

సమ్మక్క పెండ్లి

దేవరగుట్టపై సమ్మక్కను వదిలి వచ్చిన నాటి నుంచి ఆమె అక్కడే పెరిగి పెద్దవుతుంది. క్రూర జంతువులతో ఆడుకునేదని, జలకం బావిలోనే స్నానం చేసేదని ఇక్కడి గిరిజన భక్తులు నమ్ముతున్నారు. మరోవైపు బయ్యక్కపేటలో నాగులమ్మ సైతం పెరిగి పెద్దయ్యింది. కూతుళ్లకు వివాహం చేయాలని మేడరాజు తలిచాడు. సమ్మక్కకు తన చెల్లెలి కుమారుడు మేడారం పాలకుడు అయిన పగిడిద్దరాజుతో వివాహం జరిపించాలని నిర్ణయించాడు. వారి వివాహంలో నాగులమ్మ గొడవ చేస్తుంది. ఆ గొడవలో నాగులమ్మ చేతికి ఉన్న కడియం తగిలి పడిగిద్దరాజు చేతి నుంచి రక్తం కారినట్టు చందా వంశీయులు చెబుతున్నారు. చివరకు పడిగిద్దరాజు సమ్మక్క, నాగులమ్మలిద్దరినీ వివాహం చేసుకుంటాడు. సమ్మక్కకు నాగులమ్మతో సవతి పోరు ఎక్కువవడంతో సొంతూరు బయ్యక్కపేటకు సారలమ్మతో కలిసి చేరుకుంటుంది. ఈ క్రమంలో కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు సామ్రాజ్య విస్తరణ కాంక్షతో పొలాసపై దండెత్తుతాడు. దీంతో మేడరాజు పారిపోయి వచ్చి మేడారంలో మేనల్లుడి వద్ద తల దాచుకుంటాడు. కాకతీయ సామంత రాజులైన కోయరాజు, పగిడిద్దరాజులు కరువు కాటకాల వల్ల కాకతీయులకు కప్పం చెల్లించలేకపోయారు. మరోవైపు మేడరాజుకు ఆశ్రయం కల్పించడంతో ప్రతాపరుద్రుడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాఘశుద్ధ పౌర్ణమి రోజు మేడారంపై దండెత్తుతాడు. ఈ యుద్ధంలో మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, గోవిందరాజులు మరణిస్తారు. కుమారుడు జంపన్న సంపెంగ వాగు వద్ద వీరోచితంగా పోరాడి నేలకొరుగుతాడు. అప్పటి నుంచి అది జంపన్న వాగుగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే యుద్ధంలో వీరోచితంగా పోరాడిన సమ్మక్క.. శత్రువుల చేతిలో గాయపడడంతో చిలకలగుట్ట వైపు వెళుతూ మార్గమధ్యలో అదృశ్యమవుతుంది. ఆమెను అనుసరించి వెళ్లిన వారికి ఆమె ఆచూకీ లభించలేదు. ఆ ప్రాంతంలో పుట్ట వద్ద పసుపు, కుంకుమ భరిణె లభిస్తుంది. ఆ భరిణెను సమ్మక్కగా భావించి పూజిస్తున్నారు.

తిరుగువారం..

మేడారంలో జాతర ముగిసిన 16 రోజుల తర్వాత బయ్యక్కపేటలో చందా వంశస్తులు ఇక్కడ తిరుగువారాన్ని వైభవంగా నిర్వహిస్తారు. దీనికి ఒక రోజు ముందు ఇంటికొకరు చొప్పున తలస్నానం చేసి అడవికి వెళ్లి.. రెల్లు గడ్డి తెచ్చి ఆలయం పైకప్పుపై కప్పుతారు. చుట్టుపక్కల అరుగులు వేసి ఆలయాన్ని అలంకరిస్తారు. సిద్ధబోయిన వంశస్తులు కొమ్ము, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా గుడికి తీసుకొస్తారు. ఈ సమయంలో దేవరగుట్టలో నాగులకాడి రూపంలో మెరుపు మెరుస్తుందని గిరిజనులు చెబుతున్నారు.

జాతర ఆదాయవ్యయాలపై ఒప్పందం

బయ్యక్కపేట నుంచి మేడారానికి జాతర తరలింపునకు సంబంధించి అప్పటి ములుగు తాశీల్దార్ ఆధ్వర్యంలో 6-1-1944న ఆదాయ, వ్యయాలపై ఒప్పంద పత్రం రాసుకున్నారు. అది ఇప్పటికీ ఉంది. జాతర మీద వచ్చిన ఆదాయాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం సమ్మక్క వంశీయుడు చందా పరమయ్యకు, రెండో భాగం నిజాం సర్కార్‌కు, మూడో భాగం జాతర ఖర్చులకు చెందేలా నిర్ణయించి ఇందులో పొందుపరిచారు.

జాతర పోదామా..!

మహా జాతరకు గిరిజన ప్రయాణం

- తెల్లవారు జామునే భక్తుల హడావిడి
- బస్సులో చోటుకోసం అగచాట్లు
- అడుగడుగునా పొంగిపొర్లే భక్తిభావం
- అందరి కళ్లల్లోనూ అదే ఆనందం
- వనదేవతల దర్శనానికి ఆతృత
- రాత్రికి తిరుగు ప్రయాణం

(మేడారం నుంచి మనం ప్రతినిధి బాదిని నర్సింహ)

అది హన్మకొండ బస్టాండ్. తెల్లవారుజామున 4.10 గంటలు. బస్టాండ్ ప్రాంగణమంతా కోలాహలంగా ఉంది. బస్టాండ్‌లో హైదరాబాద్‌కు వెళ్లే బస్సు మాత్రమే ఉంది. ఇంతలో కొంచెం దూరం నుంచి ఓ బస్సు వస్తోంది. అంతే క్షణాల్లో ప్రయాణికులు.. శ్రతువుపై దాడికి దిగేట్టుగా బస్సు ఎక్కేందుకు పోటీపడ్డారు. ప్లాట్‌ఫామ్ వద్దకు వస్తున్న బస్సులో ఎక్కుతూనే ఉన్నారు. ఒకరు కిటికీ లోంచి.. మరోకరు ద్వారం మీదుగా బస్సులోకి ప్రవేశిస్తున్నారు. ముందుగా తెలియని సంతోషం.. అది వారి భాష, ఆచార వ్యవహారాల, నడవడిక తీరును తెలుసుకోవాలనే ఉత్సాహంతో కూడుకున్నది. తాడ్వాయి నుంచి మేడారం వెళ్లే రహదారిలోకి బస్సు ప్రవేశించింది. అందరిలోనూ వనదేవతలు, ఆరాధ్యదైవం, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీకలైన సమ్మక్క-సారలమ్మను చూడబోతున్నామనే ఆనందం. రోడ్డు వెంట ఎటుచూసినా అడవి తల్లే కన్పిస్తోంది. ఎదురుగా వచ్చే ఒకటీ రెండు వాహనాలు తప్ప జన సంచారం పెద్దగా లేదు. ఇంకో ఐదు కిలోమీటర్లు వెళితే మేడారం చేరుకుంటామనగా రోడ్డు పక్కనే గుడారాలు కన్పించాయి. జాతరకు వచ్చిన భక్తులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక గూడారాలతో పాటు, నిత్యావసరాల విక్రయాల కోసం వెలిసిన దుకాణాలు కూడా ఉన్నాయి.

గిరిజనుల నృత్యాలు..

దర్శనానికి బయలుదేరినప్పటి నుంచి ప్రారంభమైన ఆదివాసీ, గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, భక్తుల పూనకాలు, సమ్మక్క-సారలమ్మ నామస్మరణలతో దారంతా మారుమ్రోగింది. గద్దెలు అల్లంత దూరం ఉండగానే భక్తి పారవశ్యంతో తలలను పైకెత్తి.. కండ్లు పెద్దవి చేసి.. మళ్లీ దొరకదు ఈ దృశ్యం అన్న చందంగా భక్తులు అమ్మవార్ల గద్దెల వైపు చూస్తున్నారు. దర్శనానికి చాలా సమయం పడుతున్నా.. అమ్మవారి సన్నిధిలో ఎక్కువ సేపు గడిపే అదృష్టం దొరికిందంటూ ఎంతో ఓపికగా ఆదివాసీ, గిరిజనులు ఎదురుచూశారు. అమ్మవార్ల దర్శనం చేసుకుంటూనే తమ మొక్కులు(బంగారం సమర్పించడం, ఒడిబియ్యం పోయడం వంటి) చెల్లించారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో వీఐపీలను మినహా ఎవరినీ గద్దెలపైకి చేరనీయడం లేదు. వీఐపీలు గద్దెల పైకి చేరుకునేందుకు అక్కడి సిబ్బంది గేటు తీసేదే ఆలస్యం.. వీరు కూడా గద్దెల పైకి చేరుకునేందుకు పడుతున్న తాపత్రయం ఆ క్షణంలో అద్భుతమైంది. అనంతరం పగిడిద్ద రాజు, గోవిందరాజు, నాగులమ్మ దర్శనాలు చేసుకున్నారు. ఇక సమ్మక్క అదృశ్యమైన చిలుకల గుట్టవైపు అందరి ప్రయాణం సాగింది.




అమ్మవార్లకు నాటుకోళ్ల బలి

ఇంతలో సమయం సాయంత్రం నాలుగు దాటింది. కడుపులో ఆకలి మొదలైంది. కొంతమంది భక్తులు తమ వెంట తెచ్చుకున్న సామగ్రితో వంట చేసుకున్నారు. అక్కడ నాటుకోళ్లను కొనుగోలు చేసి అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం ఎవరి భోజనాలు వారు సిద్ధం చేసుకుని ఆకలి తీర్చుకున్నారు. మేడారం పరిసరాలన్నీ వంట మసాలాల ఘుమఘుమలతో నిండిపోయింది. చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్న రీతిలో ఎక్కడ ఖాళీ జాగా కనబడితే.. అక్కడ మకాం వేశారు. కొంతమంది మందుబాబులు చేతుల్లో సీసాలు ప్రత్యక్షమయ్యాయి. భోజనాలయ్యాక చివరిసారిగా వనదేవతలకు మనసారా ప్రణమిల్లి ఇంటిబాటపట్టారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి బస్టాండ్ చేరుకున్నారు. చాలామంది రాత్రి ఇక్కడే ఉండగా.. మరికొంతమంది హన్మకొండకు చేరుకున్నారు. అక్కడి నుంచి వారి వారి ప్రాంతాలకు తరలివెళ్లారు. మొత్తం మీద మొదటిసారి నా మేడారం యాత్ర ఎన్నో అద్భుతమైన మధుర జ్ఞాపకాలను మిగిల్చింది.

చిలుకల గుట్ట దర్శనం..

గద్దెల నుంచి దాదాపు కిలోమీటరు మేర కాలినడక వెళ్లగా.. చిలుకల గుట్ట దర్శనమైంది. కానీ దానిపైకి చేరుకునేందుకు అటవీ అధికారులు అనుమతించడంలేదు. గుట్ట పైకి వెళ్లేందుకు వీలుగా ఉన్న ప్రాంతమంతా ప్రహరీ నిర్మించి గేటును ఏర్పాటు చేశారు. కాపలాగా పది మంది అటవీ పోలీసు సిబ్బందిని నియమించారు. ఒక్కసారైనా చిలుకల గుట్టను తాకాలని ఆదివాసీ, గిరిజనుల ఆరాటం. కానీ అందుకు సిబ్బంది ఒప్పుకోవడం లేదు. కొంతమంది భ క్తులు ఎంతో దీనంగా భక్తి పారవశ్యంతో బ్రతిమిలాడినా సిబ్బంది కనికరించలేదు. భక్తులు ఆగ్రహంతో నిస్సహాయ స్థితిలో అటుపక్కగా ఉన్న చెలిమె నుంచి నిరంతరం నీరు జాలువారే ప్రాంతానికి చేరుకున్నారు. సన్నని ధారగా ఆ నీరు సమ్మక్క ప్రమేయంతోనే ప్రవహిస్తుందనేది భక్తుల నమ్మకం. ఆ నీటిని సర్వరోగ నివారిణిగా భావిస్తారు. అలాగే సర్వ పాపాలనూ హరించి వేస్తుందని నమ్ముతారు.

సల్లంగ సూడు సమ్మక్కా..



ఎక్కిన[illegible], నుంచి చే[illegible] ఓ ఆ[illegible]బస్సుల్లో స[illegible] కొన్ని బ[illegible] బ[illegible] రకు భావం ప్ర[illegible] దూరంలోనే ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటుచేసింది. భక్తులు చే[illegible]గా గద్దెల[illegible] జంపన్న[illegible] బాట పట్టారు. మరికొంత మంది భక్తులు విడిది చేసేందుకు ఉ[illegible]. ఇళ్ల అద్దెలు విపరీతంగా ఉండడంతో చాలామంది ఆరుబయట, చెట్ల ఆ[illegible]. జంపన్న వాగుకు చేరుకుని భక్తులు స్నానమాచరిస్తున్నారు. మరికొంత మంది త[illegible]మోటార్ల ద్వారా ఏర్పాటు చేసిన నల్లాల వద్ద చేస్తున్నారు. స్నానాలు ముగిశాక.. వారి స[illegible]దాయాల ప్రకారం.. అమ్మల దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలో నిలువెత్తు బంగారం ఏ[illegible]మర్పించేందుకు బెల్లం కొనుగోలులో మునిగి ఉన్నారు. మరికొంత మంది తమకు చేతనైనంత బంగారాన్ని కొనుగోలు చేశారు. బంగారాన్ని తలలపై మోస్తూ గద్దెల వద్దకు చేరుకున్నారు.

గజం.. ఐదువేలు!


- విద్యుత్ కనెక్షన్‌కు రూ.6 వేలు
- ఎమ్మార్వీపై 3 రెట్లు పెరిగిన ధరలు
- గదుల కిరాయి రూ.15 వేల పైమాటే
- జాతరలో భక్తుల నిలువు దోపిడీ

(మేడారం నుంచి మనం ప్రతినిధి బాదిని నర్సింహ)

మేడారంలో గజం ధర ఐదు వేలు.. ఏంటి కొనడానికి అనుకుంటున్నారా? కాదండి.. ఓ నాలుగు రోజులకు చెబుతున్న అద్దె మాత్రమే! సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో మేడారం, పరిసర ప్రాంత గ్రామాల్లోని భూముల అద్దెలకు రెక్కలొచ్చాయి. మిగతా రోజుల్లో ఈ భూముల్లో అడుగుపెట్టే నాథుడు ఉండడు. కానీ జాతర సందర్భంగా ఏర్పాటయ్యే దుకాణాలకోసం భూ యజమా నులు నిర్వాహ కుల నుంచి కేవలం గజం భూమికి రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారు. రెండేండ్లకోసారి వచ్చే అవకాశం కావడంతో ఖాళీ జాగాకే ఇంత భారీ మొత్తాన్ని వసూలు చేస్తున్నారు. ఇక అద్దెగదుల విషయానికొస్తే.. పట్టుమని పది అడుగులులేని గదికి జాతర పూర్తయ్యేంతవరకు ఉంటే.. రూ.15 వేల నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నారు. కొంతమంది ఇళ్ల యాజమానులు వారు ఆరుబయట ఉంటూ జాతరకు వచ్చే భక్తులకు అద్దెకు ఇస్తున్నారు. శాశ్వత భవనాలు లేనివారు.. తమ భూముల్లో గొనెసంచుల(పట్టాలు)తో తాత్కాలిక గూడారా లను వేసి రోజుకు రూ.500 చొప్పున అద్దెకు ఇస్తున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో మేడారంలో దుకాణాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకుల నుంచి ఇటు భూయజమానులు.. అటు అటవీ, విద్యుత్ శాఖ అధికారులు భారీగా గుంజుతున్నారు. భూయజమానులు గజం భూమిని రూ.5 వేలకు ఇస్తే.. దుకాణానికి విద్యుత్ కనెక్షన్ నిమిత్తం రూ.6 వేలు వసూలు చేస్తున్నారు. దుకాణం ఏర్పాటుకు కావాల్సిన గూడారాన్ని వేసేందుకు స్థానికంగా ఉండే కూలీలు రూ.4 వేలు వసూలు చేస్తున్నారు.

2న మేడారానికి వెంకయ్య





వరంగల్, జనవరి 29, మనంన్యూస్‌: దేశంలో గిరిజన కుంభమేళాగా పేరొందిన మహాజాతర మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతోపాటు కేంద్ర గిరిజనశాఖ మంత్రి ఫిబ్రవరి 2వ తేదీన రానున్నారు. ఇప్పటికే మేడారం క్యాంపులో ఉన్న హెలిప్యాడ్‌తోపాటు అదనంగా రెండు తాత్కాలిక హెలిప్యాడ్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రముఖులు రావడానికి ఒకరోజు ముందే హెలిప్యాడ్లను సిద్ధం చేయనున్నారు. అధినేతలు హాజరవుతున్నందున హెలిప్యాడ్ల పనుల ఏర్పాట్లను, ఇతరత్రా భద్రతా ఏర్పాట్లను ఆ జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు.

అద్భుతం ఆదివాసీ మ్యూజియం

(మేడారం నుంచి మనం ప్రతినిధి బాదిని నర్సింహ)

ఆదివాసీ, గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతిబింబం ఆ మేడారం మ్యూజియం. రూ.2.5 కోట్లతో ఐదెకరాల స్థలంలో గిరిజనుల సంస్కృతి, ఆచార వ్యవహారాల ను ప్రతిబింబించేలా కళాకృతులతో ఏర్పాటు చేశారు. దాదాపు 15 కోయగూడా ల్లో సేకరించిన కళారూపాల ను మ్యూజి యంలో ప్రదర్శనకు ఉంచారు. ఇందులో భాగంగానే సమ్మక్క జీవిత విశేషాలు, గిరిజనుల సంప్రదాయాలు తెలిసే విధంగా కళాకృతులను ఏర్పాటు చేశారు.సమ్మక్క-సారలమ్మ చరిత్ర సులభంగా అర్థమయ్యేలా శిల్పాల రూపంలో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఐదెకరాల స్థలంలో ఏర్పాటైన మ్యూజియం ఆవరణలోనే పెద్ద శిల్పాలను ఉంచగా, చిన్న శిల్పాలను మ్యూజియం లోపల ఏర్పాటు చేశారు. ఆదివాసీ, గిరిజనుల సంస్కృతులు, ఆచార వ్యవహారాలు తెలిపే 30 చిత్రాలను గోడలపై ఉంచారు. జాతర వైభవం, ఆచార వ్యవహారాలు, కోయల నృత్య విశేషాలకు సంబంధించి వీడియోనూ ప్రదర్శిస్తున్నారు. రాక్షసగూళ్లు, రాతియుగం నాటి గుహ చిత్రాలను ఇక్కడ చూసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆదివాసీ గూడెల్లో శుభకార్యాలకు సంప్రదాయ ప్రకారం.. తలపై బర్రె కొమ్ములను ధరించి చేసే నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ నృత్యం సందర్భంగా ఆదివాసీలు ధరించే తలపాగ, బర్రె కొమ్ములను(12 ఫీట్ల ఎత్తు, 20 ఫీట్ల వెడల్పు) అమర్చారు.



మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

మంగళవారం, జనవరి 30


రాజకీయ 'అస్తిత్వం'

ఆర్థిక కార్యకలాపాల కొనసాగింపే రాజకీయాలని పాశ్చాత్య మేధావి ఒకరు సరిగానే నిర్వచించారు. అయితే భారత్ తదితర పూర్వ పెట్టుబడిదారీ (ప్రీ క్యాపిటలిస్ట్) దేశాలలో మాత్రం సామాజికార్థిక కార్యకలాపాల కొనసాగింపుగా రాజకీయాలు ఉంటాయి. ప్రధాన స్రవంతి రాజకీయాలు సమాజంలోని ఆర్థిక ఆధిపత్య శక్తులు, సాంఘిక ఆధిపత్య శక్తుల ప్రయోజ నాలను ప్రతిబింబించే ప్రబల రాజకీయాలుగా కొనసాగుతుండడం కద్దు. ఈ నేపథ్యంలో భారత రాజకీయాలు సామాజిక అస్తిత్వంలోని కుల వ్యవస్థ, వర్గ వ్యవస్థల జమిలి స్వభావాన్ని సంతరించుకున్నాయి. ఈ సైద్ధాంతిక అవగాహనతో కాకపోయినా, ఈ భావం స్ఫురించేట్లుగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో 'వ్యాపారంలో జాతీయవాదం, నైతిక అభ్యాసాలు'అనే అంశంపై గురువారం ఆర్ఎస్సెస్ అధినేత మోహన్ భగవత్ ప్రసంగించారు. 'సమాజంలో నడుస్తున్న నైతిక ప్రవర్తనలు రాజకీయాల్లోనూ ప్రతిబింబిస్తుంటాయి. ఉదాహరణకు కులమత రాజనీతి మనం వద్దనుకున్నా.. సమాజంలో కులమత ప్రాతిపదికన మాత్రమే ప్రజలు ఓట్లు వేస్తుంటారు. కాబట్టి మనం కూడా కులమత రాజకీయాలు చేయక తప్పడం లేదు. రాజకీయంగా ఉనికిలో ఉండగలిగితేనే గదా, మార్పు తీసుకురావడం సాధ్యమవుతుంది. అయితే సామాజిక పరివర్తన ద్వారానే రాజకీయాల్లో మౌలిక మార్పు వస్తుంది కానీ, రాజకీయాలు మారినంత మాత్రాన సమాజ స్వభావంలో మార్పు రాదని భగవత్ సందేశమిచ్చారు. సమాజ స్వభావానికి అనుగుణంగానే రాజకీయాలుంటాయని, కుల-మత స్వభావంతో ఉన్న భారతీయ సమాజంలో కులతత్వ, మతతత్వ రాజకీయాలు తప్పవని ఆయన వ్యాఖ్యానించారు. సామాజిక స్వభావానికి అనుగుణంగానే ఇక్కడ వామపక్ష, దక్షిణ పక్ష రాజకీయాలు రెండూ కుల-మత తత్వ రాజకీయాలపైనే ఆధారపడి రాజకీయాలు నిర్వహిస్తున్నాయి. ఎన్నికల్లో ఓట్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. దాంతో ఆర్ఎస్సెస్-బీజేపీ ప్రాపంచక దృక్పథంలో చోటు చేసుకున్న కుల రాజకీయాలు హిందువుల్లో రాజకీయ ఐక్యత సాధించేందుకు అడ్డంకిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, రాజకీయ పరాయికరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు వెనుకబడిన కులాలకు కుల రాజకీయాలు ఒక సాధనంగా ఉపకరిస్తున్నాయనే భావనను ఆయన తిరస్కరిస్తున్నారన్న విషయాన్ని ఆ ప్రసంగం ధ్రువీకరిస్తోంది. సంఘ్ పరివార్ సంస్థల 'ఏకీకృత హిందూ అస్తిత్వం' నినాదంతో సాగిస్తున్న రాజకీయ జైత్రయాత్రకు ఈ కుల ఉద్యమాలు పెద్ద అడ్డంకిగా తయారయ్యాయనేదే ఆయన ఆవేదన.

కులవ్యవస్థను పెద్దగా పట్టించుకోని వర్గం, జాతీయత, మత భావ జాలాలతో ఉన్న రాజకీయ పక్షాలు సైతం అణచివేత, పరాయికరణ నినాదాలతో కుల, మత, జాతి, ప్రాంత తదతర సామాజిక అస్తిత్వ డిమాండ్‌లను ఓట్ల కోసం ముందుకు తెస్తున్నాయి. దేశంలో కులవ్యవస్థ రూపంలో సామాజిక వివక్ష ప్రబల అంశంగా కొనసాగుతుండడంతో, ఎన్నికల్లో గెలుపు కోసం దేశంలోని వామ/దక్షిణ రాజకీయ పక్షాలన్నీ బహిరంగంగా లేదా రహస్యంగా కుల రాజకీయాలను ఆశ్రయిస్తున్నాయి. ఉదాహరణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా ఓబీసీ అస్తిత్వానికి చెందిన నాయకులను బీజేపీ ప్రముఖ స్థానాల్లోకి తీసుకొచ్చింది. హిందుత్వ పరిధిలోనే వివిధ వెనుకబడిన కులాలు, సమూహాలను, వారి ఆకాంక్షలను అంతర్భాగం చేస్తూ వివిధ అస్తిత్వ (కుల, మత, జాతి, ప్రాంత తదితర) సంస్థలతో బీజేపీ ఎన్నికల పొత్తులను విజయవంతంగా ఏర్పాటు చేస్తోంది. సమాజంలోని కుల వ్యవస్థ శక్యతను గుర్తించిన వామపక్షాలు సైతం కుల అగ్రవర్ణ వ్యతిరేక ఉద్యమాలను, కుల వివక్ష/ నిర్మూలన వ్యతిరేక పోరాట సంఘాలను నిర్మించక తప్పలేదు. ఎన్నికల సమయంలో వివిధ అస్తిత్వ సంస్థలతో వామపక్షాలు ఎన్నికల పొత్తులను సైతం ఏర్పరచుకున్నాయి. సామాజిక, రాజకీయ సమీకరణలో కులాన్ని ప్రాథమిక అంశంగా రాజకీయ సంస్థలు సూత్రీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. గత శతాబ్దంలో చివరి అర్ధ భాగంలో నడిచిన అగ్రవర్ణ వ్యతిరేక ఉద్యమాలు దేశవ్యాప్త రాజకీయ సరళినే మార్చివేసింది. మతతత్వ పార్టీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ సైతం అందుకు మినహాయింపు కాదు.

కుల వ్యవస్థపై ఆధారపడి అమానవీయ సామాజిక వ్యవస్థను రూపుమాపే లక్ష్యంతో ప్రారంభమైన కుల అస్తిత్వ ఉద్యమాలు ప్రారంభంలో సామాజిక న్యాయ ఆదర్శాలను రాజకీయాల్లో ముందుపీఠిన నిలిపింది. ఆ ఆదర్శం నేపథ్యంలో అనేక విధాన నిర్ణయాలు జరిగేందుకు దోహదం చేసింది. ఆ తర్వాత ఆ ఉద్యమాలు క్రమంగా వెర్రితలలు వేసి, ఆయా కులా లు మరింతగా సంఘటితమయ్యేందుకు, వైషమ్యపూరితంగా మారేందుకు దోహదం చేసింది. ఆ తర్వాత అవి క్రమంగా సవ్యమైన సామాజిక పరిణామానికి దోహదం చేయడంలో వెనకబడిపోయి, రాజకీయ పక్షాల ఓటు బ్యాంకు సమీకరణల్లో గిడసబారి పోయాయి. ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో కుల రాజకీయాలు కుటుంబ ఆరాధ్య రాజకీయాలుగాను, దక్షిణాదిలో వివిధ రాజకీయపక్షాల అధికార ప్రాపకం-పంపిణీ సమీకరణాల్లో భాగం కావడం దురదృష్టకరం. సమాజంలో కుల అణచివేతకు గురవుతున్న నిజ అస్తిత్వ ప్రజానీకపు మౌలిక ప్రయోజనాలకు భిన్నంగా కొద్ది మంది రాజకీయాలు, ఉద్యోగాలు తదితరాల్లో వాటాకు మాత్రమే పరిమితమైన అస్తిత్వ ఉద్యమాలుగా మారడం దురదృష్టకరం. అణగారిన కులాలకు రాజ్యాధికారం రావడం అంటే మౌలిక సామాజిక మార్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వాధికారం కోసం కుమ్ములాడుకునే రాజకీయ పార్టీల్లోనూ, ప్రభుత్వాల్లోనూ అధికార స్థానాల వాటాల కోసం కొట్లాడటం కాదు. అణచివేతకు గురవుతున్న సామాజిక సమూహాల మౌలిక విముక్తి లక్ష్యంతో సాగే రాజకీయ కార్యాచరణ లేని కుల అస్తిత్వ రాజకీయాలు సమాజ పురోగతికి దోహదం చేయవు. సమాజంలో కుల వ్యవస్థ అధికార కేంద్రాలు చెక్కుచెదరకుండా నిలిపి ఉంచుతూ, కుల అస్తిత్వాన్ని వినియోగించుకొని నడుస్తున్న ప్రస్తుత రాజకీయాలు సామాజిక సంబంధాలపై కులంపట్టు మరింత బిగిసేందుకు దోహదం చేస్తున్నాయి.

అమ్మకు వందనం



ఆమె...
కొండంత బాధను సంతోషంగా భరించి
నీకు 'జన్మ' నిచ్చి మురిసిపోయింది
తన ఆశలు... ఆకాంక్షలు
సుఖసంతోషాలు
నిద్రాహారాలు... అన్నీ కలగలిపి
నీ చుట్టూ ప్రేమ సామ్రాజ్యాన్ని నిర్మించి
నిన్ను పట్టాభిషిక్తుడిని చేసింది...
ఆమె వన్నీ నీకిచ్చి... ఆమె అంతమై
''అమ్మ''గా పునర్జన్మించింది...


అమ్మ నవ్వవు... నువ్వే
అమ్మ నడకవు... నువ్వే
అమ్మ బాధవు... నువ్వే
అమ్మ అణువణువూ... నువ్వే

ఇంతెందుకు... అమ్మ ఊపిరి... నువ్వే
ఏ జన్మకైనా.. ఆ 'అమ్మ'కు అమ్మవై రుణం తీర్చుకునే భాగ్యం వుందో! లేదో!

- కాసర లక్ష్మీ సరోజా రెడ్డి
జంగారెడ్డిగూడెం
9440332632



మంచిమాట



'విజయం సాధించేందుకు ప్రయత్నించవద్దు. విలువలు కలిగిన మనిషిగా తయారయ్యేందుకు ప్రయత్నించు.'

- ఆల్‌బెర్ట్ ఐన్‌స్టీన్

స్వయం పాలనా పోరాట స్ఫూర్తి

ఏ పురాణాలు, ఏ చరిత్ర కొనియాడని త్యాగమూర్తులు ఆదివాసీలు తమ గుండెల్లో గుడికట్టి పూజిస్తున్న వీరవనితలు 'కప్పం కట్టను' అన్న ప్రతివారికీ ఓ జ్ఞాపకం. తన జాతి కోసం, నమ్ముకున్న విలువల కోసం ఆదివాసీల స్వయంపాలన కోసం ప్రాణాలనూ త్యజించిన మరణం తరువాత కూడా జనం గుండెల్లో బతకొచ్చు అని నిరూపించిన వీరవనితలు సమ్మక్క సారక్క. కాకతీయుల పాలనపై కత్తిదూసిన ఆదివాసీ బిడ్డలు సమ్మక్క సారక్కలు. పనిధీనత నుంచి స్వేచ్ఛాయుత పాలన కోసం సమ్మక్క సారలమ్మలు కాకతీయుల సైన్యంతో పోరాడి ఆత్మత్యాగాలు చేశారు. ఇంతటి చారిత్రక సాంస్కృతిక పోరాటచరిత్ర పట్ల నిర్లక్ష్యం, వక్రీకరణ జరిగింది. ఆదివాసీల మనోభావాలకూ ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆదివాసీల చరిత్రనూ చరిత్రగా లిఖించలేదు. ప్రభుత్వాలు కూడా పట్టించుకోవట్లేదు. కానీ ఆదివాసీ జాతరలో అభివృద్ధిలో, జాతర ఆదాయంలో భాగమైనారు. తెలంగాణలోని వరంగల్ జిల్లాలో జరిగే మేడారం జాతర ప్రతి రెండేండ్లకోసారి జరుగుతుంది. అది పోరుబిడ్డల జాతర. అవునన్నా కాదన్నా అది ఉద్యమస్మరణ జాతరే. సమ్మక్క సారలమ్మగా కొలవబడుతున్న ఆదివాసీ ముద్దుబిడ్డలు వారు. ఆదివాసీ తెగలో పుట్టినా ఉద్యమ దివిటీలు. సమన్యాయం కోరుకున్న వనితలు. వారు అక్కా చెల్లెళ్ళయినా, తల్లీ బిడ్డలయినా, ఎలా పిలిచినా వారు పోరు ప్రతీకలు. 12వ శతాబ్దంలో కాకతీయుల రాజ్యపాలన కొనసాగుతున్న కాలం. కాకతీయులకు సామంతులుగా ఉన్న రాజులు-ఈ అడవి బిడ్డలను అన్ని రకాలుగా చిత్రహింసల పాలు చేశారు. అది రాజ్య స్వభావం కూడా! దాన్ని ఎదిరించిన వారిని మట్టుబెట్టారు. ఆ నేపథ్యంలోనే సమ్మక్క, సారలమ్మలు దండయాత్ర కొచ్చిన సైన్యాన్ని ఎదుర్కొన్నారు. ఆ రాజరికపు ప్రభువుల్ని ఆదివాసీ బిడ్డలు ఎదిరించారు. రాజరికపు ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. పొద్దంతా చేసిన కష్టాన్ని రాజ్యం పేరుతో పన్నుల రూపంలో దోచుకునే తీరును నిరసించారు. అడవి బిడ్డల వద్ద రాజ్యాలు దోపిడీ చేయడం చూసి చలించిపోయారు ఆ వీరవనితలు. కాకతీయ రాజు రుద్రదేవుడు రాజ్యకాంక్షతో మేడారంపై దండెత్తాడు. వీరి మధ్య జరిగిన బీకర పోరులో పగిడిద్దరాజు (సమ్మక్క భర్త), సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు వీర మరణం పొందారు. జంపన్న సంపెంగ వాగులో దూకి చనిపోయాడు. సమ్మక్క వీరోచిత పోరాట దాటికి తట్టుకోలేని శత్రువులు వెనక నుంచి బల్లెంతో పొడిచారు. శత్రువునూ హతమారుస్తూ మేడారానికి తూర్పుదిశగా చిలకలగుట్టవైపు సాగుతూ సమ్మక్క అదృశ్యమైంది. ఆమె జాడ తెలియదు. ఆ తరువాత చిలకలగుట్ట వద్ద పసుపు కుంకుమ భరణిలతో ప్రత్యక్ష్యమైనదని ఒక నమ్మకం. వారి కుటుంబం అంతా యుద్ధంలో నేలకొరిగారు. అందుకే నీతినిజాయితీ ఎలాంటి కల్మషం లేని ఆదివాసీలు తమ హక్కుల కోసం, స్వయం పాలన కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గుర్తుంచుకున్నారు. ఒకతరం కాదు, రెండుతరాలు కాదు దశాబ్దాలు గడుస్తున్న నేపథ్యంలో సమ్మక్క సారలమ్మపై మమకారం ఎక్కువైన కొద్దీ దైవాలుగా కొలుస్తున్నారు. మనుష్యులే దైవాలు అని చెప్పిన మాట ఈ వీరవనితల విషయంలో నిజమని నిర్ధారిస్తుంది చరిత్ర. యావత్ ప్రపంచం అంతా ఆశ్చర్యపోయేలా జరిగే మహత్తర జాతర ఇది. ఇంత పెద్ద ఆదివాసీ జాతర ప్రపంచంలో ఎక్కడ కూడా జరగదు. ఇది తొలి ఆదివాసీ జాతర గా చెప్పవచ్చు. ఆదివాసీలు, ఆదివాసేతరులు లక్షలాదిగా తరలివచ్చే ఎంతో ప్రకృతి రమణీయమైన జాతర. మేడారం జాతరలో విగ్రహ ఆరాధన ఉండదు. ఎలాంటి బ్రాహ్మణాధిపత్య భావజాలం లేని ఆదివాసీ జాతర. కేవలం ప్రకృతి ఆరాధన, పసుపు, కుంకుమలు తప్ప మరే ఇతర ఆచా రాలు ఉండని జాతర.

ఏదో ఒక పేరుతో ఆదివాసీలను అడవి నుంచి వెళ్ళగొట్టాలనే కుట్రలు మన ప్రభుత్వ విధానాలుగా ఉన్నాయి. ఇక్కడ జాతర విషయంలో ఆటంకాలు వస్తూనే ఉన్నాయి. పోరు బిడ్డలను ఆరాధించడం అంటే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవడమే అవుతుంది. అందుకే ఆధ్యాత్మికతనూ జోడించి ప్రశ్నించేతత్వాన్ని పారదోలేందుకు కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. భక్తి పేరుతో మన చట్రంలోకి ఆదివాసీల్ని నెట్టే ప్రయత్నాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది కోటీ 30 లక్షల మంది రానున్నారు. మేడారం జాతరకు అంతర్జాతీయ ఖ్యాతి వస్తుండటంతో మేడారంపై కార్పొరేట్ కంపెనీల దృష్టి పడింది. అసలు మేడారం జాతర నేపథ్యాన్ని, సమగ్ర చరిత్రనూ వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ఆదివాసీ రచయితల సంఘంపై ఉన్నది. సంస్కృతి, సంప్రదాయం భావనల్ని సరిగ్గా అర్థం చేసుకోగలిగినప్పుడే మేడారం జాతర అర్థం అవుతుంది. అడవిని నమ్ముకుని జీవించే ఆదివాసీల రాగాలాపన ఈ మేడారం జాతరలో కనిపిస్తుంది. ఆదివాసీల ప్రాకృతిక ఆరాధనకు, ఆధిపత్య ప్రతిఘటనకు ప్రతీకగా ఈ మేడారం జాతర నిలుస్తుంది. ఆధిపత్య సంస్కృతుల్ని సవాల్ చేస్తూ ప్రత్యామ్నాయ సంస్కృతుల్ని రూపొందించుకునే క్రమానికి స్థానిక ఆదివాసీ సమాజం ఎదిగింది. అందువల్లనే ప్రకృతిని తప్ప మరో



> ఆదివాసీల చట్టాలు, జీఓలు రాజ్యాంగ రక్షణలు, భూములు ఏలాగూ పోయాయి. కుట్ర కుతంత్రాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు కాకతీ యులపై కత్తులు దూసి ఆదివాసీ స్వయంపాలన కోసం పోరాడిన సమ్మ క్క సారలమ్మ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని మేడారం జాతర నూ కాపాడుకోవాలి. ఆదివాసీ సంస్కృతిని రక్షించుకోవాలి.

మనిషి ముందు సాగిలపడే సంస్కృతికి ఆదివాసీ సమాజంలో స్థానం లేదు. ఇదే అత్యంత రమణీయమైన ఆదివాసీ జాతర. బ్రాహ్మణ ఫ్యూడల్ మంత్రతంత్రాల ప్రసక్తి లేదు. నిరర్థకమైనా క్రతువులకు చోటులేదు. అంతటా ప్రకృతికి మానవ మాతృస్వామ్యానికి పెద్దపీట వేయటం ఈ జాతరలో కనిపించే దృశ్యం. ప్రభుత్వం నేడు ఈ ఆదివాసీ జాతరపై కన్నేసి ఆధిపత్యం చేయడం ద్వారా గిరిజనేతరుల జోక్యం కల్పించేందుకు చూస్తున్నది. బ్రాహ్మణైజేడ్ చేయాలని చూస్తున్నది. మరోవైపు మేడారం జాతరనూ జాతీయహోదా, జాతీయపండుగగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అధికారికంగా కోరింది. మరో రెండు సంవత్సరాల్లో ఆ హోదా కూడా మేడారం జాతరకు రాబోతోంది. అదేకనుక వస్తే ఆదివాసీల అస్తిత్వం అంతం అవుతుంది. మేడారం జాతరపై పాలకవర్గాల ఒత్తిడి, ఆధిపత్యం ఎక్కువవుతుంది. ఆదివాసీలు జాతరకు దూరమవుతారు. గిరిజనేతరుల వలసలు, ఆధిపత్యం ఎక్కువై జాతర నిర్వహణ గిరిజనేతరుల చేతిల్లోకి, దేవాదాయ శాఖలోకి పోతుంది. ఆదివాసీల పోరాట చరిత్ర కనుమరుగవుతుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సగం వాటా వేసుకుంటున్నది. సౌకర్యాలు కల్పించటంలో విఫలం అయింది. ఆదివాసీలకు విగ్రహారాధన లేదంటూనే బంగారు విగ్రహాలు సమ్మక్క సారక్కలకూ చేయించాలనే కుట్ర కనిపిస్తున్నది. ఈ కుట్ర కుతంత్రాలను ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారు. ముందుముందు పెద్దపెద్ద దేవాలయాలు మేడారంలో నిర్మించినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. బ్రాహ్మణ పూజారులు ఈ దేవాలయంలో తిష్టవేస్తారు. ఇట్లా జరగటం చరిత్రలో కొత్తేమీ కాదు. చెంచులకు ఇప్పటికే అన్యాయం జరిగింది. శ్రీశైలంలో ఉన్న చెంచు మల్లన్న దేవాలయంలో ఇప్పుడు చెంచు పూజారులు ఎక్కడున్నారు? బ్రాహ్మణులు, లింగాయతులే అర్చకులుగా ఉన్నారు. పాలకవర్గాల పెత్తనం పెరిగిపోతే సమ్మక్క సారక్కలకు కోయలు దూరం అవుతారు. మరోవైపు మేడారం జాతర నిర్వహిస్తున్న తీరుపట్ల మేడారం ఆదివాసీలలో అసంతృప్తిని రగిలిస్తోంది. మేడారంలో ఆదివాసీల పరిస్థితులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు.

మెయిన్ రోడ్డులో ఉన్న ఒకటి రెండు తప్పితే కరెంట్ స్తంభాలు లేవు. కన్నెపల్లిని కూడా అభివృద్ధి చేయటం లేదు. మేడారం జాతర వల్ల ఆదివాసీలు వేసే ఆ రెండో పంట నష్టం అవుతోంది. అక్కడ బ్లేడు ట్రాక్టర్లనూ పెట్టి చదును చేసి సరిహద్దులు చెరిపివేస్తున్నారు. అక్కడ కోయల భూములు బలవంతంగా తీసుకుంటున్నది. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నది. కల్పించటం మంచిదే కానీ రెండోపంట వేసుకొనే అవకాశం దూరం అవుతుండటం వల్ల ఆదివాసీలకూ నష్టపరిహారం చెల్లించాలి. జాతర అయిన రెండు నెలలు ఆ ప్రాంతమంతా దుర్వాసనతో భరించరాని విధంగా ఉంటుంది. అక్కడ స్థానిక ఆదివాసీలు రోగాల బారిన పడతారు. అందువల్ల జాతర ముగిసిన వారంరోజుల తరువాత ఆ ప్రాంతాన్ని, వారి భూములనూ శుభ్రంచేయాలి, వ్యర్థాలనూ తీసివేయాలి. రెండో పంటకు నష్టపరిహారం చెల్లించాలి. మేడారం జాతర నిర్వహణలో పెట్టి ఆధిపత్యం చెలాయించాలనే పాలకుల కుట్రలకు వ్యతిరేకంగా నేడు ఆదివాసీ కోయలు పోరాడుతున్నారు. అన్ని హిందూ దేవాల యాల లాగానే ట్రస్ట్ ఏర్పాటు చేసి లంబాడీలను, గిరిజనే తరులను, అగ్రవర్ణాల వారిని సభ్యులుగా పెడుతున్నారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు తెలియని వారిని ట్రస్ట్ బోర్డ్‌లో నియమించి కోయలను మేడారం జాతరకు దూరం చేయాలనే కుట్ర, సమ్మక్క సారలమ్మలను హిందూ దేవతలుగా గుర్తించే కుట్ర, మేడారాన్ని బ్రాహ్మణీయం చేయాలనే కుట్ర, మేడారం జాతరపై లంబాడీలు ఆధిపత్యం చెలాయిం చాలనే కుట్ర, ఆదివాసీల అస్తిత్వం అంతం చేయాలనే కుట్రలు, కుతంత్రాలు జోరుగా నడుస్తున్నాయి.


నేడు దేశంలో రాష్ట్రంలో ఆదివాసీల రిజర్వేషన్స్, ఉద్యోగాలు, భూములు, ఆదివాసీల అమాయకత్వాన్ని గిరిజనేతర సామ్రాజ్యవాదం అంతం చేస్తున్నది. గిరిజనేతర సామ్రాజ్యవాదం నేడు మేడారం జాతరపై పడి దోచుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నది. ఆదివాసీల అస్థిత్వంపై దాడి జరుగుతుంది. ఆదివాసీలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిపే మేడారం జాతరనూ సైతం ఆక్రమించుకోవాలని, గిరిజనేతరులు, లంబాడీలు ప్రయత్నించడం ఆదివాసీలను అణగదొక్కడమే అవుతుంది. ఆదివాసీల సంస్కృతిని సైతం సర్వనాశనం చేయాలని పాలకులు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివాసీల చట్టాలు, జీఓలు రాజ్యాంగ రక్షణలు, భూములు ఏలాగూ పోయాయి. కుట్ర కుతంత్రాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు కాకతీయులపై కత్తులు దూసి ఆదివాసీ స్వయంపాలన కోసం పోరాడిన సమ్మక్క సారలమ్మ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని మేడారం జాతరనూ కాపాడుకోవాలి. ఆదివాసీ సంస్కృతిని రక్షించుకోవాలి. మేడారం జాతరపై గిరిజనేతరులు ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడాలి.

◆ వూకె రామకృష్ణ దొర
ఆదివాసీ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు
9866073866

ఆగని అన్నదాతల ఆర్తనాదం

దేశంలో వ్యవసాయ రంగం ఏటేటా అతివృష్టి లేకపోతే అనావృష్టి కోరల్లో విలవిలలాడుతుంది. అందువల్ల ఈ రంగంలోని కొన్ని అంశాలలో సంస్కరణలు చేపట్టవలసి ఉంది. దేశంలో ఆహార భద్రతకు ఢోకా లేని నేపథ్యంలో వ్యవసాయాభివృద్ధి మందకొడిగా ఉందని చెప్పవచ్చు. ఆహార భద్రత ఇప్పుడొక సమస్య కాకపోయిన ప్పటికీ వ్యవసాయరంగంలో ప్రపంచ దేశాల మధ్య పోటీలు పెరిగిన దృష్ట్యా భారత ప్రభుత్వం ఈ రంగాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఏర్పడింది. నేటికి ఆర్థిక రంగంలో వ్యవసాయం బలమైన శక్తి అని, అన్ని రంగాలు దీని చుట్టూ పరిభ్రమిస్తాయనే విషయాన్ని విస్మరించారు. మరి వ్యవసాయం అభివృద్ధి సాధించాలంటే దానికి వెన్నుముఖ గ్రామ రైతు. గాంధీజీ చెప్పినట్లు గ్రామ స్వరాజ్యం గ్రామం నుంచి మొదలవుతుంది. దేశ ప్రగతికి పట్టుకొమ్మలు గ్రామాలని చెప్పవచ్చు. రోజు రోజుకు వ్యవసాయం చేసే వారి సంఖ్య తగ్గిపోతుంది. వ్యవసాయం తగ్గడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. అలాగే వాటికి అడ్డంకులు, సంస్కరణలు కూడా ఖచ్చితంగా అవసరమని చెప్పకనే చెప్పవచ్చు.

దురదృష్టవశాత్తు ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేయడానికి వ్యవసాయం శక్తివంతమైన సాధనం అనే విషయాన్ని భారత విధాన నిర్ణేతలెవరూ గ్రహించడం లేదు. ఆర్థిక, సంస్కరణలు ఊపందుకున్న తర్వాత ఆర్థిక పెరుగుదలకు వాణిజ్య, పారిశ్రామిక రంగాలపైనే దృష్టిని కేంద్రీకరించారు. వ్యవ సాయ రంగాన్ని కూడా పరిశ్రమగా గుర్తించే విషయంలో నేటి వరకు చిత్తశుద్ధిగా ప్రయత్నం జరగలేదనే చెప్పాలి. వ్యవసాయాభివృద్ధి మందకొడిగా ఉండడం, లాభాలు తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశాలలో ముఖ్యమైనవి. ఈ పరిస్థితిని నివారించడం నేటికి జరగలేదనే చెప్పాలి. ఇంతవరకు వ్యవసాయ రంగంతో ప్రమేయం ఉన్న ప్రతి రంగం దేనికదే విడివిడిగా వ్యవహరించిందే తప్ప అవి పరస్పర సమన్వయంతో కుంటుపడడానికి ఇది కూడా ముఖ్య కారణం. వ్యవసాయాభివృద్ధికి ఈ గందరగోళ పరిస్థితి నివారించాలన్నది అందరూ అంగీకరించిందే. అయితే లాభాల కోసం వ్యవసాయాభివృద్ధికి వ్యవసాయోత్పత్తుల పెరుగుదలకు, ఇతర కీలక రంగాల సంస్కరణల ఫలితాలను ఒక్క తాటి మీదకి తీసుకురావాలన్న విషయం మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. వ్యవసాయం చేస్తున్న రైతు నలు దిక్కులు చూస్తూ ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో



ఉంటున్నాడు. దీనికి తోడు వాతావరణం కూడా సహ కరించడంలేదు. వర్షా కాలంలో వర్షాలు లేవు, చలి కాలంలో చలి ఉండదు. ఇలా ఏ కాలంలో అవి లేక పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో రైతులు తమ పంట దిగుబడిని పొందలేక పోతున్నారు. ఎలాగో కష్టపడి పంట పండిస్తే మార్కెట్లోకి వచ్చాక సరియైన గిట్టుబడి ధరలేక దళారుల చేతిలో మోసపోతున్నారు. చాలావరకు ప్రభుత్వాలు వ్యవసాయం కోసం కొన్ని సబ్సిడీలను అందజేస్తున్నాయి. అందులో వ్యవసాయం, విద్యుచ్ఛక్తి, ఎరువులు, రుణమాఫీ వంటి పథకాలతో రైతులకు కొంత చేరువైనప్పటికి అవి పూర్తిగా ఫలప్రదం కావడం లేదనే చెప్పాలి. అలాగే కేంద్రప్రభుత్వం వ్యవసాయానికి కూడా సెక్యూరిటీగా ఇన్సూరెన్సులను చేయించుకోవాలని రైతు ఆత్మహత్యలు ఆగిపోతాయని, అప్పుల నుంచి రైతులు బయటపడే అవకాశం ఉందని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఇంకా చెప్పాలంటే వ్యవసాయ కేంద్రంలో పనిచేసే శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి కొత్త వంగడాలను సృష్టించి వాటిని రైతులకు అందజేయడంలోను, రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో వాతావరణాలకు అనుకూలంగా రైతుల పంటలు పండించే భూమిలో ఏ విధమైన పంటలు పండుతాయో పరిశీలించిన తర్వాతనే పంటలు వేసుకుంటే రైతుకు లాభదాయకం, లేనట్లయితే పెట్టుబడికి తెచ్చిన డబ్బులు కూడా రాక ఇబ్బందులు పడవలసి వస్తుంది.

ఏది ఏమైనా వేసినపంటలే వేయకుండా పంటల మార్పు చేసుకోవాలి. అలాగే అంతర పంటలను ఆరుతడి పంటలను వాతావరణాలకు అనుకూలంగా వేసుకోవాలి. వ్యవసాయం అంటే ఒక పంటలు పండించడమే కాకుండా పంటల ఉత్పత్తికై హరిత విప్లవం, నూనె గింజల ఉత్పత్తికై పసుపు విప్లవం, పాల ఉత్పత్తికై శ్వేత విప్లవం, చేపల ఉత్పత్తికై నీలి విప్లవం, ఫల పుష్పాల ఉత్పత్తికై పసిడి విప్లవం ఇవన్నీ వ్యవసాయోత్పత్తుల వృద్ధికి చేసే ప్రయత్నాలు. పండిన పంటకు, చేసిన శ్రమకు తగినంత ఫలితం ఉంటేనే రైతు పదికాలాల పాటు చల్లగా ఉంటాడు. ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. యువతను సైతం వ్యవసాయ రంగం వైపు ఆకర్షించాలి. కొత్త పద్ధతులు, కొత్త వంగడాలతో సరికొత్త విధానాలతో నూతన హరిత విప్లవాన్ని సాధించుటలో రైతులు, ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలతో ఉన్నపుడే బీడు భూములు సైతం హరితవనంగా మారతాయి. ఆ దిశగా అడుగులు వేయాలి.

> పండిన పంటకు, చేసిన శ్రమకు తగినంత ఫలితం ఉంటేనే రైతు పదికాలాల పాటు చల్లగా ఉంటాడు. ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. యువతను సైతం వ్యవసాయ రంగం వైపు ఆకర్షించాలి.

◆ మోటె చిరంజీవి

మన లేఖలు

వైద్య ఉద్యోగుల సమస్యలపై ఉద్యమం

వైద్య ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలతో పాటు రేడియోగ్రాఫర్స్‌ల సమస్యల పరిష్కారానికై ఉద్యమించాలని, అందుకై ఉద్యోగులందరు సంసిద్దంగా ఉండాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.విఠల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అన్ని జిల్లాల వైద్యశాలల రేడియో గ్రాఫర్స్, అసిస్టెంట్స్, అటెండెంట్స్‌ల సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యన్.నారాయణ రెడ్డి, ప్రతి జిల్లాకు ఒక ఛీఫ్ రేడియో గ్రాఫర్ పోస్టును ఏర్పాటు చేయాలని, ప్రభుత్వాన్ని గతంలోనే విజ్ఞప్తి చేయడం జరిగిందని, 11వ పి.ఆర్.సి.లో రేడియోగ్రాఫర్‌లకు సమున్నత ప్రాధాన్యత కల్పించాలని, వైద్య విధాన పరిషత్ రేడియో గ్రాఫర్స్ విషయంలో తగిన గైడ్ లైన్స్ రూపొందించాలని, డార్క్ రూమ్ అసిస్టెంట్ పోస్టులకు ప్రాధాన్యత కల్పించాలని, రేడియేషన్ వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

- యన్.నారాయణ రెడ్డి
ప్రధాన కార్యదర్శి, టిజిఎంఇయు
984888 6152

ద్విచక్ర వాహనాల దూకుడును నియంత్రించాలి

జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాల దూకుడు ఎక్కువైంది. అతివేగంగా వెళ్తూ పెను ప్రమాదాలకు కారకులు అవుతున్నారు. ముగ్గురు లేదా నలుగురితో ప్రయాణిస్తూ, నడిరోడ్డుపై అతివేగంగా నడుపుతున్నారు. కళాశాల యువకులు ముఖ్యంగా రహదారులపై అనేక విన్యాసాలు ప్రదర్శిస్తూ ప్రమాదాలు జరుపుతున్నారు. జాతీయ రహదారులపై దిచక్ర వాహనాల కోసం ప్రత్యేక లైన్‌లు ఉండి ఆ ఏరియాలోనే ప్రయాణించేటట్లు చూడాలి. అతివేగంతో వెళ్ళే వారిని కఠినంగా శిక్షించాలి.

- సరికొండ శ్రీనివాసరాజు; వనస్థలిపురం

మనం
కుటుంబం
మంగళవారం, 30 జనవరి 2018
www.manamnews.com



హారన్ వ్రత్

చెవి పోటు ఉద్యమం

మనం చూసే వాహనాలన్నింటి వెనుకా కనిపించే ఒకే ఒక వాక్యం ఇప్పుడు మనపాలిట శాపంగా మారింది. 'హారన్ ప్లీజ్' అని వాహనాల వెనుకల ఉన్న ఈ సెంటెన్స్ 'మన కర్ణభేరి పాలిట డెత్ సెంటెన్స్'గా మారింది. రణగొణ ధ్వనులను రేయింబవళ్లు వింటూ పోతే మిగిలేది చెవుడు మాత్రమేనంటూ ఓవైపు వైద్యులు హెచ్చరిస్తున్నా, మనమంతా నిస్సహాయులుగా చేతులు ముడుచుకుని కూర్చుంటున్నాం. కానీ ముంబైకర్లు చెవిపోటు ఉద్యమానికి ప్రాణం పోసింది. 'హారన్ వ్రత్' అనే వ్రతం పేరుతో వీరంతా ఇప్పుడు వీధులకెక్కారు.



నో హారన్ ప్లీజ్

'ఆవాజ్' అనే స్వచ్ఛంద సంస్థ 'నో హారన్' ఉద్యమాన్ని మరో స్థాయికి తీసుకెళ్తోంది. ప్రధాన రోడ్లు, కూడళ్లు, ముఖ్యమైన భవనాలు, కార్యాలయాలు, ఆసుపత్రులు ఇలా ఎక్కువమంది ప్రజలు గుమిగూడే ప్రాంతాల్లో, వాహనాల రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాదంతా 'హారన్ వ్రతం'ను చేపడితే, క్రమంగా హారన్ కొట్టకుండా ఉండేందుకు అలవాటు పడే ముంబైకర్లు, అనవసరంగా హారన్ కొట్టడాన్ని శాశ్వతంగా మానేస్తారనే ఉద్దేశంతోనే ఇండియా గేట్ వద్ద ఈ ప్రహసనం ప్రారంభమైంది. వాహనాలేవైనా అదేపనిగా హారన్ కొట్టడం వద్దు, సైలెన్సే ముద్దని వీరు చెవులో ఇల్లు కట్టుకుని నచ్చచెబుతున్నారు. అంతేకాదు దీన్ని అతిక్రమిస్తే జరిమానా తప్పదు.



నో హాంకింగ్ ఇయర్

మరోవైపు మహారాష్ట్ర సర్కారు తీసుకున్న ఓ నిర్ణయం మరాఠాల్లో ఆనందాన్ని నింపుతోంది. 2018 సంవత్సరాన్ని 'నో హాంకింగ్ ఇయర్'గా ప్రకటించడంతో స్వచ్ఛంద సంస్థలతోపాటు పలు సంస్థలు ఇప్పుడు రంగంలోకి దిగి.. ఈ సమస్యకు శాశ్వతంగా ఫుల్ స్టాప్ పెట్టేందుకు సాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు అన్ని రంగాలవారిని ఇందులో భాగస్వామ్యం చేసి, మనముంటున్న ప్రపంచాన్ని శబ్ద కాలుష్యానికి దూరంగా తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నారు.





ముంబైలో గంటకు 180 లక్షల హారన్స్!!

ఇదంతా ప్రత్యేకంగా ముంబైలోనే ఎందుకా అనుకుంటున్నారా? దీనికి కారణముంది. ముంబై మహానగరంలో నిత్యం గంటకు సుమారు 180 లక్షలసార్లు హారను మోగిస్తూనే ఉంటారని ఓ సర్వేలో తేలింది. అంటే ముంబైకర్ల చెవులు ఈపాటికే చిల్లులలతో నిండిపోయాయన్నమాట. ఉన్న కాస్త వినికిడి శక్తిని కాపాడుకునేందుకే ఈ ప్రయత్నమంతా. దీంతో తక్షణం వీటిని మూగబోయేలా చేయడమే తమముందున్న కర్తవ్యంగా వీరంతా ఉద్యమించాల్సి వచ్చింది. ఓవైపు ప్రశాంతతకు భంగం వాటిల్లడమేకాదు, ఈ శబ్దాలు వినీ వినీ రోత పుట్టి, విసుగుచెందుతున్నట్టు చిన్నా పెద్దా అంతా వాపోతున్నారు. ఇన్ని మిలియన్ల హారన్‌లు అనుక్షణం మన చెవులను తాకుతుంటే ఇక బుర్ర ఎలా పనిచేస్తుంది, నిద్ర ఎలా పోతాం..అసలు చిన్నారులు ఆదమరచి నిద్రించగలరా?

ఆటో యూనియన్లతో కలిసి..

అసలు హారన్ కొట్టడంలో ముందుండేది డ్రైవర్లే, అందునా ఆటో డ్రైవర్లే. అందుకే ముందుగా వీరిలో హారన్‌పై అవగాహన కల్పించాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు ఆటో యూనియన్లతో వరుస భేటీలు నిర్వహించి, హారన్ కొట్టడం వల్ల ఇతరులకే కాక స్వయంగా డ్రైవర్‌పై పడే ప్రభావాన్ని సాంకేతికంగా వివరించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆటో యూనియన్లతో 'అదే పనిగా ఇకమీదట హారన్ కొట్టము' అని ప్రతిజ్ఞ చేయించారు. దీంతో పాటు ఒక ఆటోకు వందలాది హారన్‌లు పెట్టి, నగరమంతా విస్తృతంగా దీన్ని ప్రదర్శిస్తున్నారు. హారన్ అంటేనే అసహనానికి, నిర్లక్ష్యానికి గుర్తని కూడా వీరికి అర్థమయ్యేలా వివరిస్తున్నారు.





గ్రామీలో

గులాబ్ గ్యాంగ్









ప్రపంచవ్యాప్తంగా మహిళలపై సాగుతున్న అఘాయిత్యాలను వ్యతిరేకిస్తూ, గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో పాల్గొన్నవారంతా 'బ్లాక్ డ్రెస్‌'లో తమ నిరసన గళం విప్పకనే విప్పారు. హాలీవుడ్ దర్శక, నిర్మాతల చేతిలో లైంగిక వేధింపులకు గురైన వారంతా 'మీ టూ' హ్యాష్ ట్యాగ్‌తోపాటు తెల్ల గులాబీని గుర్తుగా ట్వీట్ చేశారు. ఇప్పుడదే తెల్ల గులాబీని లేడీ గాగాతోపాటు గ్రామీకి హాజరైన సెలబ్రిటీలంతా ధరించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆదివారం న్యూయార్క్‌లో జరిగిన గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో హోస్టులు సైతం ఈ తెల్ల గులాబీలతోనే రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు.



నల్లగొండ ఎస్పీవి అబద్ధాలు


(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ హత్యేనని, ఇందులో సీఎం కేసీఆర్, డీజీపీ, ఎస్పీ పాత్ర ఉందని ఆరోపించారు. ఈ హత్య విషయంలో సీఎం పాత్ర లేదని భావిస్తే.. సీబీఐ విచారణకు ఈ కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌ను పక్కా ప్రణాళికతో హత్య చేశారని, 20 రోజుల ముందుగానే కాఫీడేలో హత్య చేస్తామని హెచ్చరించారని, అదే విధంగా మట్టుబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య జరిగిన ప్రాంతంలో పెద్ద పెద్ద రాళ్లు లేవని, ప్లాన్‌లో భాగంగానే ముందుగానే వాటిని అక్కడకి తీసుకువచ్చారని చెప్పారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మిర్చి బండి దగ్గర జరిగిన చిన్న గొడవే హత్యకు కారణమని చెబుతున్న జిల్లా ఎస్పీ మిర్చి బండి యజమాని యాదయ్యను ఎందుకు విచారించలేదని, ఆయన ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించలేదని కోమటి రెడ్డి ప్రశ్నించారు. తన భర్త కనిపించడంలేదని శ్రీనివాస్ భార్య పోలీస్ స్టేషన్‌కు వెళ్తే మోహన్ అనే వ్యక్తి తీసుకెళ్లి శవాన్ని చూపించారని, కానీ.. ఎస్పీ మాత్రం శ్రీనివాస్ మృతదేహాన్ని ఆయన భార్యే ముందుగా చూశారని చెప్పారని, ఇది దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. నిందితుల కాల్ డేటాను పోలీసులు ఇంత వరకు ఎందుకు బయటపెట్టలేన్నారు. హత్య గురించి పోలీస్‌లకు ముందే తెలుసన్నారు. పోలీసుల అసమర్థత, డీఎస్పీ వల్లే నల్లగొండలో మరో హత్య కూడా జరిగిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ హత్యలోనే న్యాయం చేయలేకపోయిన పోలీసుల వైఖరే హత్యాలను ప్రోత్సహించేలా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తిరుమర్తి లింగయ్య ను కూడా హత్య చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వీరేశం మనుషులు లింగయ్యను చంపేస్తామని ఫోన్‌లో బెదరిస్తున్నారని, ఆ నెంబర్లు ఇచ్చినా ఇంత వరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. శ్రీనివాస్ హత్య కేసు విషయంలో తమకు ప్రభుత్వంపై నమ్మకం పోయిందని, త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఎస్పీ అన్నీ అసత్యాలే చెబుతున్నారని, ఆయన్ని ఎస్పీ అని పిలవాలని అనిపించడంలేదన్నారు. మిర్చి బండి గొడవకే ఇంత కిరాతకంగా హత్య చేస్తారా? అని వీహెచ్ ప్రశ్నించారు. ప్రభుత్వం ఏం చెబితే పోలీసులు అదే చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రులు కూడా ఉత్సవ విగ్రహాలయ్యారని చెప్పారు.

ఘాతుకం!

(మొదటిపేజీ తరువాయి)

ఇరుగుపొరుగు గమనించారు. వారు ఇంటి యజమాని సత్యనారాయణకు సంగతి తెలియజేయగా ఆయన పోలీసు లకు సమాచారమిచ్చారు. వారు రంగంలో దిగి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి- వంటగదిలో అపర్ణ, పడగ్గదిలో విజయలక్ష్మి, కార్తికేయినిల మృతదేహాలను కను గొన్నారు. అపర్ణ దేహం తలపై బలమైన గాయాలతో రక్తపు మడుగులో పడి ఉండగా ఆమె తల్లి, కుమార్తెల శరీరాలపై ఎలాంటి గాయాలూ కనిపించలేదు. దీంతో పోలీసులు జాగిలాలను, వేలిముద్రల నిపుణులను వెంటనే రంగంలో దించారు. అపర్ణ పనిచేసే చోట సీసీ కెమెరాలను పరిశీలించగా ఆమె మధ్యాహ్నం బయటకు వచ్చినట్లు నమోదై ఉంది. కాగా, మధు, అపర్ణ





గొడవపడిన సమయంలో వారు పరస్పరం ఫిర్యాదు చేసినట్లు చందానగర్ పోలీసులు తెలిపారు. అప్పటినుంచీ అపర్ణ, కార్తికేయలను మధు సరిగా చూడటం మానేశాడని సమాచారం. అంతేకాకుండా మధు మొదటి భార్య కుటుంబికులు అపర్ణను బెదిరించారని తెలియవచ్చింది. ఈ సందర్భంగా తన భర్తను అపర్ణ మోసంచేసి పెళ్లి చేసుకుందంటూ ఆరోపించిన వీరు ఆమెపై కక్ష పెంచుకున్నారని భోగట్టా. ఈ నేపథ్యంలో మధు ఈ హత్య చేశాడా? అతని ప్రోద్బలం, ప్రోత్సాహంతో మొదటి భార్య సంబంధికులు ఈ దారుణానికి పాల్పడ్డారా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. మరోవైపు అపర్ణ భర్త మధు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోగా, మరొక అనుమానితుణ్ని ఇంకొక స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారని తెలిసింది. సంఘటన స్థలాన్ని మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ భుజంగరావు, ఇన్‌స్పెక్టర్‌లు తిరుపతిరావు, హరిశ్చంద్రారెడ్డి పరిశీలించారు.

పుణ్యక్షేత్రాల అభివృద్ధికి వంద కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. నాగర్‌కర్నూ ల్ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఉమామహేశ్వర క్షేత్రాన్ని సోమవారం నాడు ఎంపీ కుటుంబ సమేతంగా సందర్శించారు. నల్లమల కొండ ల్లోని మల్లెలతీర్థంలో వెలిసిన శివయ్యను దర్శించుకున్నారు. ఎంపీ కుటుంబంతో పాటు స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు, ఆయన సతీమణి అమల కూడా శైవ క్షేత్రానికి విచ్చేశారు. శైవ క్షేత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటిసారిగా ఎంపీ కవిత నల్లమల ప్రాంతానికి వచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని టీఆర్ఎస్ అమ్రాబాద్ మండల శ్రేణులు మన్ననూర్ గ్రామంలో ఎంపీ కవితకు ఘన స్వాగతం పలికారు. మన్ననూర్ గ్రామంలో శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎంపీ అక్కడి నుంచి మల్లెలతీర్థం చేరుకున్నారు. లోయలో ఉన్న ఈ క్షేత్రాన్ని చేరుకోవడానికి దాదాపు 360 మెట్లు దిగారు. ఈ సందర్భంగా జలపాతం వద్ద ఎంపీ కుటుంబం సేదదీరింది.

దేవాలయల అభివృద్ధి..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక పుణ్య క్షేత్రాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ కవిత తెలిపారు. ఇందులో భాగంగా ఉమామహేశ్వ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడానికి నిధులు జారీ చేశామని చెప్పారు. ఈ నిధులతో ప్రస్తుతం ఆలయాలలో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, లీగల్ అడ్వైజర్ తిరుపతి వర్మ, భిక్షపతి, సాగర్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు మిర్యాల పావని, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీలో కవితకు ఘన స్వాగతం

శ్రీశైల క్షేత్ర దర్శనం కోసం వస్తున్న ఎంపీ కవితకు సున్నిపెంట సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పలు పార్టీల నాయకులు ఘనస్వాగతం పలికారు. టీడీపీ నాయకలు టీఎండి.రఫీ, వైసీపీ నాయకులు గఫార్, బెనహర్, కొమ్రంభీం గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షురాలు భూమాని జెండాలమ్మ ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు ఎంపీ కవితకు పూల మాలలు వేసి, బోకేలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ.. ఏపీలో తనకు ఇంత మంచి స్వాగతం లభిస్తుందని అనుకోలేదన్నారు. అనంతరం తనను స్వాగతించిన వారందరినీ పలకరించారు. ఎంపీ వెంట అచ్చంపేట ఎమ్మెల్యే బాలరాజు ఉన్నారు.

సమస్యలున్నా ముమ్ముందుకే

వృద్ధి రేటు 7-7.5% ఉండే అవకాశం.. ఈ ఆర్థిక సంవత్సరంలో 6.75 శాతం


- 6.1 శాతానికి తగ్గనున్న జీవీఏ వృద్ధి
- మరింత పెరగనున్న చమురు ధరలు
- స్టాక్ ధరలలో కరెక్షన్‌కు చాన్స్
- ఆర్థిక సర్వేలో అరవింద్ సుబ్రమణియన్
- పార్లమెంటులో ప్రవేశపెట్టిన అరుణ్‌జైట్లీ



న్యూఢిల్లీ, జనవరి 29: భారతదేశం మరోసారి ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని, 2018-19 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7-7.5 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని ఆర్థిక సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. అయితే.. పెరుగుతున్న చమురు ధరలు, స్టాక్ ధరలలో కరెక్షన్ల కారణంగా కొన్ని సమస్యలు కూడా ఉంటాయని అంచనా వేసింది. నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే చిట్టచివరి, ఐదో పూర్తిస్థాయి బడ్జెట్‌కు కేవలం రెండు రోజుల ముందు ఈ సర్వే విడుదలైంది. వచ్చే సంవత్సరం జరగాల్సిన సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆర్థిక స్థిరీకరణ ప్రణాళిక విరామంపై అనుమానాన్ని కూడా సర్వే తోసిపుచ్చలేదు. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ రూపొందించిన ఈ సర్వేను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సోమవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 6.75 శాతంగా ఉండొచ్చని, వచ్చే సంవత్సరం ఎగుమతులు, ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వృద్ధిరేటు ఇలా...

మునుపటి ఆర్థిక సంవత్సరం (2016-17)లో జీడీపీ వృద్ధిరేటు 7.1 శాతంగా ఉందని, 2015-16లో 8 శాతం నమోదు కాగా 2014-15లో 7.5 శాతంగా ఉందని వివరించారు. దేశవ్యాప్తంగా జీఎస్టీని ప్రవేశపెట్టడం, పెద్ద నోట్ల రద్దు తదనంతర పరిణామాల వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు మందగించిందని తెలిపారు. ఎగుమతులు పెరిగితే వృద్ధిరేటు కూడా పెరుగుతుందని, అయితే చమురుధరల పెరుగుదల మాత్రం కాస్త ఆటంకం అవుతుందని అరవింద్ సుబ్రమణియన్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చమురు ధరలు 14 శాతం పెరిగాయని, 2018-19లో మరో 10-15% పెరగొచ్చని సర్వేలో తెలిపారు. బ్యారెల్‌కు 10 డాలర్ల మేర ధర పెరిగితే ద్రవ్యోల్బణం 0.2-0.3 శాతం పెరుగుతుందన్నారు. అయితే.. జీఎస్టీ స్థిరపడటం, పెట్టుబడుల స్థాయి మళ్లీ పుంజుకోవడం, ప్రస్తుత నిర్మాణాత్మక సంస్కరణల ఫలితాలు.. ఇవన్నీ కలిస్తే వృద్ధిరేటు మరింత పెరిగే అవకాశాలు సైతం లేకపోలేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు 2018-19లో తప్పక మెరుగవుతుందని చెప్పారు. ఇక స్థూల జోడింపు విలువ (జీవీఏ)లో వృద్ధి 2016-17లో 6.6 శాతం కాగా, 2017-18లో 6.1 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు.



మూడు అంశాలపై దృష్టి

మధ్య కాలికంగా మూడు అంశాలపై విధానపరంగా ప్రత్యేక దృష్టి పెడ తామని చెప్పారు. దూసుకుపోతున్న యువ కార్మికశక్తికి... ముఖ్యంగా మహిళలకు 'ఉపాధి కల్పన' ప్రధానాంశంగా ఉంటుందన్నారు. అలాగే విద్యపై శ్రద్ధపెట్టి విద్యావంతులైన, ఆరోగ్యకర కార్మిక శక్తి సృష్టికి కృషి చేస్తామన్నారు. ఇక మూడో అంశంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతూ అదే సమయంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

పరిశోధనలకు అండ

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థుల ఆలోచన శక్తిని మరింత పెంచడంతో పాటు పరిశోధనలు, కొత్త ఆవిష్కరణల ద్వారా సమాజానికి ఉపయోగపడేలా చేయటమేనని పేర్కొన్నారు. ఆర్ఈసీ చైర్మన్ పీవీ రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నిత్య జీవితంలో వచ్చే సమస్యలను పరిష్కరించే నేర్పు కలగి ఉండాలని సూచించారు. సౌర, పవన, బయో వేస్ట్ పవర్‌లు పర్యావరణానికి ఎలాంటి హానీ కలిగించవని, ఇవి సహజ సిద్ధంగా లభిస్తాయన్నారు. టీహబ్‌తో కలిసి పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు.



ఉత్పత్తిలో అగ్రగామి..

తెలంగాణ నూతనంగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ ఉత్పత్తిరంగంలో ప్రథమస్థానంగా అగ్రగామి రాష్ట్రాల సరసన నిలవడం గర్వంగా ఉందని పరిశ్రమల, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సర్వేలో దేశీయ ఎగుమతుల్లో ఐదు రాష్ట్రాల వాటా 70 శాతం ఉందని పేర్కొన్నారు. అందులో తెలంగాణకూడా ఒక భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. ఎగుమతుల్లో ప్రస్తుతం టాప్-5లో ఉన్న తెలంగాణ త్వరలో ప్రథమస్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ వంటి సంస్కరణల వల్ల ఈ స్థాయికి చేరుకోగలిగామని తెలిపారు. దేశ ఎగుమతుల్లో 70 శాతం తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల నుంచి జరుగుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

మహారాష్ట్ర సెక్రటేరియట్ ఎదుట రైతు ఆత్మహత్య

- నష్టపరిహారం విషయంలో మనస్థాపం
- మృతదేహాన్ని తీసుకునేందుకు కుటుంబసభ్యుల నిరాకరణ

ముంబై, జనవరి 29: తన భూమికి తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఆత్మహత్యకు యత్నించిన 84 ఏళ్ల రైతు ఆదివారం రాత్రి మరణించాడు. మహారాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చే వరకు మృతదేహాన్ని తీసుకోమని బాధిత కుటుంబం పేర్కొంది. రైతు నుంచి సేకరించిన భూమికి పునర్మూల్యాంకనం చేస్తామని అధికార బీజేపీ పేర్కొనగా, రైతు ఆత్మహత్యను అధికార పార్టీ చేసిన హత్యగా ప్రతిపక్ష కాంగ్రెస్ పేర్కొంది. సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకున్న తన భూమికి అతి తక్కువ పరిహారం అందజేస్తుందని ఆరోపిస్తూ, ధూలే జిల్లాకు చెందిన ధర్మాపాటిల్ అనే రైతు జనవరి 22వ తేదీన మహారాష్ట్ర సెక్రటేరియట్ ఎదుట విషపదార్థం తిన్నాడు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆస్పత్రిలో మరణించాడు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడు నరేంద్ర పాటిల్ మాట్లాడుతూ తమకు న్యాయం జరిగే వరకు తన తండ్రి మృతదేహాన్ని తీసుకెళ్లమన్నారు. తనకున్న నాలుగు ఎకరాల భూమికి ప్రభుత్వం నాలుగు లక్షల నష్టపరిహారం చెల్లించిందని, తనకు జరిగిన అన్యాయం కోసం చెప్పుకునేందుకు ధర్మాపాటిల్ మూడు నెలలుగా అధికారుల చుట్టూ తిరిగాడని, ఫలితం దక్కలేదని నరేంద్ర పాటిల్ గత వారం విలేకరులతో చెప్పాడు. ధర్మాపాటిల్ ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చేరిన వెంటనే ప్రభుత్వం స్పందించి రూ.15లక్షలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది.

బాలికపై కానిస్టేబుల్ అత్యాచారయత్నం

- స్థానికుల దేహశుద్ధి, పోలీసులకు అప్పగింత

బస్తీ(ఉత్తరప్రదేశ్), జనవరి 29: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మన్‌డెర్వా ప్రాంతానికి చెందిన ఓ టినేజీ బాలికపై అత్యాచారయత్నం చేసిన కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సంజయ్ పాస్వాన్ అనే కానిస్టేబుల్ స్థానిక పోలీసు స్టేషన్‌కు సమీపంలోని ఓ ఇంట్లోకి ప్రవేశించి, ఆ ఇంట్లో ఉన్న బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. స్థానికులు ఆ కానిస్టేబుల్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉమ్మడి సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ఆప్

న్యూఢిల్లీ, జనవరి 29: బడ్జెట్ సమావేశాల తొలి రోజు జరిగిన పార్లమెంటు ఉభయ సభల ఉమ్మడి భేటీని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు బాయ్‌కాట్ చేశారు. తమ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై శాసన సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. లోక్‌సభ ఎంపీలు సాధూ సింగ్, భగవంత్ మాన్ సహా కొత్త ఎన్నికైన రాజ్యసభ ఎంపీలు సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా, నారాయణ్ దత్ గుప్తా కలిసి నిరసన చేపట్టారు. సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడాన్ని, ఆప్ ఎమ్మెల్యేలపై వేటు వేయడాని వ్యతిరేకిస్తున్నామంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. భారత ప్రజాస్వామ్యంలో నియంతృత్వం తగదని, దేశంలో ఒకే చట్టాన్ని రెండు రకాలుగా ఎలా అమలు చేస్తారంటూ నినాదాలు చేశారు. మరో రాష్ట్రం (తెలంగాణ)లో ఎమ్మెల్యేల పార్లమెంటరీ కార్యదర్శుల పదవులను హైకోర్టు రద్దు చేసినా వారు శాసనసభ్యులుగానే కొనసాగుతున్నారని ఆప్ నేతలు పేర్కొన్నారు.

సమీప భవిష్యత్తులో 'ల్యాబ్ ఆన్ చిప్'

వాషింగ్టన్, జనవరి 29: రోగనిర్ధారణకు చేసే పరీక్షలకు ఇప్పుడంటే పెద్ద పెద్ద యంత్రాలు అవసరం కానీ భవిష్యత్తులో ఈ ఇబ్బందులేవీ ఉండవని పరిశోధకులు చెబుతున్నారు. సమీప భవిష్యత్తులో ఓ నాణెం పరిమాణంలో ఉండే బుల్లి ల్యాబ్‌లు పుట్టుకొస్తాయని పేర్కొన్నారు. ల్యాబ్ ఆన్ చిప్‌గా వ్యవహరించే ఈ చిన్ని పరిశోధనశాలలో రోగ నిర్ధారణ చాలా సులువుగా మారనుందన్నారు. ఇప్పటికే ఈ పరిశోధనలు ప్రారంభమయ్యాయని త్వరలో ఈ బుల్లి ల్యాబ్ సాకారం కానుందని వివరించారు. అయితే, ఈ పరిశోధనలో నమూనాలను బుల్లి ట్యూబుల ద్వారా లోపలికి పంపడమే కష్టమైన పని అని, నిన్నమొన్నటి వరకూ దీనికి పరిష్కారం వెతికేందుకే శ్రమించామని శాస్త్రవేత్తలు తెలిపారు. తాజాగా ఈ సమస్యకు మెరుగైన పరిష్కారాన్ని కనుగొన్నామని యూనివర్సిటీ ఆఫ్ బఫెలో పరిశోధకులు తెలిపారు. దీంతో ల్యాబ్ ఆన్ చిప్ తయారీకి ఇంకెన్నో రోజులు ఆగాల్సిన అవసరం ఉండదని వివరించారు.

పగిడిద్దరాజు పధార్ రహే హై..!

(మొదటిపేజీ తరువాయి)

ఆయనపట్ల వివక్ష చూపుతున్నారంటూ మహబూబాబాద్ జిల్లా గంగారాం మండలం పొనుగొండ్ల గ్రామస్తులు మండిపడుతు న్నారు. మేడారం జాతర అంటే.. సమ్మక్క-సారలమ్మలే కాదు పగిడిద్దరాజు దర్శనం ఉంటుంది. కానీ నాటి నుంచి పాలకులు మేడారంపై చూపిన శ్రద్ధను పగిడిద్దరాజుపై చూపడంలేదనే విమర్శలు జోరుగా విన్పిస్తున్నాయి. కరువు కాటకాలతో అల్లాడిన ప్రజలను కాపాడేటందుకే కాకతీయ చక్రవర్తులతో నాడు ఆయన పోరాడాడు. అయితే ఆయన వంశస్థులు నేడు తమ ఉ నికి కోసం పోరాడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పొనుగొండ్ల జిల్లాల పునర్విభజనతో మేడారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోకి, పొనుగొండ్ల గ్రామం మహబూబా బాద్ జిల్లాలోకి వచ్చాయి. ఇంతటి చారిత్రక సంబంధాలు కలిగిన ఇవి రెండు జిల్లాల్లోకి విడిపోవడంతో పెనిక వంశస్తులతో పాటు సమ్మక్క వంశస్థులెన చందా వారు నిరుత్సాహం చెందారు.

ఏం జరిగిందో చూద్దాం..

కాకతీయులతో సంపెంగ వాగు వద్ద జరిగిన యుద్ధంలో పగిడిద్దరాజు కుటుంబమంతా వీరమరణం పొందారు. వీరినే గిరిజనులు దేవతలుగా పూజిస్తున్నారు. అయితే జరిగే జాతరను మాత్రం సమ్మక్క -సారలమ్మ జాతరగా పిలుస్తారు. మొదట ఈ జాతర బయ్యక్కపేటలో జరిగేది. కాలక్రమేణా అది మేడారానికి మారింది. పగిడిద్దరాజు గౌతమ ఋషి సంతానం నాలుగో గోత్రానికి చెందిన పెనిక వంశీయుడు. వీరు ప్రస్తుతం కొత్తగూడ మండలం పొనుగొండ్ల గ్రామంలో నివసిస్తున్నారు. ఇక్కడ పగిడిద్దరాజుకు ఆలయాన్ని నిర్మించి అనాదిగా పూజలు చేస్తూనే వస్తున్నారు. ఈ గుడిలో పగిడిద్దరాజు ఉపయోగించిన వస్తువులు, యుద్ధంలో వాడిన ఆయుధాలున్నాయి. బయ్యక్కపేటలో సమ్మక్క-సారలమ్మ జాతర ఆగిపోవడంతో పెనిక వంశీయులు పొనుగొండ్ల గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు.

పగిడిద్దరాజును పెండ్లి కొడుకుగా ముస్తాబు..

జాతర సమయంలో పగిడిద్దరాజును పెండ్లి కొడుకుగా అలంకరించి గిరిజన సంప్రదాయం ప్రకారం ఆయన వంశస్థులే పొనుగొండ్ల గ్రామం నుంచి 60 కిలో మీటర్ల దూరంలోని మేడారానికి కాలినడకన తీసుకుపోతారు. కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజును తీసుకొచ్చి ముగ్గురినీ ఒకేసారి గద్దెలపై ప్రతిష్టిస్తారు. అనంతరం ఎదుర్కోళ్ల ఉత్సవం నిర్వహించి.. ఆనవాయితీగా చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెల పైకి తీసుకొస్తారు. అనంతరం పూజారులు పెండ్లి చేసి జాతరను ప్రారంభిస్తారు. జాతర ముగిశాక సమ్మక్క వన ప్రవేశానంతరం పగిడిద్దరాజును ఆయన వంశస్తులే తిరిగి గ్రామానికి తీసుకొస్తారు.

తిరుగువారంలో నాగపెండ్లి

పగిడిద్దరాజును గ్రామానికి తీసుకొచ్చిన నాలుగు రోజుల(ఇక్కడ తిరుగువారం అని పిలుస్తారు)కు గిరిజన సంప్రదాయం ప్రకారం నాగపెండ్లి(మారుపెండ్లి) కార్యక్రమాన్ని పొనుగొండ గ్రామస్తులు నిర్వహిస్తారు. వివాహం మేడారంలో నిర్వహించడంతో నాగపెండ్లిని పొనుగొండ్లలో రెండు రోజుల పాటు వైభవంగా పెనిక వంశస్తులు చేస్తారు. మేడారం జాతరను ఎంత వైభవంగా నిర్వహిస్తారో.. పొనుగొండ్లలో అంతే గొప్పగానాగపెండ్లిని నిర్వహిస్తారు. మేడారం జాతరకు వచ్చినట్టే.. నాగపెండికీ భక్తులు భారీగానే వస్తారు. పొనుగొండ్లలో నీటి వసతి తీవ్ర ఇబ్బందులు ఉండడంతో పెనిక వంశీయులే స్వచ్ఛందంగా డబ్బులు పోగు చేసుకుని పగిడిద్దరాజు ఆలయ ప్రాంగణంలో బోరు ఏర్పాటు చేసుకున్నారు. కానీ కరెంటు సమస్య కారణంగా ఆ బోరుకు మోటారును ఏర్పాటు చేసుకోలేకపోయారు. ఫలితంగా నాగపెండ్లికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు నాగపెండ్లిని చేయనున్నారు.

పదిరోజులు ముందుగానే..

సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించిన పూజా కార్యక్రమాలు పది రోజుల ముందుగానే పొనుగొండ్లలో మొదలవుతాయి. దీనిలో భాగంగానే పగిడిద్దరాజు పూజారులు సంప్రదాయ బద్ధంగా పసుపు, కుంకుమ, గాజులు, చీర మేడారం తీసుకుపోయి లగ్నం తేదీని ఖరారు చేసుకుని వస్తారు. అక్కడే సమ్మక్క వంశీయుల తో మాటముచ్చట తంతును నిర్వహిస్తారు. లగ్నం ఖరారయ్యిందనడానికి గుర్తుగా గద్దెల ప్రాంతంలో ముగ్గువేస్తారు.


పొనుగొండ్లలో కనీస వసతులు కరువు

ఇంత మంది భక్తులు వచ్చే పొనుగొండ్లలో కనీస వసతులు లేవు. గ్రామానికి వచ్చేందుకు రోడ్డు లేదు. 20 సంవత్సరాల పాటు పోరాడితే పగిడిద్దరాజు ఆలయానికి ప్రహరీని నిర్మించుకోగలిగామని గ్రామస్తులు చెబుతున్నారు. వేసవి వచ్చిందంటే చాలు.. నీటి కోసం పడరాని పాట్లు పడుతారు. తమ ఇబ్బందులను పట్టించుకోవాలని కోరుతున్నారు.

మేడారం జాతరప్పడే గుర్తుకొస్తాం..

అధికారులకు మేడారం జాతర సమయంలో మాత్రమే మేం గుర్తుకొస్తాం. మేడారం జాతర ఏలా జరిపిస్తారో.. పగిడిద్దరాజు జాతరను అలానే జరిపించాలి. గ్రామంలో నీటి కోసం నానా తంటాలు పడుతున్నాం. జాతర సమయంలో ఎక్కడెక్కడి నుంచో భక్తులు, అధికారులు వస్తున్నారు. అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటున్నారు. జాతర ముగిసిన మూడో రోజు తరువాత ఇటువైపు కనీసం కన్నెత్తి చూడరు.

- రాములమ్మ, గ్రామస్తురాలు




మాఘశుద్ధ పౌర్ణమి వచ్చిందంటే..

మాఘశుద్ధ పౌర్ణమి వచ్చిందంటే చాలు పొనుగొండ్లలో సందడే సందడి. ఏ ఇంట్లో శుభకార్యం జరిగినా ముందస్తుగా పగిడిద్దరాజు కల్యాణాన్ని జరిపిస్తారు. ఇదే మేడారం జాతర ప్రారంభానికి 15 రోజుల ముందునుంచే ఇండ్లముందు అలుక్కోవడం, అలంకరించుకోవడంతో పాటు కొత్తబట్టలు కుట్టించుకోవడం మొదలుపెడతారు. వారికి ఎన్ని పండుగలు వచ్చినా..మేడారం జాతరే అతిపెద్ద పండుగ.

సార్వత్రికమే సముచితం

దేశంలో చట్టసభలన్నిటికీ ఏకకాలంలో ఎన్నిక.. పార్లమెంటులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

- అన్నదాత అభ్యున్నతే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యం
- ఆర్థిక అంతరాలు తొలగించేందుకు విశేష కృషి
- 'ఆధార్' వ్యవస్థతో అపరిమిత ప్రయోజనాలు
- బడ్జెట్ సమావేశాల సంయుక్త సభలో ప్రసంగం



న్యూఢిల్లీ, జనవరి 29: దేశంలోని చట్టసభలన్నిటికీ ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ ప్రతిపాదనను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గట్టిగా సమర్థించారు. తరచూ ఏదో ఒక ఎన్నిక ఫలితంగా ఆర్థిక వ్యవస్థపై 'పెను భారం' పడటాన్ని ప్రస్తావిస్తూ 'సార్వత్రికమే సముచితం' అని నొక్కి చెప్పారు. తరచూ ఎన్నికల నియమావళిని అమలు చేయాల్సినందువల్ల అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు. సోమవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో తొలిరోజు... తొలిసారిగా ఉభయ సభల సంయుక్త భేటీలో ఆయన ప్రసంగించారు. దేశమంతటా ఒకేసారి ఎన్నికలపై అన్ని పార్టీలూ కూలంకషంగా చర్చించి ఏకాభిప్రాయానికి రావాలని సూచించారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్, కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, వివిధ పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. అన్నదాత అభ్యున్నతే తమ ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని, 2022నాటికి వారి ఆదాయం రెట్టింపు చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నదని రాష్ట్రపతి వెల్లడించారు. 'ఆధార్' వ్యవస్థతో అపరిమిత ప్రయోజనాలున్నాయని, అవేమిటో ఇప్పటికే తేటతెల్లమయ్యాయని పేర్కొన్నారు. సమాజంలోని చిటచివరి వ్యక్తిదాకా ప్రగతి ఫలాలు అందాలన్న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గంలో ప్రభుత్వం పయనిస్తున్నదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తదనుగుణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను, వాటి ఫలితాలను ఏకరవు పెట్టారు. పేదరికాన్ని నిర్మూలించి, ఆర్థిక అంతరాలను తొలగించేందుకు విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే అంతర్జాతీయంగానూ సత్తా చాటుతూ ప్రపంచ దేశాల మన్ననలు పొందుతున్నదని తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించి 2022నాటికి 75 ఏళ్ల పూర్తవుతాయని రాష్ట్రపతి గుర్తు చేశారు. అప్పటికల్లా 130 కోట్లమంది భారతీయులు కలలుగనే 'నవ భారతం' సాకారమయ్యేలా అందరం పాటుపడదామని పిలుపునిచ్చారు. తక్షణ 'ట్రిపుల్ తలాక్' నిషేధం బిల్లు త్వరలోనే చట్టంగా రూపుదాల్చగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా ముస్లిం మహిళలు ఎలాంటి భయాలకు తావులేకుండా హుందాగా, ఆత్మగౌరవంతో జీవించే వీలు కలుగుతుందని చెప్పారు.

మైనారిటీల సాధికారతే లక్ష్యం


దేశంలోని మైనారిటీల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, బుజ్జగింపులకు ఎంతమాత్రం తావులేదని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ఆ మేరకు ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వారికి సాధికారత కల్పించడానికి సర్కారు చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, పార్సీ, జైన మతాల యువతకు ''శిక్షణ పొందండి-ఆర్జించండి, ఉస్తాద్, గరీబ్ నవాజ్ కౌశల్ వికాస్ యోజన, నయీ రోష్నీ'' వంటి పథకాలద్వారా ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం

జమ్ముకశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్రవాద చొరబాట్లు, దాడుల వంటి ఉదంతాలను రాష్ట్రపతి ప్రస్తావించారు. ''ఇవన్నీ సరిహద్దు ఆవలి నుంచి లభిస్తున్న ప్రోత్సాహంతో ముడిపడినవేనని చెప్పడంలో సందేహం లేదు'' అని పాకిస్థాన్ పాత్రను పరోక్షంగా వివరించారు. సైన్యం, అర్ధసైనిక బలగాలు, రాష్ట్ర పోలీసుశాఖ సమన్వయంతో చొరబాటుదారులకు, వారికి వత్తాసు పలికేవారికి దీటుగా బుద్ధి చెబుతున్నట్లు వెల్లడించారు. ఇక ఈశాన్యం భారతంతోపాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తీవ్రవాదం కూడా తగ్గుముఖం పడుతున్నదని పేర్కొన్నారు. ''హింసావాదాన్ని వీడి, రాజ్యాంగంపై విశ్వాసం ప్రకటిస్తూ జనజీవితంలో పునఃప్రవేశం కోరేవారితో చర్చలకు ప్రభుత్వం సదా సిద్ధంగా ఉంది'' అని ప్రకటించారు.

ఆర్థిక రంగం ఆశావహ ముందడుగు

అంతర్జాతీయ ఆర్థిక మందగమనం ప్రస్ఫుటమైనా భారత ఆర్థిక వ్యవస్థ ఆశావహంగా ముందడుగు వేసిందని రామ్‌నాథ్ కోవింద్ చెప్పారు. లోగడ 2016-17 తొలి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తిలో క్షీణించి ఆర్థిక వ్యవస్థ తాత్కాలిక మందగమనంలో పడినా 2017-18 రెండో త్రైమాసికం నాటికి దీనికి పూర్తి భిన్నంగా ఊర్ధ్వ ముఖం పట్టిందని పేర్కొన్నారు. మొత్తంమీద మూడున్నరేళ్ల వ్యవధిలో ద్రవ్యోల్బణంతోపాటు కరెంటు ఖాతా లోటు సగటున పతన దిశగా సాగాయని, ఇప్పుడు మన విదేశీ ద్రవ్య నిల్వలు 41000 కోట్ల డాలర్ల స్థాయికి పెరిగాయని గుర్తుచేశారు. దీంతోపాటు జీఎస్టీని ప్రవేశపెట్టడం, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు ఆర్థిక సార్వజనీనతకు దోహదం చేసినట్లు పేర్కొన్నారు. ఇక అవినీతి, నల్లధనంపై పోరాటం కొనసాగుతున్నదని చెప్పారు.



ఢిల్లీలో సోమవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన బీటింగ్ రిట్రీట్ కార్యక్రమానికి హాజరవుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదిద్దాం

- ముస్లిం మహిళలకు కానుకగా ఇద్దాం
- అన్ని పార్టీలకూ ప్రధాని మోదీ వినతి



న్యూఢిల్లీ, జనవరి 29: ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ఒకేసారి ముమ్మారు తలాక్ చెప్పే విధానాన్ని నేరంగా పరిగణించడం ద్వారా ముస్లిం మహిళల హక్కును కాపాడినట్లవుతుందని అన్నారు. ఇందులో రాజకీయాలకు తావులేకుండా అన్ని పార్టీలు సహకారం కావాలని వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నానని మోదీ చెప్పారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం పార్లమెంటు భవనం వద్ద ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలు ఉన్నప్పటికీ గత సమావేశాల్లో బిల్లును ఆమోదించలేకపోయామని, బడ్జెట్ సమావేశాల్లో చట్టం చేసి ముస్లిం మహిళలకు కొత్త సంవత్సర కానుకగా ఇద్దామని ఆయన పిలుపునిచ్చారు. కాగా, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ రుణ సంస్థలు భారత్‌కు మంచి రేటింగ్ ఇస్తున్నాయని, ఈ సమయంలో ప్రవేశపెడుతున్న బడ్జెట్ మన ఆర్థికవ్యవస్థను మరింత శక్తిమంతం చేసేలా ఉండనుందని ప్రధాని మోదీ తెలిపారు. అలాగే ఈ బడ్జెట్ సామాన్యుడి ఆశలను ప్రతిబింబించేలా ఉంటుందని ఆశించారు.

రాజ్యసభలో అడుగుపెట్టిన ఆప్

న్యూఢిల్లీ, జనవరి 29: ఆమ్ ఆద్మీ పార్టీ తొలిసారిగా పెద్దల సభలో అడుగుపెట్టింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఢిల్లీ నుంచి ముగ్గురు ఆప్ సభ్యులు, ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ నేత, కేంద్ర పట్టణాభివృద్ధి సహాయ మంత్రి హరదీప్ సింగ్ పురీ ఎంపీలుగా ఎన్నికయ్యారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సోమవారం మంత్రి హరదీప్‌తోపాటు ఆప్ ఎంపీలు నారాయణ్ దాస్ గుప్తా, సుశీల్ కుమార్ గుప్తా, సంజయ్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వీరికి రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు అభినందనలు తెలిపారు. ఆప్ సభ్యులకు ప్రతిపక్షం వైపు చివరి వరుసలో సీట్లు కేటాయించారు. ఇటీవల దివంగతులైన మాజీ సభ్యులు మొహిందర్ సింగ్ కల్యాణ్, ఖాగెన్ దాస్‌లకు సభ నివాళి అర్పించింది. అలాగే ఇటీవల ముంబైలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పవన్ హాన్స్‌కు చెందిన ఇద్దరు పైలట్లకు, ఢిల్లీలో బాణాసంచా పేలి మరణించిన 17 మందికి సంతాపం తెలిపారు. చైర్మన్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులంతా లేచి నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇటీవల టర్కీలో జరిగిన అంతర్జాతీయ స్కీయింగ్ పోటీల్లో (అల్పైన్ ఎజ్డర్ 3200 కప్) కాంస్య పతకం సాధించిన అంచల్ థాకూర్‌ను, అంధుల ప్రపంచ క్రికెట్ కప్ విజేతగా భారత్ నిలవడాన్ని పెద్దల సభ ప్రశంసించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ కేంద్రం నుంచి ఇస్రో వందో ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేయడంపైనా ప్రశంసలు కురిపించారు. అనంతరం సమావేశాలను ఫిబ్రవరి 1కి వాయిదా వేశారు. ఆ రోజు లోక్‌సభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మధ్యాహ్నం 1:30కి రాజ్యసభ తిరిగి సమావేశమవుతుంది. తొలి రోజు రాజ్యసభ సమావేశాలు ప్రారంభం అయిన కొద్దిసేపటికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్‌తో కలిసి ప్రధాని మోదీ సభలోకి వచ్చారు. అనంతరం పలు పార్టీల నేతలను ఆయన పలకరించారు. నేరుగా ప్రతిపక్ష నేతల బెంచ్‌ల వద్దకు వెళ్లి.. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో కరచాలనం చేశారు.



అరెస్టు చేయిస్తాం జాగ్రత్త

- నిత్యానందకు మద్రాస్ హైకోర్టు హెచ్చరిక
- తప్పులు సరిదిద్దుకోవాలని సూచన
- బుధవారం వరకు గడువిచ్చిన జడ్జి

చెన్నై, జనవరి 29: స్వామి నిత్యానంద కోర్టును తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేస్తున్నారని, బుధవారంలోగా ఆయన చేసిన తప్పులు సరిదిద్దుకోకపోతే ఆయనపై అరెస్టువారంటు జారీ చేస్తామని మద్రాసు హైకోర్టు హెచ్చరించింది. నిత్యానందపై తగిన చర్యలు తీసుకుని మదురై మఠాన్ని కాపాడాలంటూ మదురైకి చెందిన ఎం. జగతల ప్రతాపన్ దాఖలుచేసిన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ ఆర్. మహదేవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. మఠం వ్యవహారాల్లో నిత్యానంద జోక్యాన్ని శాశ్వతంగా నివారించాలని కూడా ప్రతాపన్ కోరారు. నిత్యానంద తన అఫిడవిట్‌లో తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారని, తాము ఎన్నిసార్లు చెప్పినా వాటిని సరిదిద్దుకోవడం లేదని.. అందువల్ల నిత్యానందను అరెస్టుచేసి మంగళవారం నాడు కోర్టులో ప్రవేశపెట్టాలని జస్టిస్ మహదేవన్ పోలీసులకు సూచించారు. ఆయన అందరికంటే గొప్పవాడేమీ కాదని.. కోర్టులో చట్టం మాత్రమే అన్నింటికంటే గొప్ప అని చెబుతూ.. కోర్టు రిజిస్ట్రీ నుంచి వారంట్లు పొంది, అతడిని అరెస్టు చేయాలన్నారు. కేసును బుధవారానికి వాయిదా వేసి తదుపరి కేసుకు వెళ్లబోతుండగా.. నిత్యానంద తరఫు న్యాయవాది పదే పదే విజ్ఞప్తి చేసి, బుధవారానికల్లా తప్పులన్నీ సరిచేసుకుంటామని, అందువల్ల అరెస్టుచేయొద్దని ప్రాధేయపడ్డారు. దాంతో జస్టిస్ మహదేవన్ అరెస్టుకు ఉత్తర్వులు ఇవ్వకుండా కేసును వాయిదా వేశారు.

ఎందుకు రికార్డు చేశారు?


నిత్యానంద శిష్యులలో ఒకరు కోర్టు విచారణను రికార్డు చేయడంతో జస్టిస్ మహదేవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''కోర్టు విచారణ రికార్డు చేయడానికి మీకు ఎవరు అనుమతి ఇచ్చారు? దీని గురించి మీరు ఎవరికి సందేశాలు పంపుతున్నారు? కోర్టు అంటే ఆటస్థలం అనుకోవద్దు. మీ ఆశ్రమం మొత్తాన్ని మాయమయ్యేలా చేస్తా జాగ్రత్త. ఆశ్రమంపై వందలాది ఫిర్యాదులు పెండింగులో ఉన్నాయి'' అని ఆయన అన్నారు. ఆ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాల్సిందిగా ఆదేశించారు.

హాల్ ఆఫ్ ఫేమ్‌లో.. ఇద్దరు భారత శాస్త్రవేత్తలు

వాషింగ్టన్, జనవరి 29: భారత సంతతికి చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలకు అమెరికా అత్యున్నత పురస్కారం లభించింది. ప్రతిష్టాత్మక హాల్ ఆఫ్ ఫేమ్‌లో వారికి స్థానం దక్కింది. వైర్‌లెస్ టెక్నాలజీలో కీలకమైన ఆవిష్కరణకు గానూ ఆరోగ్యస్వామి పాల్ రాజ్,



దంతవైద్య విభాగంలో నానో కాంపోజైట్ల ఆవిష్కరణకు గానూ సుమితా మిత్రాలకు ఈ గౌరవం దక్కింది. వీరిద్దరితో పాటు మరో 13 మందికీ ఈ ఏడాది నేషనల్ ఇన్వెంటర్ పురస్కారాన్ని ప్రకటించింది. అమెరికా పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ఏడాది మే 2,3 తేదీల్లో జరిగే 'ది గ్రేటెస్ట్ సెలబ్రేషన్ ఆఫ్ అమెరికన్ ఇన్నోవేషన్' పేరుతో జరిపే కార్యక్రమంలో ఈ పురస్కారాలను అందజేయనున్నారు. కాగా, పాల్‌రాజ్ ఆవిష్కరించిన మల్టిపుల్ ఇన్‌పుట్ మల్టిపుల్ ఔట్‌పుట్ (మిమో) సాంకేతికత బ్రాడ్‌బ్యాండ్ వైర్‌లెస్ ఇంటర్నెట్ లో విప్లవాత్మక మార్పులకు కారణమైందని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమందికి ప్రయోజనకరంగా




మారిందని చెప్పారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్ రంగంలో భవిష్యత్తులో కొత్త ఆవిష్కరణలకు ఇది తోడ్పడుతుందని పే ర్కొన్నారు. హాల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానం సంపాదించడంపై పాల్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. తమ ఆవిష్కరణలతో ఆధునిక ప్రపంచానికి బాటలు వేసిన మహామహుల మధ్య తనకు స్థానం దక్కడం అపూర్వమైన గుర్తింపని పేర్కొన్నారు. తమిళనా డులోని పొలాచిలో జన్మించిన పాల్‌రాజ్ ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లారు. ఇక దంత వైద్య విభాగంలో పురస్కారం అందుకున్న మిత్ర ఇప్పటికే ఎన్నో ఆవిష్కరణలు చేశారు. అమెరికా పేటెంట్, ట్రేడ్‌మార్క్ కార్యాలయంలో ఆమె పేరుమీద 98 పేటెంట్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

కండోమ్.. నమ్మకమ్!

వాడకం దారులలో 20-24 ఏళ్ల మధ్య యువతులే అధికం..

- పదేళ్లలో 2 శాతం నుంచి 12 శాతానికి పెరుగుదల
- ఆధునిక పద్ధతులపై 34 శాతం మహిళల మొగ్గు
- దేశవ్యాప్తంగా తగ్గిన గర్భనిరోధక బిళ్లల వినియోగం
- నిరోధకాల వినియోగంలో పంజాబ్ మహిళలు టాప్
- జాతీయ కుటుంబ ఆరోగ్య అధ్యయనంలో వెల్లడి





న్యూఢిల్లీ, జనవరి 29: గర్భ నిరోధం, లైంగిక వ్యాధుల నివారణలు తొట్టతొలి ప్రాధాన్యం కండోమ్‌కే. ఇటీవలి కాలంలో వీటి వాడకం విపరీతంగా పెరిగిపోయిందట. పదేళ్ల కిందటితో పోలిస్తే ఇప్పుడు వాటి వాడకం తారస్థాయికి చేరిందట. అందునా పెళ్లికాని యువతులే (మహిళలు వాడే కండోమ్‌ను 'ఫెమిడోమ్' అంటారు) అత్యధికంగా వీటిని వాడుతున్నారట. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ చేసిన జాతీయ కుటుంబ ఆరోగ్య అధ్యయనం 2015-16లో ఈ విషయం తేలింది. పదేళ్ల కాలంతో పోలిస్తే 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్కులైన పెళ్లికాని మహిళల కండోమ్ వాడకం 2 శాతం నుంచి 12 శాతానికి పెరిగిందని, అందులోనూ అత్యధికంగా కండోమ్‌లను వాడుతోంది 20 నుంచి 24 ఏళ్ల యువతులేనని సర్వే తేల్చింది. ఇక, గర్భ నివారణ అనేది కేవలం ఆడవాళ్లకే అవసరమని 10 మందిలో ముగ్గురు పురుషులు భావిస్తున్నారని వెల్లడించింది. అలాగే, పెళ్లి కాని యువతుల్లో 34 శాతం గర్భనిరోధక పద్ధతులను అవలంబిస్తే.. వారిలో 32 శాతం ఆధునిక గర్భ నిరోధక సాధనాలను ఉపయోగిస్తున్నారు. మొత్తంగా చూస్తే గర్భ నిరోధక పద్ధతులపై పెళ్లికాని యువతులు ఒక అవగాహనకు వస్తున్నారని సర్వే తేల్చింది.

ఆధునిక గర్భనిరోధక పద్ధతులు అంతంతే...

ప్రపంచమంతా ఆధునిక పోకడలు పోతున్నా పలువురు మహిళలు మాత్రం ఆధునిక గర్భ నిరోధక సాధనాలను వాడట్లేదని సర్వే తేల్చింది. 15 ఏళ్ల నుంచి 49 ఏళ్ల మధ్య వయస్కుల్లో కేవలం 10 శాతమే ఆధునిక గర్భ నిరోధక సాధనాల వైపు దృష్టి సారిస్తున్నారని పేర్కొంది. కండోమ్ వాడకం, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక మాత్రలు, ఇంట్రా యుటెరైన్ పరికరాలు (ఐయూడీ)ల కన్నా.. సంప్రదాయ పద్ధతులవైపే వారు మొగ్గు చూపుతున్నారని వెల్లడించింది. గర్భం రాకుండా నెలసరికి అనుగుణంగానే శృంగారంలో పాల్గొంటున్న మహిళలే అధికమని పేర్కొంది. ఇక, ఎన్ని అవగాహనలు కల్పించినా, రక్షణాత్మక శృంగారంలో పాల్గొంటున్నా.. వివాహితల్లో గర్భ నిరోధక రేట్ (సీపీఆర్) కేవలం 54 శాతమేనని తేల్చింది. అయితే, పెళ్లి కాని యువతులు మాత్రం అధికంగా ఆధునిక గర్భ నిరోధక సాధనాలపైనే ఆధారపడుతున్నారని సర్వేలో తేలింది. 25 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్కులు అధికంగా అబార్షన్లు చేయించుకోవడం లేదంటే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వైపు మొగ్గు చూపడం వంటివి చేస్తున్నారని తేలింది. గర్భ నిరోధక మాత్రలున్నా.. వాటిని వాడుతోంది మాత్రం 1 శాతంమగువలేనని తేలింది.



మేం వాడితే చాలదు

గర్భ నిరోధక సాధనాలు మగవాళ్లు వాడినంత మాత్రాన సత్ఫలితాలు రావని చాలా మంది పురుషులు విశ్వసిస్తున్నట్టు సర్వేలో తేలింది. కండోమ్‌ను సరిగ్గా వాడితే గర్భ నిరోధం సాధ్యమవుతుందని 61 శాతం మంది పురుషులు నమ్ము తుంటే.. 25 శాతం మంది మాత్రం కండోమ్ వల్ల కొన్నిసార్లు మాత్రమే ఫలితాలు కనిపిస్తాయని విశ్వసిస్తున్నారు. కాగా, మణిపూర్, బిహార్, మేఘాల యాల్లో ఆధునిక గర్భ నిరోధక సాధనాల వాడకం చాలా తక్కువగా ఉందని సర్వేలో తేలింది. ఆయా రాష్ట్రాల్లో అతి తక్కువగా 24 శాతం మంది వాటిని వాడుతున్నట్టు పేర్కొంది. అత్యధికంగా పంజాబ్‌లో 76 శాతం వాడకం ఉన్నట్టు తేలింది. అదే కేంద్ర పాలిత ప్రాంతాలను తీసుకుంటే లక్షద్వీప్‌లో (30 శాతం) అత్యల్పంగా, చండీగఢ్‌లో (76 శాతం) అత్యధికంగా ఆధునిక గర్భ నిరోధక సాధనాలను వాడుతున్నట్టు ఆరోగ్య సర్వేలో తేలింది. వర్గాల వారీగా తీసుకుంటే అత్యధికంగా సిక్కు, బౌద్ధ మహిళలు అత్యధికంగా 65 శాతం మంది ఆధునిక గరే నిరోధక సాధనాలు వాడుతున్నారు. అత్యల్పంగా ముస్లిం మహిళలు (38 శాతం) వాటిపై మొగ్గు చూపుతున్నట్టు సర్వే తేల్చింది. అదే కాకుండా ఆర్థిక పరిస్థితులు కూడా వాటి వాడకంపై ప్రభావం చూపుతున్నట్టు తేలింది. అల్పాదాయ వర్గాల్లో 36 శాతం ఆధునిక గర్భ నిరోధక సాధనాలు వాడుతుంటే.. అధికాదాయ వర్గాల్లో మాత్రం ఆ వాడకం 53 శాతం దాకా ఉందని సర్వే తేల్చింది.

సర్వేలోని ముఖ్యాంశాలు..

- దేశవ్యాప్తంగా ఒకశాతం మహిళల కంటే తక్కువగా అత్యవసర పిల్స్‌ను ఉపయోగిస్తున్నారు.
- గర్భనిరోధక బిళ్లలు వాడే మహిళలు భవిష్యత్తులో వ్యభిచారులుగా మారుతారని 20 శాతం పురుషులు భావిస్తున్నారు.
- దేశవ్యాప్తంగా పెళ్లయిన మహిళల్లో (15-49 మధ్య వయస్సు) రెండింట మూడో వంతు కుటుంబ నియంత్రణ పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు
- గర్భనిరోధక బిళ్లలు వాడటమనేది మహిళలకు చెందిన అంశమని ప్రతి 8 మంది పురుషుల్లో ముగ్గురు అభిప్రాయపడ్డారు.
- గర్భ నిరోధక పద్ధతులు పాటించడంలో పంజాబ్ మహిళలదే పైచేయి. ఆ రాష్ట్రంలో 76 శాతం ఫ్యామిలీ ప్లానింగ్ పాటిస్తున్నారు.
- మణిపూర్, బిహార్, మేఘాలయ రాష్ట్రాల్లో అత్యల్పస్థాయిలో 24 శాతం మహిళలు మాత్రమే గర్భనిరోధక పద్ధతులను అనుసరిస్తున్నారు.

కుటుంబ నియంత్రణవైపు మగువల చూపు

ఆధునిక గర్భ నిరోధక సాధనాలు వాడుతున్న ప్రతి పది మంది మహిళల్లో ఏడుగురు ప్రభుత్వ ఆరోగ్య రంగం ద్వారా వాటి గురించి తెలుసుకున్నట్టు తేలింది. మరోవైపు కుటుంబ నియంత్రణ వైపు కూడా మహిళలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. 15 ఏళ్ల నుంచి 49 ఏళ్ల మధ్య వయస్కుల్లో 67 శాతం మంది కుటుంబ నియంత్రణను కావాలని కోరుకుంటున్నారు. 11 శాతం మంది సంతానం మధ్య కాస్తంత గ్యాప్ తీసుకోవాలని అనుకుంటున్నారు. 55 శాతం మంది మాత్రం పరిమిత సంతానం వైపు ఆసక్తి చూపుతున్నారు. కుటుంబ నియంత్రణ సందేశాల గురించి తెలుసుకుంటున్న 72 శాతం మంది మహిళల్లో 59 శాతం మంది టీవీల ద్వారానే తెలుసుకున్నారని తేలింది. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ ద్వారా 6,01,509 మందిపై ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ అధ్యయ నాన్ని నిర్వహించింది. అందులో 98 శాతం మంది ఆయా వివరాలపై స్పందించారు. అలాగే, 99 శాతం మంది వివాహిత మహిళలు, పురుషులు (15-49 మధ్య వయస్సు)లో ఏదో ఒక గర్భనిరోధక పద్ధతికి గురించి తెలుసునని వెల్లడించారు. వివాహితల్లో 54 శాతం మంది గర్భనిరోధక పద్ధతులను ఉపయోగించారు. అయితే.. పెళ్లి కాని యువతుల్లో 34 శాతం మంది.

సుకుమార్ దర్శకత్వంలో..?



చిరంజీవి

చిరంజీవి ప్రస్తుతం 'సైరా నరసింహారెడ్డి'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాదిన ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇది సెట్స్ మీద ఉండగానే చిరంజీవి మరో చెర్రీ దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. రామ్ చరణ్ హీరోగా 'రంగస్థలం'ను తెరకెక్కిస్తున్న సుకుమార్‌కు చిరు ఓకే చెప్పారట. ఇటీవల చిరంజీవిని కలిసిన సుకుమార్.. అతడికి ఓ కథను వినిపించారట. ఆ కథ చిరుకు బాగా నచ్చిందట. అంతేకాదు రంగస్థలం షూటింగ్‌కు పలుమార్లు వెళ్లిన చిరంజీవికి.. సుకుమార్ టేకింగ్ చాలా బాగా నచ్చిందట. దీంతో అతడి దర్శకత్వంలో నటించేందుకు చిరు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. మరి ఇందులో నిజమెంతో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



ఆతృతగా ఎదురు చూస్తున్నా

- ప్రభాస్

సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతోన్న చిత్రం 'ఇంటిలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. ఈ సినిమాలో 'లెట్స్ డు' అనే పాటను రీసెంట్‌గా ప్రభాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''నా మోస్ట్ ఫేవరేట్ సాంగ్ 'చమకు చమకు ఛాం'. చిరంజీవిగారి పాటల్లో ది బెస్ట్ సాంగ్ అది. ఆ సాంగ్ చిరంజీవిగారు సూపర్బ్‌గా చేశారు. తేజు ఎలా చేశాడో అని ఆతృతగా ఎదురు చూస్తున్నాను. వినాయక్‌గారు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌తో వస్తున్నారు. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్'' అన్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ ''సాంగ్‌ను ప్రభాస్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. మా టీమ్ తరపున ప్రభాస్‌కి కృతజ్ఞతలు. టీజర్‌లో తేజు చిరంజీవిగారిలా వున్నాడని అంటుంటే చాలా సంతోషంగా వుంది'' అన్నారు. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ ''ప్రభాస్ అన్నను మా ఇంట్లో ఒక ఫ్యామిలీ మెంబర్‌లా ఫీలవుతాం. మా చిత్రంలోని ఫస్ట్ సాంగ్‌ని లాంచ్ చేసినందుకు ప్రభాస్ అన్నకు చాలా థాంక్స్. ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ వినాయక్, ప్రొడ్యూసర్ కళ్యాణ్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు. చిత్ర నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ '' ఈ చిత్రంలో మొత్తం నాలుగు పాటలున్నాయి. ఈరోజు నుండి ప్రతి నాలుగు గంటలకొకసారి ఒక పాటని రిలీజ్ చేస్తాం. ఫిబ్రవరి 9న ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ అవుతుంది మా 'ఇంటిలిజెంట్'లోని ఫస్ట్ సాంగ్‌ని రిలీజ్ చేసి మా టీమ్‌ని బ్లెస్ చేసిన ప్రభాస్‌గారికి మా టీమ్ తరపున కృతజ్ఞతలు'' అన్నారు.



శ్రియ

నేను చాలా లక్కీ

గత ఏడాది 'గౌతమిపుత్ర శాతకర్ణి', 'పైసావసూల్' చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకుంది ఢిల్లీ సొగసరి శ్రియా శరన్. ఈ ఏడాది ప్రథమార్థంలో 'గాయత్రి' చిత్రంతో ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమాలో తన పాత్ర గురించి శ్రియాశరన్ మాట్లాడుతూ 'నేను అమాయకమైన, నిజాయితీతో కూడిన పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనపడతాను. మదన్‌గారు కథ చెప్పిన తీరు బాగా నచ్చింది. సహజత్వానికి దగ్గరగా ఉండే పాత్ర నాది. పెర్ఫామెన్స్‌కు మంచి స్కోప్ దొరికింది. తప్పకుండా అందరికీ నచ్చే పాత్ర. ఓ రకంగా నేను లక్కీఫెలోని. ఎందుకంటే నేను ఎంచుకుంటున్న పాత్రలకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వస్తున్నాయి. 'గాయత్రి' తర్వాత నేను తెలుగులో 'వీరభోగ వసంత రాయులు' సినిమా చేస్తున్నాను. దీంతో పాటు సినిమాటోగ్రాఫర్ జ్ఞానశేఖర్ నిర్మించే సినిమాలో కూడా నటిస్తున్నాను. అలాగే తమిళంలో కార్తీక్ నరేన్ దర్శకత్వంలో 'నరగాసురన్' సినిమా చేస్తున్నాను. ప్రతి సినిమాలో నా పాత్ర దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది' అని తెలిపారు.

మనం మూవీ
manammovie

మంగళవారం, 30 జనవరి 2018 | హైదరాబాద్ | 8



రాశీ ఖన్నా


బాలీవుడ్డా... అవకాశం వస్తేనే చేస్తా!

'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో తెలుగువారికి పరిచయమైన ఉత్తరాది భామ 'రాశీ ఖన్నా'. ప్రారంభంలో ముద్దుగా, బొద్దుగా ఉండే ఈ అమ్మడు సన్నబడుతుంది. 'మరి ఇంత సన్నబడితే ఎలా? కాస్త లావెక్కు లేకుంటే ప్రేక్షకులకు నచవు' అని ఆమె సినీ సన్నిహితులు హెచ్చరిస్తున్నారట. ఇదిలా ఉంటే రవితేజ సరసన రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతుంది. ఈ సందర్భంగా తన పాత్ర గురించి రాశీన్నా పాత్రికేయులతో ముచ్చటిస్తూ ''ఇందులో కామెడీ టచ్ ఉన్న వెస్ట్రన్ డాన్స్ టీచర్ పాత్రలో కనపడతాను. గతంలో 'సుప్రీమ్' సినిమాలో కూడా కామెడీ టచ్ ఉన్న పాత్ర చేశాను కానీ ఆ ప్రాతకు , 'టచ్ చేసి చూడు' సినిమాలోని పాత్రకు చాలా తేడా ఉంటుంది. డబ్బింగ్ సమయంలో రవితేజగారు నాకు ఫోన్ చేసి చాలా బాగా చేశావని అప్రిసియేట్ చేశారు. రవితేజ వంటి స్టార్ హీరో అలా చెప్పడం పెద్ద కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను. ఆయన సన్నివేశాలను ఎలా ఎన్‌హెన్స్ చేయాలనే దాని గురించి కొన్ని సూచనలు కూడా చేశారు. నటిగా గ్లామర్‌తో పాటు పెర్ఫామెన్స్ ఉన్న పాత్రలు చేస్తూ బ్యాలెన్స్ చేస్తున్నాను. అలాగే నా తరం కథానాయికలు రకుల్, లావణ్య త్రిపాఠి వంటి వారితో మంచి అనుబంధం ఉంది. వారితో కాంపిటీషన్ ఉన్నట్లు నేను ఎప్పుడూ ఫీల్ కాను. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళంలో కూడా సినిమాలు చేస్తున్నాను. మలయాళంలో 'విలన్' సినిమాలో నటించాను. దక్షిణాదిన హీరోయిన్‌గా నా స్థానంపై హ్యాపీగా ఉన్నాను. బాలీవుడ్‌లో నటించాలని అత్రుతగా ఎదురుచూడటం లేదు. అవకాశం వస్తేనే నటిస్తాను' అన్నారు.



నాని

అ!.. వినూత్నంగా




ఫస్ట్ లుక్స్, టీజర్.. ఇలా ప్రతి అంశంలోనూ అలరిస్తూ వస్తోంది నాని సమర్పిస్తున్న 'అ!' మూవీ. కాజల్ అగర్వాల్, నిత్యా మీనన్, రెజీనా, ఈషా రెబ్బా, అవసరాల శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. కాగా, ఈ సినిమా విడుదల తేదిని ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించని చిత్ర యూనిట్.. సోమవారం వినూత్న శైలిలో రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేసింది. ''అన్ని సినిమాలయందు 'అ' సినిమా వేరయా.. విశ్వదాభిరామ ఫిబ్రవరి 16న రిలీజ్ రా మామా ''అంటూ విడుదల తేదిని ప్రకటించారు. ఫస్ట్ లుక్స్, టీజర్ తరహాలో సినిమా కూడా అలరిస్తుందేమో చూడాలి.





బాహుబలి టెక్నీషియన్‌తో నిఖిల్

తెలుగు సినిమాకు ప్రపంచ వ్యాపంగా గుర్తింపు తెచ్చిన సినిమా 'బాహుబలి'. మాహిష్మతి సామ్రాజ్యాన్ని తన కెమెరాలో మరింత అందంగా చూపించిన వ్యక్తి సెంథిల్‌కుమార్. ఇప్పుడు సెంథిల్‌కుమార్ యువ కథానాయకుడు నిఖిల్ సినిమాకు పనిచేయబోతున్నారు. తమిళంలో విజయవంతమైన 'కణిదన్' సినిమాను తెలుగులో రీమేక్ చేయనున్నారు. ఇందులో నిఖిల్ హీరోగా నటించబోతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంతోష్ దర్శకుడు. ఫోర్జరీ సర్టిఫికేట్స్ వల్ల విద్యార్థుల జీవితాలు ఎలా నాశనం అవుతున్నాయనే కాన్సెప్ట్‌తో సినిమా రూపొందనుంది.



రామ్‌తో మరోసారి...

హీరో రామ్ గత చిత్రం 'ఉన్నది ఒకటే జిందగీ'. ఈ సినిమాలో రామ్‌తో ఇద్దరు హీరోయిన్స్ నటించారు. వారిలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. ఈ మలయాళీ సొగసరి మరోసారి రామ్‌తో జత కట్టనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. వివరాల్లోకెళ్తే... రామ్ హీరోగా 'మేం వయసుకు వచ్చాం', 'సినిమా చూపిస్త మావ', 'నేను లోకల్' సినిమాల దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా అనుపమ నటించనుంది. ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మించబోతున్నారు. మామఅల్లుడు మధ్య జరిగే కథాంశంతో సినిమా ఉంటుంది. ఇందులో మామ పాత్రలో ప్రకాష్‌రాజ్ నటిస్తారని సమాచారం.



అనుపమ పరమేశ్వరన్



ఎలాంటి ఒత్తిడీ లేదు

నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా నటించిన చిత్రం 'ఛలో'. ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో వెంకీ కుడుముల దర్శకత్వంలో ఉషా ముల్పూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ''మాది ఖమ్మం జిల్లా అశ్వారావ్ పేట. ఎంబీఏ చదివాను. సినిమాలపై ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. బలభద్ర పాత్రుని రమణి అనే రచయిత సహాయంతో తేజగారికి పరిచయం అయ్యాను. ఆయన డైరెక్షన్ టీమ్‌లో 'నీకు నాకు డాష్ డాష్'లో పనిచేశాను. అందులోనే చిన్న పాత్ర కూడా వేశాను. 'జాదూగాడు' సినిమా కోసం యోగిగారితో పనిచేశాను. త్రివిక్రమ్‌గారి వద్ద 'అఆ' సినిమాకు పనిచేశాను. నేను అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నప్పటి నుండి నాగశౌర్యతో పరిచయం ఉంది. తను నన్ను ఎలాగైనా డైరెక్టర్ చేయాలనుకున్నాడు. అలాగే నేను కూడా నా తొలి సినిమాను నాగశౌర్యతో చేయాలనుకున్నాను. అయితే తనతో సినిమా చేస్తానని చెబితే స్నేహం ఎక్కడ చెడుతుందోనని అనుకుంటుండేవాడిని. అలాంటి సమయంలో ఓరోజు శౌర్య ఫోన్ చేసి 'వెంకీ కథ తయారు చేసుకో.. మనం సినిమా చేద్దాం' అని అన్నాడు. నాకు చాలా సంతోషమేసింది. ముందుగా నాగశౌర్యతో క్రైమ్ కామెడీ చేద్దామని అనుకున్నాను. అయితే శౌర్య క్రైమ్ కామెడీని కాకుండా మంచి ఫ్యామిలీ సబ్జెక్ట్ చేద్దామని అనడంతో.. తనని కొత్తగా ఎలా చూపించాలని ఆలోచించాను. ఇప్పటి వరకు శౌర్యను అందరూ కామ్‌గా, లవర్‌బోయ్‌లా చూపించారు. అయితే ఫుల్ ఎనర్జిటిక్‌గా చూపిస్తే ఎలా ఉంటుందని ఆలోచించాను. తనకు చెబితే 'బావుంటుంది..అలాగే చేద్దాం' అన్నాడు. అలా అనుకున్న తర్వాత ఛలో కథను తయారు చేశాం. ముందు ఈ కథను వేరే నిర్మాతకు చెప్పాం. కథ బావుంది. లిమిటెడ్ బడ్జెట్‌లో చేద్దామని అన్నారు. మంచి కథ అంటున్నారు... వెంకీ మన ఇంటి కుర్రాడే.. శౌర్య నమ్మకం పెట్టుకున్న కథను మనమే ఎందుకు చేయకూడదని ఆలోచించి.. కష్టమో నష్టమో వారే సినిమా నిర్మించడానికి అంటీ, అంకుల్ (నాగశౌర్య తల్లిదండ్రులు) ముందుకొచ్చారు. 'ఛలో' చిత్రం తర్వాతే నా తదుపరి సినిమా ఉంటుంది'' అన్నారు.



దుర్గమ్మ దయ

- ఈవోగా అమ్మే పంపింది..బదిలీ అయిన రోజే కలలో కనిపించింది
- తిరుమలలా అభివృద్ధికి ఆదేశం.. దుర్గ గుడి ఈవోగా పద్మ బాధ్యతల స్వీకరణ



విజయవాడ, జనవరి 29 (మనం న్యూస్): విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా తనకు దుర్గమ్మే అవకాశం ఇచ్చిందని ఐఏఎస్ అధికారిణి పద్మ అన్నారు. అమ్మ ఆశీస్సులతో ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. సోమవారం దుర్గ గుడి నూతన ఈవోగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఆలయ ఈవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన రోజు రాత్రే అమ్మవారు కలలోకి వచ్చారని, ఆలయ అభివృద్ధి, పూజా కార్యక్రమాల విషయంలో దుర్గమ్మే తనకు మార్గనిర్దేశం చేసిందని పద్మ తెలిపారు. తిరుమల వెంకన్న ఆలయంలా ఇంద్రకీలాద్రిని అభివృద్ధి చేయాలని అమ్మ ఆదేశించిందని చెప్పారు. అమ్మ ఆశీస్సులతో ఆగమ శాస్త్రానుసారం ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు చేపడుతామని ఆమె చెప్పారు. ఆలయంలో జరుగుతున్న పనుల నాణ్యత పరిశీలన, వేగవంతానికి సాంకేతికత వినియోగిస్తామని ఈవో పేర్కొన్నారు. ఇప్పటికే ఆలయంలోని వివిధ విభాగాలు ఈ-గవర్నెన్స్‌ను వినియోగిస్తున్నారని, దేవస్థానానికి సంబంధించిన ప్రతి శాఖను ప్రాధాన్యత క్రమంలో ఈ-గవర్నెన్స్ కిందకు తీసుకువస్తామని ఆమె వెల్లడించారు. భక్తులు ఆకాంక్షలకు అనుగుణంగా అమ్మవారి దర్శనాన్ని కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయంలో సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని, తాను తాను ఏకపక్షంగా ఏ నిర్ణయాన్నీ తీసుకోనని, అందరి సమన్వయంతోనే సమస్యలను పరిష్కరిస్తానని వివరించారు. ఇందుకు షిర్డిలోని సాయిబాబా దేవస్థానమే ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భక్తులకు ఉచిత దర్శనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, భక్తులు, కమిటీ సభ్యులు అభిప్రాయంతో అంతరాలయ దర్శనానికి టికెట్ ధర తగ్గించే వియాన్ని పరిశీలిస్తామని ఈవో పద్మ వెల్లడించారు.

31న చంద్ర గ్రహణం

- ప్రముఖ ఆలయాల మూత



తిరుమల, జనవరి 29 (మనం న్యూస్): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 31న రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలన్నీ మూత పడనున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయం సహా విజయవాడ దుర్గ గుడి, సింహాచలం అప్పన ఆలయం, ఇతర ప్రముఖ ఆలయాలను మూసేయనున్నారు. జనవరి 31న సాయంత్రం 5.18 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 8.41 గంటలకు పూర్తవుతుంది. ఈ కారణంగా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని కూడా మూసివేయనున్నట్లు చెప్పారు. సహస్ర కలశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజలసేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను కూడా టీటీడీ రద్దు చేసింది. గ్రహణం రోజు మొత్తంగా ఐదు గంటలు మాత్రమే దర్శనం ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని భక్తులు కొండకు రావాలని అధికారులు సూచించారు.



పెట్టుబడులకు స్వర్గంగా ఏపీ

స్టార్టప్‌లకు రూ.100 కోట్ల నిధులు

నూతన పాలసీలు తీసుకొచ్చాం: లోకేశ్

లాస్‌ఏంజిల్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రోడ్‌షో

అమరావతి, జనవరి 29 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దామని ఐటీ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. టెక్నాలజీ రంగానికి పెద్దపీట వేస్తున్నామని, స్టార్టప్ కంపెనీలను ప్రోత్సాహించేందుకు రూ.100 కోట్ల నిధులు కేటాయించామన్నారు. సోమవారం లాస్‌ఏంజిల్స్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ, ఏపీఎన్నార్టీ సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి పెట్టుబడులతో రావాలని వారికి పిలుపునిచ్చారు. ''రాష్ట్ర విభజన తర్వాత అనేక సమస్యలు ఎదుర్కొన్నాం. మూడున్నరేళ్లలో సమస్యలు అధిగమించి అభివృద్ధి సాధించాం. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో తలసరి ఆదాయం తక్కువగా ఉంది. తలసరి ఆదాయం పెంచడానికి అనేక చర్యలు తీసుకున్నాం. ఐటీ రంగంలో మూడున్నరేళ్లలో 24వేల ఉద్యోగాలు కల్పించాం. ఏపీలో ఐటీరంగం ఊపందుకుంది'' అని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో హెచ్‌సీఎల్, కాన్సెంట్, ఎఎన్ఎస్ఆర్, జోహో ఫ్రాంక్లిన్ లాంటి పెద్ద కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని తెలిపారు. ఎలక్ట్రానిక్ తయారీ రంగం అభివృద్ధికి ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చురింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. 2019 నాటికి రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాగా, అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో లోకేశ్ ఇన్వెస్ట్‌మెంట్ రోడ్ షో నిర్వహించారు. ఎల్క్టో హెల్త్ కేర్ సీఈవో లక్ష్మణ్‌రెడ్డి, సిస్ ఇంటెలీ సీఈవో రవి, అడ్వాన్స్ బ్యాటరీ సిస్టమ్ సీఈవో రిచర్డ్ కెయిన్, వైస్ ప్రెసిడెంట్ మైక్ పాలోమీరా, సాఫ్ట్ హెచ్చ్యాయ సీఈవో క్రాంతి పొన్నం, ఐస్పేస్ సీఈవో రాజేష్ కొత్తపల్లి, ఎలిక్సిస్ సీటీవో లోకనాథన్, పీబీ సిస్టమ్స్ కంపెనీ సీఈవో వేణు గార్నేనిలతో లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో కంపెనీలు ఏర్పాటు చేయాలని వారిని కోరారు. ఇందుకు కంపెనీ ప్రతినిధులు సమ్మతం తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని తిరుపతి, విశాఖ, విజయవాడ, గుంటూరు పట్టణాల్లో కొత్త ఐటీ, హార్డ్‌వేర్ కంపెనీలు ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

యువతి గర్భం విలువ 2.50 లక్షలు

మందమర్రిలో పంచాయతీ తీర్పు

ప్రేమ పేరుతో యువకుడి వంచన

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

మంచిర్యాల, జనవరి 29(మనం న్యూస్): ప్రేమ పేరుతో వంచించాడు.. అమాయకురాలికి మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకున్నాడు. గర్భందాల్చానని తెలుసుకున్న బాధితురాలు పెళ్లి చేసుకోమని అడిగితే తప్పించుకు తిరిగాడు. పెద్ద మనుషులను ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందనుకున్న బాధితురాలికి అన్యాయమే మిగిలింది. డబ్బుతో మోసాన్ని కడిగేసుకోవాలంటూ పంచాయతీ తీర్పివ్వడంతో గత్యంతరం లేక తలవంచింది. అయితే, ఎనిమిది నెలల గర్భాన్ని తొలగించడం కుదరదని వైద్యులు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నేరాన్ని కప్పిపుచ్చి యువకుడికి వత్తాసుగా నిలిచిన పెద్దల బండారం బయటపడింది. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన యువతి చిన్న తనంలో తల్లిదండ్రులను కోల్పోయింది. జీవనాధారం కోసం మంచిర్యాల పట్టణంలోని భగవంత వాడలో అద్దెకుంటూ భవన నిర్మాణ కూలీగా పనిచేస్తుంది. ఈ క్రమంలో పట్టణంలో ఎడ్ల వాడకు తాపీ మేస్త్రీ చౌదరి శంకర్‌తో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగామారింది. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి శంకర్ యువతిని గర్భవతిని చేశాడు. పెళ్ళిచేసుకోవాలని బాధితురాలు ఒత్తిడి తేవడంతో 5 నెలలుగా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గట్టిగా నీలదీయగా పలువురు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించాడు. న్యాయం చేయాల్సిన పెద్దలు శంకర్‌కు వత్తాసు పలికి యువత శీలానికి వేల కట్టారు. యువతి గర్భం, శీలం విలువ 2.50 లక్షలుగా నిర్ణయించి, అబార్షన్ చేయించుకొని, తనదారి తనను చూసుకొమ్మని తీర్పు చెప్పారు. దీనికి ఒప్పుకోనన్న బాధితురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో గత్యంతరం లేక ఒప్పుకున్న యువతికి మొదట లక్ష రూపాయాలు ఇచ్చి, వాటిని తీసుకొని అబార్షన్‌కు చేయించేందుకు ఆసుపత్రికి తీసుకవెళ్ళారు. అయితే 8 నెలల గర్భం కావడంతో వైద్యులు అబార్షన్ చేయడానికి నిరాకరించారు. అప్పటికే యువతికి ఇష్టం లేకపోవడంతో యువతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు యువతి ఫిర్యాదు తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒంటేరుకు బెయిల్ మంజూరు

హైదరాబాద్, జనవరి 29(మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణ టీడీపీ రైతు విభాగం చైర్మన్ వి.ప్రతాప్‌రెడ్డికి సోమవారం బెయిల్ లభించింది. ఓయూలో విద్యార్థులను కలుసుకునేందుకు వెళ్లినప్పుడు ఉద్రేకపూరిత ప్రసంగం చేశారంటూ ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఏపీ ప్రకృతి సాగుకు గుర్తింపు

- రాష్ట్ర నమూనాపై ప్రపంచ దృష్టి
- దావోస్‌లో వ్యవసాయం, ఆహార భద్రతపై చర్చ
- వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రణాళిక
- వేరుశనగ, అపరాలకు గిట్టుబాటు ధర
- 80 శాతం ప్రజా సంతృప్తి లక్ష్యం
- నీరు-ప్రగతి టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

అమరావతి, జనవరి 29 (మనం ప్రతినిధి):ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ నమూనా ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో 'వ్యవసాయం- ఆహార భద్రత'పై ఫలప్రదమైన చర్చ జరిగిందని తెలిపారు. నీరు- ప్రగతి పనులు, వ్యవసాయ రంగ పురోగతిపై సోమవారం తన నివాసం నుంచి ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లు, అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి భాగంలో 11.5 శాతం వృద్ధి సాధించామని, 15 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. 62 శాతం ప్రజలకు ప్రభుత్వంపై సంతృప్తి ఉందని, ఇంకా 18 శాతం మంది ప్రజల్లో సంతృప్తి సాధించాలన్నారు. గత నెలలో 5 శాతం ప్రజల్లో ప్రభుత్వంపై సంతృప్తి పెరిగిందన్నారు. పెన్షన్లపై సంతృప్తి గత నెలలో ఉన్నట్లే 79 శాతం ఉండగా, ఈ నెలలో రేషన్‌పై సంతృప్తి 69 శాతం నుంచి 76 శాతానికి పెరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జన్మభూమిలో వచ్చిన వినతులను జనవరి 31లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పేదల సొంతింటి కల నిజం చేయాలి..

పేదల సొంతింటి కల నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చంద్రబాబు అన్నారు. 2016-17లో ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణం 64 శాతం మాత్రమే చేశారని, ఈ ఏడాది 100 శాతం లక్ష్యం పూర్తి చేయాలన్నారు. 2017-18, 2018-19 ఇళ్ల కేటాయింపులు వేగవంతం చేయాలన్నారు. ఫిబ్రవరిలో రెండో విడత సామూహికగృహప్రవేశాలు పండగల నిర్వహించాలన్నారు.

వ్యవసాయానికి అండ..

ప్రపంచంలో మేలైన వ్యవసాయ విధానాలు అధ్యయనం చేసి వాటిని రాష్ట్రానికి తెస్తున్నామని సీఎం తెలియజేశారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది వేరుశనగ దిగుబడులు గణనీయం గా పెరిగాయని, వేరుశనగ, మినుము, అపరాల రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలని కోరారు. దిగుబడులకు అనుగుణంగా గోడౌన్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆక్వాలో కాలుష్యం బెడదను పూర్తిగా నిర్మూలించాలని, కాలుష్యం ప్రభావంతో మన ఆక్వా ఉత్పత్తులకు ప్రాధాన్యం తగ్గే ప్రమాదముందన్నారు.



ఉపాధి నిధులు సద్వినియోగం

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవడంలో ముందుందన్నారు.పంటకుంటల తవ్వకంలో మొదటిస్థానంలో ఉన్నామని, ఉపాధి హామీ నిధుల వ్యయంలో మూడో స్థానంలో ఉన్నామన్నారు. పనిదినాల సంఖ్య మరింతగా పెంచాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

సీఎంతో 'అనస్' సీఈవో భేటీ

ఇటలీకి చెందిన అనస్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో సోమవారం భేటీ అయ్యారు. అమరావతి నిర్మాణంలో తమ భాగస్వామ్యాన్ని అందించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా తమ సంస్థ దోహాలో నిర్మించిన ఐకానిక్ బ్రిడ్జితో పాటు లిబియా, ఖతర్, రష్యాలో చేపట్టిన ఇతర ప్రాజెక్టుల గురించి ఆ సంస్థ సీఈవో ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతి నగర నిర్మాణంలో రోడ్డు ప్రాజెక్టులలో తాము భాగస్వాములు కావడానికి సిద్ధంగా ఉన్నామని, కృష్ణా నదిపై నిర్మించ తలపెట్టిన ఐకానిక్ వంతెన నిర్మాణంపై కూడా తాము ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. కాగా, ఏపీలో ప్రతిపాదిత కన్‌స్ట్రక్ష న్ మెటీరియల్ సిటీలో భాగస్వామ్యం కావాలని అనస్ ఇంటర్నేషనల్ సంస్థను సీఎం చంద్రబాబు కోరారు.

అమరావతి అంబాసిడర్.. వైష్ణవి

రాజధాని నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం ఇచ్చిన ముదినేపల్లికి చెందిన బాలిక అంబుల వైష్ణవిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. 9వ తరగతి చదువుతున్న వైష్ణవి సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి విరాళం అందజేశారు. ముదినేపల్లిలో రెండు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని రూ4.లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వైష్ణవి ముఖ్యమంత్రికి తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వైష్ణవిని అభినందించారు. అమరావతి అంబాసిడర్‌గా వైష్ణవిని నియమిస్తున్నామని ప్రకటించారు.

'దేవాదాయ' శాఖ పేరు మారుస్తాం

- దేవదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు

అమరావతి, జనవరి 29 (మనం ప్రతినిధి): రాష్ట్రంలోని దేవాదాయ ధర్మాదాయశాఖ పేరును మార్చేందుకు కృషి చేస్తున్నానని ఆ శాఖ మంత్రి మంత్రి పి.మాణిక్యాలరావు వెల్లడించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న శాఖ పేరును ''దేవ దాయ ధర్మ దయ'' శాఖగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దేవాదాయ శాఖ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితుల బట్టి వారసత్వ ఉద్యోగాలిచ్చేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. ప్రముఖ దేవాలయాల్లో రోజుకు లక్షా యాభై వేల మందికి ఉచిత దర్శనం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవ స్థానంలో కూడా దర్శనాల్లో మార్పులకు ప్రయత్నిస్తున్నామన్నారు. పదేపదే తిరుపతికి వెళ్లే వారి సంఖ్యను తగ్గించి, భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పించే యోచనలో ఉన్నామన్నారు. కాగా, బీజేపీ, టీడీపీ పొత్తుపై మంత్రిని ప్రశ్నించగా, ఆ విషయం అధిష్టానం చూసుకుంటుందని అన్నారు. పొత్తులు, మిత్ర ధర్మాల గురించి మాట్లాడేందుకు పార్టీలో సీనియర్ నేతలు ఉన్నారని, ఎన్నికలకు చాలా సమయం ఉందని, సందర్భం వచ్చినప్పుడు ఈ అంశంపై మాట్లాడతానని మాణిక్యాలరావు అన్నారు.



జీతాలు ఇవ్వనే ఇవ్వను!

- నాతోనే గట్టిగా మాట్లాడతారా?
- కార్మికులకు సోమిరెడ్డి బెదిరింపు
- బకాయిలు అడిగిన షుగర్స్ కార్మికులు



విశాఖపట్నం, జనవరి 29 (మనం న్యూస్‌బ్యూరో): బకాయిల కోసం గట్టిగా మాట్లాడితే జీతాలే ఇవ్వనని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి అనకాపల్లి షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులను హెచ్చరించారు. సోమవారం అనకాపల్లి వచ్చిన ఆయనకు.. గతంలో మూతపడిన తుమ్మపాల వీవీ రమణ షుగర్స్ ఒప్పంద కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం మంత్రికి వినతిపత్రం అందజేశారు. దాన్ని అందుకొన్న మంత్రి.. సమాధానం ఇవ్వకుండా రైతు సదస్సుకు వెళ్లిపోయారు. మంత్రి సమాధానం కోసం అక్కడే వేచివున్న కార్మికులు యూనియన్ అధ్యక్షుడు వీవీ నర్సింగరావు నేతృత్వంలో మంత్రిని మరోసారి బకాయిల సంగతేమిటని అడిగారు. దీంతో ఆగ్రహించిన సోమిరెడ్డి 'నాతోనే గట్టిగా మాట్లాడతారా.. ఇలా అయితే జీతాలు అసలు ఇవ్వనే ఇవ్వను' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన జీతం బకాయిలు ఇప్పించాలని వినతిపత్రం ఇస్తే.. సమస్య పరిష్కరించాల్సిన మంత్రి ఇలా బెదిరింపులకు దిగడమేంటని కార్మికులు అవేదన వ్యక్తం చేశారు

రైతుల పరిస్థితీ అంతే..

ఈ సహకార షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతుల పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. మూడేళ్లుగా కర్మాగారం తెరవకపోవడంతో రైతులు బెల్లం తయారు చేసుకొంటున్నారు. మిగిలిన చెరకును బయట ఫ్యాక్టరీలకు అమ్ముకొంటున్నారు. విచిత్రంగా నాలుగు రోజుల క్రితం షుగర్ కమిషనర్ కార్యాలయానికి చెందిన అధికారులు వచ్చి.. తాము చెప్పిన ఫ్యాక్టరీలకే చెరకు అమ్మాలంటూ హుకుం జారీచేశారు. అలా అమ్మడం కుదరదన్న రైతులపై పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. తాము పండించిన పంటను ఎక్కడ, ఎంతకు అమ్ముకోవాలో కూడా అధికారులే నిర్ణయిస్తే ఇక తమకు గిట్టుబాటు ధరలు ఎలా వస్తాయని రైతులు నిలదీస్తున్నారు.

సింహాచలంలో 'ఊరూరా బ్రహ్మంగారు'

ముఖ్య అతిథిగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్

సింహాచలం, జనవరి 29(మనం న్యూస్): సింహాచలం పుష్కరిణి ప్రాంగణంలో శ్రీకామాక్షి ఏకాంబేశ్వర సనాతన ధర్మపీఠం సేవా ట్రస్ట్, సింహాచలం పండూరి సాంబమూర్తి ఆచారి ఆధ్వర్యంలో ఊరూరా బ్రహ్మంగారి పూజా కార్యక్రమమునకు గోవిందమాంబ సమేతే వీర బ్రహ్మేంద్రస్వాములవారి కళ్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి, కాతేంద్రస్వామి పీఠాధిపతులు, విశ్వకర్మ పీఠం హైదరాబాదు, ఎర్రోజు చంద్రమౌళి ఆచారి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలి ప్రభావం రోజురోజుకు పెరిగి సమాజంలో దానం, ధర్మం, ఆచారాలు విస్మరించి అధర్మం పెరిగి ప్రజలు హింసా ప్రవృత్తులై పోతున్న క్రమంలో కుల మత భేదం లేకుండా స్వామివారి నామాన్ని ప్రచారం చేయడానికే ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

అవినీతికీ ప్లానింగ్

విశాఖలో అధికారిపై ఏసీబీ దాడులు

దాదాపు రూ. 100 కోట్ల ఆస్తులు

2.7 కిలోల బంగారం.. భారీగా వెండి

బోలెడు స్థలాలు.. పొలాలు.. ఇళ్లు

రెండు రాష్ట్రాల్లో 12 చోట్ల సోదాలు




విశాఖపట్నం/ అమరావతి, జనవరి 29 (మనం ప్రతినిధి): ఏసీబీ వలలో మరో అవినీతి తిమింగలం చిక్కింది. విశాఖ పట్టణాభివృద్ధి సంస్థ అదనపు చీఫ్ అర్బన్ ప్లానర్‌గా పనిచేస్తున్న పసుపర్తి ప్రదీప్‌కుమార్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు చేసింది. దాదాపు వంద కోట్ల రూపాయలకు పైగా ఆస్తులు కనుగొన్నారు. సోమవారం ఉదయం విశాఖపట్నం సంపత్ వినాయక ఆలయం సమీపంలోని నటరాజ్ టవర్స్‌లోని ప్రదీప్‌కుమార్ నివాసంతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని మొత్తం 12 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. విశాఖలోని ప్రదీప్ నివాసం, వుడా కార్యాలయం, పెద్ద కుమారుడు హేమంత్ సాయి ఇళ్లు, బంధువులు, స్నేహితుల ఇళ్లు, హైదరాబాద్, విజయవాడ, అనంతపురం, ఒంగోలు ప్రాంతాలలో ఆయనకు సంబంధించిన వారు అందరి ఇళ్లలోనూ సోదాలు జరిగాయి. ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ ఆదేశాల మేరకు ఏసీబీ డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాద్ నేతృత్వంలో ఈ సోదాలు నిర్వహించారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చాకర్ల గ్రామానికి చెందిన ప్రదీప్.. 1984లో అనంతపురం జిల్లా గుంతకల్లులో డ్రాఫ్ట్‌మన్‌గా చేరారు. ఆ తర్వాత 1991లో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందారు. 2010లో అసిస్టెంట్ సిటీప్లానర్‌గా పదోన్నతి పొందారు. తర్వాత 2013లో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ హోదాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సిటీప్లానర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఇదే హోదాలో ఉడా అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రదీప్ కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈయన పెద్ద కుమారుడు విశాఖలోనే హెచ్ఎస్ కన్‌స్ట్రక్షన్ పేరిట వ్యాపారం నిర్వహిస్తుండగా, చిన్న కుమారుడు మణిపాల్‌లో ఇంజనీరింగ్ చేస్తున్నారు. భార్య ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్నారు.

భారీగా ఆస్తులు

ఇటీవలి కాలంలో చాలామంది టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏసీబీకి చిక్కుతున్నారు. ఇదే తరహాలో ప్రదీప్‌కుమార్ కూడా అడ్డంగా దొరికేశారు. భారీ స్థాయిలో అవినీతికి పాల్పడుతూ, అక్రమంగా ఆస్తులు కూడకట్టారనే ఆరోపణలతో సోమవారం ప్రదీప్ కుమార్ ఆస్తులపై ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఆయన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి...

- విశాఖజిల్లా మధురవాడలో 500 చదరపు గజాల ప్లాట్ (ఇల్లు)
- విశాఖపట్నం కిర్లంపూడిలోని శ్రీపాద
- నిలయంలో రూ. 40 లక్షల విలువైన ప్లాట్
- విశాఖజిల్లా మధురవాడలో 311 గజాల ఇళ్ల స్థలం (భార్య లత పేరు మీద)
- విజయవాడ దేవీనగర్‌లో రూ. 50లక్షల విలువైన స్థలం (2016)
- కడప జిల్లా మైదుకూరులో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి
- అనంతపురం జిల్లా మారుతీనగర్‌లో నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి
- రాజమండ్రిలో 253 చ.గజాల ప్లాట్ (తండ్రి పేరు మీద)
- విశాఖ జిల్లా మధురవాడలో 599 గజాల హౌస్ ప్లాట్ (బావ పేరుమీద)
- విశాఖ జిల్లా మధురవాడలో రూ. 60లక్షల విలువైన 200 గజాల హౌస్ ప్లాట్ (బంధువు పేరు మీద)
- రూ. 4లక్షల నగదు(ఇంటిలో)
- రూ. 3లక్షల నగదు(బ్యాంకులో)
- రూ. 18లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్(భార్యపేరుమీద)
- రూ. పదిలక్షల ఇన్సూరెన్స్
- రూ. 21లక్షల విలువైన ఇంటి సామాగ్రి
- రూ. 70లక్షల విలువైన 2.7 కిలోల బంగారం
- రూ. 4లక్షల విలువైన 12.5 కిలోల వెండి
- పెద్ద కుమారుడు హేమంత్‌సాయి నిర్మాణసంస్థలో రూ. 10లక్షల పెట్టుబడి
- వాహనాలు.. ఒక మారుతీ బ్రిజా కారు, రెండు మోటర్ సైకిల్స్ (రాయల్ ఎన్‌ఫీల్డ్, స్కూటీ)






సెన్సెక్స్

జనవరి 29 2018

36,283.25




పెరిగినవి	%	తగ్గినవి	%
మారుతి సుజుకి	3.85	డాక్టర్ రెడ్డీస్	-5.92
హెచ్‌డీఎఫ్‌సి	2.66	భారతీ ఎయిర్‌టెల్	-2.66
టీసీఎస్	2.48	ఐటీసీ	-1.85
హీరో మోటార్స్	2.23	యస్ బ్యాంక్	-1.64
కోటక్ మహీంద్రా	2.06	ఓఎన్‌జీసీ	-1.58

నిఫ్టీ

జనవరి 29 2018

11130.40



పెరిగినవి	%	తగ్గినవి	%
మారుతి సుజుకి	3.80	డాక్టర్ రెడ్డీస్	-6.01
ఐషర్ మోటార్స్	3.52	లుపిన్	-3.94
హెచ్‌డీఎఫ్‌సి	3.11	గెయిల్	-3.93
భారతీ ఇన్‌ఫ్రా	2.90	భారతీ ఎయిర్‌టెల్	-2.67
యుపిఎల్	2.54	హెచ్‌పీసీఎల్	-2.34

టాప్ గైనర్స్

29 జనవరి

36,283.25


బి.ఎస్.ఇ సెన్సెక్స్ ▲232.81

		%
9634.50	మారుతి సుజుకి	3.85%
1953.25	హెచ్‌డిఎఫ్‌సి	2.66%
3195.10	టీసీఎస్	2.48%
3649.30	హీరో మోటార్	2.23%
1113.90	కోటక్ మహీంద్రా	2.06%
1397.25	హెచ్‌యుఎల్	1.90%
782.75	టాటా స్టీల్	1.79%
3357.30	బజాజ్ ఆటో	1.64%
1999.55	హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్	1.49%
587.05	సన్ ఫార్మా	1.09%


బులియన్| గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



ఆర్థిక సర్వేలో ప్రధానాంశాలు



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారంనాడు లోక్‌సభ ముందుంచిన 2017-18 ఆర్థిక సర్వేలో ప్రధానాంశాలివి.

- స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) 2019 ఆర్థిక సంవత్సరంలో 7-7.5 శాతం వృద్ధి చెందగలదు. వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అనే పేరును భారత్ తిరిగి సంతరించుకోగలదు.
- జి.డి.పి. వృద్ధి 2017-18 ఆర్థిక సంవత్సరంలో 6.75 శాతంగా ఉండగలదు.
- చమురు ధరలు హెచ్చు స్థాయిల్లో కొనసాగినా లేదా షేర్ల ధరల్లో సర్దుబాటు తీవ్రంగా చోటుచేసుకున్నా వచ్చే ఆర్థిక సంవత్సరంలో విధానపరమైన అప్రమత్తత అవసరమవుతుంది.
- వచ్చే ఏడాదికి విధాన ఎజెండా ఏమిటంటే వ్యవసాయానికి ఊతం ఇవ్వడం, ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించడం, బ్యాంకుల పునర్ మూలధనీకరణను పూర్తి చేయడం.
- పరోక్ష పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 50 శాతం పెరుగుదల చోటుచేసుకున్నట్లు జి.ఎస్.టి. డాటా వెల్లడించింది.
- ఇతర సమాఖ్య దేశాలలోకన్నా మన దేశంలో రాష్ట్రాలు, స్థానిక పాలనా సంస్థలు వసూలు చేసే పన్నులు గణనీయంగా తక్కువగా ఉన్నాయి.
- పెద్ద నోట్ల రద్దు ఫైనాన్షియల్ సేవింగ్స్‌ను ప్రోత్సహించింది.
- బ్యాంకుల నిరర్థక ఆస్తుల కష్టాలను పరిష్కరించేందుకు ఇన్‌సాల్వెన్సీ కోడ్‌ను క్రియాశీలంగా ఉపయోగిస్తున్నారు.
- రిటైల్ ద్రవ్యోల్బణం 2017-18లో గత 6 ఆర్థిక సంవత్సరాలలోనే తక్కువగా సగటున 3.3 శాతంగా ఉంది.
- అపిలేట్, జుడీషియల్ విభాగాల్లో పెండెన్సీ, జాప్యాలు, అపరిష్కృత కేసుల పరిష్కారంపై భారత్ దృష్టి సారించవలసిన అవసరం ఉంది.
- పట్టణాలకు వలసపోవడం సేద్యపు రంగంలో మహిళల పాత్రను పెంచుతోంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైతులకు వడ్డీ సహాయం కింద రూ. 20,339 కోట్లకు ఆమోదం.
- సంస్కరణలతో సేవల రంగంలో ఎఫ్.డి.ఐ. 2017-18లో 15 శాతం పెరిగింది.
- తక్కువ సమానత్వ స్థాయిని నివారించడంలో ఫిస్కల్ ఫెడరలిజం, జవాబుదారీతనం సహాయపడుతున్నాయి.
- అంతర్జాతీయ వర్తకం మెరుగుపడే అవకాశం ఉండడం వల్ల భారతదేశపు బాహ్య రంగం పటిష్టంగా కొనసాగగలదు.
- కార్మిక చట్టాలను మెరుగ్గా అమలు జరపడానికి టెక్నాలజీని వినియోగించుకుని తీరాలి.
- స్వచ్ఛ భారత్ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో 2014లో 39 శాతంగా ఉన్న పారిశుధ్య కవరేజీ 2018 జనవరి నాటికి 76 శాతానికి మెరుగుపడింది.
- సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించడానికి విద్య, ఆరోగ్యం వంటి సామాజిక మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వడం.
- తీవ్ర స్థాయిలో ఉన్న వాయు కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం, రాష్ట్రాలు సహకారాన్ని పెంపొందించుకోవడం.
- జండర్ సమస్యలను ఎలుగెత్తి చాటే విధంగా 2017-18 ఆర్థిక సర్వేని లేత గులాబీ రంగులో ప్రచురించడం.
- తగినంత సంఖ్యలో పుత్ర సంతానం కలిగేంత వరకు భారతీయ దంపతులు పిల్లల్నికనడాన్ని కొనసాగిస్తున్నారు.

స్టాక్ సూచీలు పైపైకి

ముంబయి: ఆర్థిక సర్వే ఆశాజనకమైన అంశాలు అందించడంతో మదుపరులలో సెంటిమెంట్ మరింత ఊపందుకుని స్టాక్ సూచీలు సోమవారం రికార్డు ర్యాలీని తిరిగి మొదలుపెట్టాయి. బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) 'సెన్సెక్స్' 233 పాయింట్లు లాభపడి నూతన జీవితకాల గరిష్ఠ స్థాయి 36,283.25 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' కూడా రికార్డు స్థాయిలో 11,130.40 పాయింట్ల వద్ద ముగిసింది. ఫిబ్రవరి డెరివేటివ్‌ల కాంట్రాక్టులు మొదలవడం, కంపెనీలు ప్రకటిస్తున్న ఆదాయాలు ప్రోత్సాహకరంగా ఉన్న సమయంలో విదేశీ నిధుల ప్రవాహం నిరంతరంగా కొనసాగడం కూడా ఆశావాదానికి బలమిచ్చిందని బ్రోకర్లు చెప్పారు. ''కోశ సంబంధ లోటు గ్రామీణ ప్రాంతాల దయనీయ పరిస్థితిని తగ్గించడంపై దృష్టి పెట్టిన బడ్జెట్ కోసం మార్కెట్ ఎదురుచూస్తోంది. మధ్య, చిన్న క్యాప్ షేర్లపై మదుపరులు అప్రమత్తం గా వ్యవహరిస్తున్నారు'' అని జియోజీత్ ఫైనాన్షియ ల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు. విదేశీ మదుపరులు తాత్కాలిక డాటా ప్రకారం గురువారం రూ. 937.31 కోట్ల విలువ చేసే షేర్లు కొనగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 965.67 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించాయి.

ఎగుమతుల్లో 70 శాతం ఐదు రాష్ట్రాలదే



న్యూఢిల్లీ: దేశ ఎగుమతుల్లో 70 శాతం వాటా తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళ నాడులనుంచి వస్తున్నట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. చమురు ధరలు పెరిగితే సమస్యలు తలెత్తగల అవకాశం ఉన్నప్పటికీ, అంతర్జాతీయ వర్తకం పెరుగుతుందని భావిస్తున్నందు వల్ల దేశ బాహ్య రంగ అవకాశాలు ప్రకాశమానంగా కనిపిస్తున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017-18 సంవత్సరపు ఆర్థిక సర్వేని సోమవారంనాడు పార్లమెంట్‌కు సమర్పించారు. ''అంతర్జాతీయ వర్తకం 2016లో 2.4 శాతంగా ఉన్నది 2017లో 4.2 శాతం, 2018లో 4 శాతం మేరకు వృద్ధి చెందగలదని అంచనా వేస్తున్నందున, భారతదేశపు బాహ్య రంగ అవకాశాలు ఈ ఏడాదిలోను, రానున్న సంవత్సరంలోను ఉజ్వలంగా కనిపిస్తున్నాయి'' అని నివేదిక తెలిపింది. అయితే, ముడి చమురు ధరలు పెరిగితే వర్తక అవకాశాలు తగ్గవచ్చని పేర్కొంది. గుడ్డిలో మెల్లలా ప్రభుత్వానికి జమ అయ్యే మొత్తాలు పుంజుకోవడం ప్రారంభించాయని, అవి మరింత పెరగడానికి అవకాశం ఉందని తెలిపింది. ప్రభుత్వం చేపట్టిన జి.ఎస్.టి., లాజిస్టిక్స్, వర్తక వెసులుబాటు విధానాలు ఊతంగా పనిచేసి, విదేశీ వర్తకానికి మరింత సహాయపడవచ్చని పేర్కొంది. దేశ సరుకుల ఎగుమతులు 2017-18 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో 12 శాతం వృద్ధి చెంది, 223.51 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం అదే కాలంలో అవి 199.46 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి 9 నెలల కాలంలో దిగుమతులు 21.76 శాతం పెరిగి 338.36 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకున్నాయి. ఫలితంగా, 114.85 బిలియన్ డాలర్ల మేరుక వాణిజ్య లోటు ఏర్పడింది. ''భారతదేశ చరిత్రలో మొదటిసారిగా'' అంతర్జాతీయ ఎగుమతులలో రాష్ట్రాల వాటాపై డాటాను ఇచ్చినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. ఈ డాటా ఎగుమతుల పనితీరుకు, రాష్ట్రాల జీవన ప్రమాణాలకు మధ్యనున్న సహసంబంధాన్ని సూచిస్తుంది. ''అంతర్జాతీయ ఎగుమతులు చేసే, ఇతర రాష్ట్రాలతో వర్తకం చేసే రాష్ట్రాలు సంపన్నమవుతున్నట్లు కనుగొన్నారు. సంపదకు, అంతర్జాతీయ వర్తకానికి మధ్య అటువంటి సహసమన్వయం పటిష్టంగా ఉంది'' అని నివేదిక పేర్కొంది. దేశ ఎగుమతుల్లో 70 శాతం వాటా ఐదు రాష్ట్రాల నుంచే వస్తున్నట్లు తెలిపింది. వస్తువులు, సేవల ప్రపంచ వర్తక పరిమాణం ఈ ఏడాది వేగవంతమవుతుందని అంచనా వేసింది. ''అంతర్జాతీయంగా పెరిగిన అనిశ్చితి, సంరక్షణ వాదం, కఠిన వలస నిబంధనలు భారదేశపు సేవల ఎగుమతులను తీర్చిదిద్దడంలో కీలక అంశాలుగా పనిచేయవచ్చు'' అని నివేదిక తెలిపింది. భారతదేశం 2016లో ప్రపంచంలో కమర్షియల్ సర్వీసుల ఎగుమతులలో 3.4 శాతం వాటాతో ఎనిమిదవ పెద్ద దేశంగా నిలిచింది. ఎగుమతులలో సరుకుల ఎగుమతుల వాటా మాత్రం 1.7 శాతంగా మాత్రమే ఉంది.

పారదర్శకతకు టెక్నాలజీ వినియోగం



న్యూఢిల్లీ: దేశంలో కార్మిక చట్టాలను ప్రభావశీలంగా అమలుచేయడంలోనేకాక, మరింత పారదర్శకతను, జవాబుదారీతనాన్ని తీసుకొచ్చేందుకు టెక్నాలజీ వినియోగం సహాయపడగలదని ఆర్థి సర్వే పేర్కొంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారంనాడు పార్లమెంట్ ముందుంచిన 2017-18 ఆర్థిక సర్వే వివిధ కార్మిక సంస్కరణల చర్యలను ప్రముఖంగా వివరించింది. నిబంధనలు పాటించడంలో సంక్లిష్టతను తగ్గించడంతోబాటు ఫలితాలకు పూచీనివ్వగల టెక్నాలజీ చోదిత చర్యలను కూడా వాటిలో వెల్లడించింది. ఉపాధి అవకాశాలు సృష్టించడంతోబాటు, అనియత ఆర్థిక వ్యవస్థలో ఎక్కువగా పాటుపడుతున్న జనులకు స్థిరమైన జీవనోపాధులు కల్పించేందుకు కార్మిక రంగంలో తీసుకొస్తున్న శాసనపరమైన సంస్కరణల స్థితిని కూడా సర్వే సమీక్షించింది. ప్రభుత్వం వివిధ టెక్నాలజీ ఆధారిత రూపాంతరీకరణ చర్యలు చేపట్టింది. శ్రమ్ సువిధ పోర్టల్, వివిధ కార్మిక చట్టాల కింద రిజిస్టర్లు నిర్వహించడానికి సంబంధించిన నియమ నిబంధనలు సడలించడం, యూనివర్శల్ ఎకౌంట్ నంబర్ వంటివి వాటిలో ఉన్నాయి. నిబంధనలు పాటించడంలో జటిలంగా ఉన్న భారాన్ని తగ్గించేందుకు, మార్గదర్శక సూత్రాల మెరుగైన అమలుకు జవాబు దారీ వహించేట్లు చేయడానికి నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ ఏర్పాటు గురించి తెలిపింది.


మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2017-18లో బడ్జెట్‌లో అధిక మొత్తం కేటాయించినట్లు తెలిపింది. సుమారు 4.6 కోట్ల కుటుంబాలకు ఉపాధి కల్పించారు. ఈ ఏడాది జనవరి 14 నాటికి దీని కింద కల్పించిన మొత్తం పని రోజుల సంఖ్య 177.8 కోట్లుగా ఉంది. వాటిలో 54 శాతాన్ని మహిళలు, 22 శాతాన్ని షెడ్యూల్డు కులాలవారు, 17 శాతాన్ని, షెడ్యూల్డు తెగలవారు చేజిక్కించుకున్నారని సర్వే వెల్లడించింది.

'దిగుబడులు తగ్గుతున్నాయి'

న్యూఢిల్లీ: వాతావరణ మార్పు ప్రభావం భారతీయ వ్యవసాయ రంగంపై ఇప్పటికే కనిపిస్తోందని, ఇది మధ్య కాలంలో వ్యవసాయ ఆదాయాలను 20 నుంచి 25 శాతం తగ్గించవచ్చని 2017-18 ఆర్థిక సర్వే పేర్కొంది. ప్రభుత్వమే ఈ రకమైన అంచనాకు రావడంతో, 2022 నాటికి రైతుల ఆదాయాలు రెండింతలు చేయడానికి కృషి చేస్తామనే ప్రభుత్వ ప్రయత్నాలు ప్రశ్నార్థకంగా తయారవుతున్నాయి. వాస్తవిక వ్యవసాయ వృద్ధి 2014 నుంచి నాలుగేళ్ళలో 4 శాతంగా ఉందని అంచనా.

గ్రామీణ ప్రాంతాల నుంచి పురుషులు ఉపాధి వెతుక్కుంటూ పట్టణ ప్రాంతాలకు వలసపోవడం పెరుగుతున్న కారణంగా, భారతీయ సేద్యపు రంగంలో మహిళల పాత్ర పెరుగుతోందని సోమవారంనాడు పార్లమెంట్ ముందుంచిన ఆర్థిక సర్వే తెలియజేసింది. దుక్కి దున్నేవారుగా, వ్యవస్థాపక సామర్థ్యాన్ని కనబరచేవారుగా, శ్రామికులుగా మహిళల పాత్ర గ్రామాల్లో అనేక రకాలుగా విస్తరిస్తోందని సర్వే తెలిపింది. రైతులకు నేరుగా నగదు బదలీ చేయడానికి, బిందు, సూక్ష్మ సేద్యపు పద్ధతుల కిందకు తీసుకొచ్చే భూములను పెంచడానికి సర్వే మద్దతు తెలిపింది. ''భారతీయ భూభాగంపై వాతావరణ మార్పు ముద్రలను, పర్యవసానంగా వ్యవసాయ దిగుబడులపై వాటి ప్రతికూల ప్రభావాన్ని సర్వే పసిగట్టింది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడం, వర్షపాతంలో లోటు దేశమంతటా నమోదవుతోంది. డాటాను బట్టి దిగుబడులలో మార్పులు తేటతెల్లం అవుతున్నాయి. సేద్యంలో ఉన్న ప్రాంతాల్లోకన్నా సేద్యం కింద లేని ప్రాంతాల్లో ప్రభావం రెండింతలు ఎక్కువగా ఉన్నట్లు కనుగొన్నారు'' అని సర్వేపై విడుదల చేసిన అధికారిక ప్రకటన ఒకటి వెల్లడించింది. పంటల మార్పిడికి సంబంధించిన సూచీలో మొదటి మూడు స్థానాలలో ఆంధ్ర ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్‌లు ఉన్నాయని సర్వే వెల్లడించింది.

'విజ్ఞాన ఉత్పత్తిదారుగా పరిణమించాలి'



న్యూఢిల్లీ: అభివృద్ధి విషయంలో ఎదుర్కొంటున్న కొన్ని తీవ్ర సవాళ్ళను పరిష్కరించేందుకు భారత్ క్రమంగా నికర వినియోగదారు స్థాయి నుంచి ''నికర విజ్ఞాన ఉత్పత్తిదారు''గా పరిణమించవలసిన అవసరం ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా దేశం ఆవిర్భవిస్తున్నందున, యువతలో ఉత్తేజాన్ని, ఒక లక్ష్యం కోసం పాటుపడే ధోరణిని ''తిరిగి జ్వలింపజేయవలసిన'' అవసరం ఉందని, అది సైంటిఫిక్ ఎంటర్‌ప్రైజ్ వైపు మరింత మంది యువతను ఆకర్షిస్తుందని సోమవారంనాడు పార్లమెంట్ ముందుంచిన ఆ సర్వే పేర్కొంది. వైజ్ఞానిక పరిశోధనలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించడం వల్ల విజ్ఞాన పునదా ఏర్పడుతుంది. అబివృద్ధి విషయంలో దేశం ఎదుర్కొంటున్న కొన్ని తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొనడం సాధ్యమవుతుంది. ''మంచి, మర్యాదతో కూడిన, విశాల దృక్పథ సమాజ'' నిర్వహణకు తోడ్పడుతుందని పేర్కొంది. భారతదేశ భద్రతకు కూడా అటువంటి పెట్టుబడి ప్రాథమిక అవసరమని తెలిపింది. ''వాతావరణంలో మార్పు వల్ల అనేక రకాల అనిశ్చితులు ఏర్పడుతున్నాయి. సైబర్ యుద్ధ తంత్రం నుంచి డ్రోన్‌ల వంటి అటానమస్ సైనిక వ్యవస్థల వరకు కొత్త రకాల ముప్పులు తలెత్తుతున్నాయి. జాతీయ భద్రతకు కొత్త సవాళ్ళు ఏర్పడుతున్నాయి'' అని తెలిపింది. వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన స్థితిస్థాపక శక్తిని సమకూర్చుకునేందుకు శాస్త్రీయ పరిశోధనలు అవసరమని 2017-18 ఆర్థిక సర్వే పేర్కొంది. శాస్త్రీయ పరిశోధనలు ''చాలా వేగంగా'' సాగుతూండడమేకాక, విస్తరిస్తూండడాన్ని, ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, ప్రభుత్వ వృత్తి, ఉద్యోగాలకు భారతదేశపు యువత సాధారణంగా ప్రాధాన్యం ఇవ్వడాన్ని సర్వే గమనికలోకి తీసుకుందని, ఇది కూడా దేశం నికర విజ్ఞాన ఉత్పత్తిదారుగా పరిణమించవలసిన అవసరాన్ని సూచిస్తోందని పేర్కొంది. సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐ.టి), బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బి.పి.ఎం) రంగంపై సాఫ్ట్‌వేర్ అసోసియేషన్ 'నాస్‌కామ్' ఇచ్చిన డాటాను సర్వే ఉటంకించింది. (ఈ-కామర్స్, హార్డ్‌వేర్ మినహాయించగా) పరిశ్రమ 2016-17లో 8.1 శాతం వృద్ధి చెంది 139.9 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుందని తెలిపింది. ఈ రంగ ఎగుమతులు అదే కాలంలో 7.6 శాతం వృద్ధి చెంది 116.1 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ''ఈ-కామర్స్ మార్కెట్ 2016-17లో 19.1 శాతం వృద్ధితో 33 బిలియన్ అమెరికన్ డాలర్ల మేరకు ఉండగలదని అంచనా వేసినట్లు'' సర్వే తెలిపింది. డిజిటల్ ఇన్‌క్లూజన్, సమాన వృద్ధి, ఉపాధి కల్పన సృష్టికి బి.పి.ఓ. ప్రోత్సాహక, ఉమ్మడి సేవల కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్వే తెలిపింది. డాటా సంరక్షణ విధాన ముసాయిదా రూపకల్పనతో సహా, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్మార్ట్ నగరాలు, ఇ-పాలన, నగదు రహిత ఆర్థిక వ్యవస్థ దిశగా కృషి ఇప్పుడు కొనసాగుతున్న కార్యక్రమాలు ఇతర కీలక చర్యల కిందకు వస్తాయని సర్వే పేర్కొంది.

ఉక్కు ఉత్పత్తిలో అమెరికాను

అధిగమించిన భారత్

worldsteel ASSOCIATION

న్యూఢిల్లీ: ప్రపంచంలో ఉక్కు ఉత్పత్తిలో అమెరికాను అధిగమించి భారత్ మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పుడు జపాన్ నుంచి రెండవ స్థానాన్ని కూడా సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. భారతదేశపు ముడి ఉక్కు ఉత్పత్తి 2016లో 95.5 మిలియన్ టన్నులుగా ఉన్నది 2017లో 6.2 శాతం వృద్ధి చెంది 101.4 మిలియన్ టన్నులుగా నిలిచిందని వరల్డ్ స్టీల్ అసోసియేషన్ నివేదిక వెల్లడించింది. చైనా 831.7 మిలియన్ టన్నులతో 2017లో ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలో మొదటి స్థానంలో నిలిచింది. అది 2016లో 786.9 మిలియన్ టన్నుల ఉక్కు మాత్రమే ఉత్పత్తి చేసింది. ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలో రెండవ స్థానంలో ఉన్న జపాన్ 2017లో ప్రతికూల వృద్ధిని వీక్షించింది. అది 2016లో 104.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తే 2017లో 104.7 మిలియన్ టన్నుల ఉక్కును మాత్రమే ఉత్పత్తి చేయగలిగింది. ప్రపంచం మొత్తంమీద ఉక్కు ఉత్పత్తి 2016లో ఉన్న 1606.3 మిలియన్ టన్నుల నుంచి 2017లో 1691.2 మిలియన్ టన్నులకు పెరిగింది. ''కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ (సి.ఐ.ఎస్)ని మినహాయిస్తే 2017లో ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ముడి ఉక్కు ఉత్పత్తి పెరిగింది. సి.ఐ.ఎస్.లో మాత్రం (ప్రస్తుత అంచనాల ప్రకారం) అది స్థిరంగా ఉంది'' అని నివేదిక తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద పరిశ్రమల సంఘాలలో వరల్డ్‌స్టీల్ ఒకటి. దీనిలో సభ్యులుగా ఉన్న పరిశ్రమలు ప్రపంచ ఉక్కు ఉత్పత్తిలో దాదాపు 85 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. దీనిలో 160కి పైగా ఉక్కు సంస్థలు సభ్యులుగా ఉన్నాయి. పది అగ్ర ఉక్కు ఉత్పత్తి కంపెనీల్లో 9 ఈ సంస్థలో ఉన్నాయి. జాతీయ, ప్రాంతీయ ఉక్కు పరిశ్రమల సంఘాలు, ఉక్కు పరిశోధనా సంస్థలు వరల్డ్‌స్టీల్‌లో సభ్యులుగా ఉన్నాయి.

ఆశించిన రీతిలోనే

జి.ఎస్.టి. వసూళ్ళు



న్యూఢిల్లీ: వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి) వసూళ్ళు 2017 డిసెంబర్‌లో పెరిగాయి. అయినా, జూలై నుంచి ఓ మోస్తరుగా ఉన్న వసూళ్ళు కోశ సంబంధ లోటుకు సంబంధించి సమస్య సృష్టించవచ్చనే భయాలున్నాయి. కానీ, సంఖ్యలను సన్నిహితంగా పరిశీలిస్తే ఆ భయాలు నిరాధారమైనవేనని తెలుతుంది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఎకౌంట్స్ (సి.జి.ఏ) ప్రకారం, కేంద్రం పన్ను వసూళ్ళు 2017-18 బడ్జెట్ అంచనాలకు తగ్గట్లుగానే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. కానీ, నూతన వ్యవస్థలో చిక్కుముడులు అనేకం ఉన్నాయి. కేంద్రం, రాష్ట్రాలకు చెందిన అనేక పరోక్ష పన్నులను మిళితం చేసుకున్న జి.ఎస్.టి.లోని సంక్లిష్టత నెలవారీ వసూళ్ళ లక్ష్యాన్ని అంచనా వేయడాన్ని కష్టంగా మార్చింది. 2017 జూలై నెలకు రూ. 91,000 కోట్లను లక్ష్యంగా పెట్టుకున్నామని వసూళ్ళు దానికన్నా మెరుగ్గానే ఉన్నాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017 ఆగస్టులో మీడియా సమావేశంలో అన్నారు. అప్పటి నుంచి నెలవారీ జి.ఎస్.టి. వసూళ్ళు లెక్కించడానికి ఆ సంఖ్య ఒక ప్రమాణంగా ఉపయోగపడుతూ వస్తోంది. కానీ, దానిని కనుక గీటురాయిగా చేసుకుంటే జి.ఎస్.టి. వసూళ్ళు అక్టోబర్ (రూ. 83,346 కోట్లు), నవంబర్ (రూ. 80,808 కోట్లు), డిసెంబర్ (రూ. 86,703 కోట్లు)లలో లక్ష్యం కన్నా తక్కువగా ఉన్నట్లు తేలుతాయి. అయితే, అది వాస్తవం కాకపోవచ్చు. జి.ఎస్.టి. నెలవారీ లక్ష్యాన్ని అంచనా వేసేందుకు, అసలు, వస్తువులు, సేవల నుంచి ఎంతమేరకు రాబడి ఉండగలదని 2017-18 సంవత్సరపు బడ్జెట్ అంచనాలో పేర్కొన్నారో చూద్దాం. సర్వీసు పన్నులలో చాలా భాగాన్ని జి.ఎస్.టి. కిందకు చేర్చారు. ఎక్సైజ్ సుంకం వసూళ్ళలో సుమారు మూడో వంతు మాత్రమే జి.ఎస్.టి. కింద ఉన్నాయి. ఎందుకంటే, అనేక పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు ఇప్పటికీ కొత్త పన్ను వ్యవస్థకు బయటనే ఉన్నాయి. కస్టమ్స్ సుంకం కింద, దాదాపు 64 శాతం వసూళ్ళు ఇప్పుడు జి.ఎస్.టి. కిందకు వచ్చాయి. దీనిని కనుక ప్రాతిపదికగా ఏచసుకుంటే, పరోక్ష పన్నుల కింద కేంద్రానికి నెలకు దాదాపు రూ. 43,000 కోట్ల మేరకు జి.ఎస్.టి. వసూలైతే చాలు. కేంద్ర రాబడిలో రాష్ట్రాల వాటా కింద దానిలో కొంత భాగం వాటికి పోతుంది. రాష్ట్రాల 2015-16 రాబడిలో 14 శాతం వార్షిక వృద్ధి ఉందనుకుంటే, ప్రతి నెలా రాష్ట్రాలకు రూ. 43,000 కోట్లు పంపిణీ చేయవలసి ఉంటుంది. ఈ సంఖ్యలను బట్టి చూస్తే కేంద్రం, రాష్ట్రాల అవసరం తీరడానికి నెలకు జి.ఎస్.టి. వసూళ్లు దాదాపు రూ. 80,000 కోట్ల మేరకు ఉంటే సరిపోతుంది.

కేంద్రం సరే రాష్ట్రాలు...

కేంద్ర రాబడి అనుకున్న రీతిలోనే ఉంది. రాష్ట్రాలకు కేటాయింపులు మాత్రం సమస్యను లేవనెత్తవచ్చు. ఐ.జి.ఎస్.టి. రాబడిని ఒక నిర్ణీత కాలంలో పంపిణీ చేస్తారు కనుక, రాబడి తగ్గిందనే భావన రాష్ట్రాలకు ఉండవచ్చు. వ్యాపార సంస్థలు తాత్కాలిక జి.ఎస్.టి.ఆర్.3బి ఫారంలో క్లైమ్ చేస్తున్న ఇన్‌పుట్-ట్యాక్స్ క్రెడిట్‌పై వివాదాలు ఈ విషయంలో ఒక అంచనాకు రావడానికి మరో అవరోధంగా పరిణమించవచ్చు. ఇది తప్పకుండా ఆర్థిక శాఖకు ఒక ప్రధాన సమస్యేనని, ఎందుకంటే, జి.ఎస్.టి.కి ఇన్‌వాయిస్ మ్యాచింగే వెన్నెముకని ఒక విశ్లేషకుడు చెప్పారు.

వాస్తవిక సంఖ్యలు


కేంద్రానికి పరోక్ష పన్ను వసూళ్ళు తగ్గలేదనడానికి సి.జి.ఏ. వెల్లడిస్తున్న సంఖ్యలే నిదర్శనం. కేంద్రానికి 2017 ఏప్రిల్-నవంబర్ కాలంలో స్థూల పన్ను రాబడి 2016-17లో అదే కాలంలో ఉన్నదానికన్నా 16.5 శాతం ఎక్కువగా రూ. 10,87,302 కోట్ల మేరకు ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కాలంలో కేంద్ర స్థూల పరోక్ష పన్ను వసూళ్ళు 18.2 శాతం పెరిగి రూ. 5,08,924 కోట్ల నుంచి రూ. 6,01,904 కోట్లకు పెరిగాయి. రాష్ట్రాలకు ఇచ్చిన మొత్తం 25 శాతం పెరిగింది. కేంద్ర నికర పన్ను రాబడి 12.59 శాతం పెరిగింది. దీన్ని బట్టి కోశ సంబంధ లోటును నిర్వహించడంలో ఆర్థిక మంత్రికి పెద్దగా కష్టాలు ఉండకపోవచ్చని తెలుస్తోంది.

మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 30 జనవరి 2018

దైవవాణి

మంచి - చెడు

హజ్రత్ లుక్మాన్ అలైహిస్సలాం సజ్జనులైన దైవదాసులు. ఆఫ్రికాఖండంలో జన్మించారు. కేవలం ఒక వస్త్రాన్ని చుట్టుకుని అడవుల్లో పాదాలకు చెప్పులు కూడా లేకుండా వన్యమృగాలతో కలిసి తిరిగేవారు. అడవిలో జీవితం నుంచి భయం ఎరుగని వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నారు. తన చుట్టూ ఉన్న ప్రకృతి గురించి దీర్ఘంగా ఆలోచించేవారు. ఆ ఆలోచనల నుంచి అనేక కొత్త విషయాలను ఆవిష్కరించుకున్నారు. విషయావగాహనలో, ధార్మిక దృష్టిలో సాటిలేని మేటిగా పేరు సంపాదించుకున్నారు.



మీకు ఇంతటి విజ్ఞత ఎలా వచ్చిందని ప్రజలు తరచుగా ఆయనను అడిగేవారు. రుజువర్తన వల్ల, నిజాయితీ వల్ల, నిరర్థకమైన విషయాలకు దూరంగా వల్ల అని ఆయన సమాధానమిచ్చేవారు. ఆఫ్రికాపై దండెత్తిన బానిస వ్యాపారులు ఆయనను నిర్బంధించారు. ఆయన్ను ఒక బానిసగా అమ్మేసారు. ఆయన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కోల్పోయారు. చిరునవ్వుతో ఈ కష్టాన్ని ఆయన భరించారు. సహనం వహించారు. అల్లాహ్ అనుగ్రహం కోసం ఎదురుచూడసాగారు. ఆయన్ను కొనుక్కున్న వ్యక్తి మంచివాడు. అతడు లుక్మాన్ పట్ల దయగా ఉండేవాడు. లుక్మాన్ సామాన్య వ్యక్తి కాదని అతడు గుర్తించాడు. ఈయన వివేకానికి ఒక పరీక్ష పెట్టాలనుకున్నాడు.

ఒకరోజు గొర్రెను కోసి అందులోని అత్యంత చెడ్డభాగాలు తన వద్దకు తీసుకురమ్మని ఆదేశించాడు. యజమాని చెప్పినట్లుగానే లుక్మాన్ గొర్రెను కోసి దాని గుండె, నాలుకలను తీసుకెళ్లి యజమానికి చూపించారు. అతడికి లుక్మాన్ ఎంపిక సంతోషాన్నిచ్చింది. కొన్నిరోజులు పోయిన తరువాత మరోసారి గొర్రెను కోసి అందులోని ఉత్తమ భాగాలు తీసుకురమ్మని ఆదేశించాడు. ఈసారి కూడా లుక్మాన్ గుండె, నాలుకలనే తీసుకువెళ్లారు. యజమాని వాటిని చూసి శరీరంలోని అత్యంత చెడ్డభాగాలే మంచిభాగాలు కూడా ఎలా అవుతాయని ప్రశ్నించాడు యజమాని. మంచితనం, చెడ్డతనం అనేవి హృదయం, నాలుకల వల్లనే తెలుస్తుంది. మనిషిని మంచివానిగానూ, చెడ్డవానిగానూ తీర్చిదిద్దగలిగే శక్తి ఉన్నవి ఆరెండు భాగాలే అని లుక్మాన్ సమాధానమిచ్చారు. ఆయన వివేకం, విచక్షణ యావత్తు రాజ్యంలో మారుమోగసాగాయి. యజమాని మరణానంతరం లుక్మాన్ అలై హిస్సలం స్వేచ్ఛాజీవితం పొందారు. అనేక ప్రాంతాలు పర్యటించి బనీ ఇస్రాయిల్ వద్ద స్థిరపడ్డారు. దావూద్ (అలై) పాలనాకాలంలో న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. నిష్పక్షపాతంగా ఆయన ఇచ్చిన తీర్పులు ప్రసిద్ధి పొందాయి.

– ముహమ్మద్ లియాఖత్ ఉద్దీన్



మేడారం జాతరకు అన్ని ప్రాంతాలనుంచి భక్తులు వస్తారు. మన దేశంలో జరిగే అతి పెద్ద ఆధ్యాత్మిక సంరంభాలలో ఇది ఒకటి. ప్రపంచంలో మరెక్కడా ఇంతటి భారీ స్థాయిలో గిరిజన జాతర జరగదు. రెండేళ్లకోసారి మాఘ పూర్ణిమ తర్వాత వచ్చే నాలుగు రోజులపాటు మేడారం జాతర నిర్వహిస్తారు. కేవలం గిరిజనులేకాకుండా గిరిజనేతరులు కూడా సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటారు. జంటదేవతలకు ఎత్తుబంగారాన్ని, చీరసారలను, పసుపు కుంకాలను, మంగళ ద్రవ్యాలను సమర్పిస్తారు.

మేడారం జాతర

అది ఏడోశతాబ్దం. ఓరుగల్లుకు సమీపంలో బక్కయ్యపేట అనే గిరిజన గ్రామం ఉండేది. గోదావరి నదీతీరంలోని దండకారణ్య ప్రాంత సమీప గ్రామమది. అక్కడి కోయవారికి ఓరోజున పొదల మాటున పులుల సంరక్షణలో ఉన్న ఆడశిశువు లభించింది. ఆమెను వనదేవతగా గిరిజనులు భావించారు. మాఘశుద్ధ పౌర్ణమినాడు అందరి సమ్మతితో ఆ శిశువుకు సమ్మక్క అని నామకరణం చేశారు.



బాల్యం నుంచే సమ్మక్క ఎన్నో లీలలను, మహిమలను ప్రదర్శిస్తూ అందర్నీ అబ్బురపరిచేది. యుక్త వయస్సు వచ్చాక సమ్మక్కకు ఆ తెగ నాయకుడైన మేడిరాజు మేనల్లుడు పగిడిద్దరాజుతో వివాహం జరిగింది. సమ్మక్క – పగిడిద్దరాజు దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న జన్మించారు.

కాకతీయులకు సామంతులుగా గోదావరి తీరప్రాంత కోయరాజులు వ్యవహరించేవారు. తీవ్ర అనావృష్టి వల్ల ఓ సంవత్సరం కోయరాజులు కప్పం చెల్లించలేదు. దాంతో అప్పటి కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు తన బలగంతో కోయరాజ్యంపై దండెత్తాడు. కోయతెగ కాకతీయుల్ని దీటుగా ఎదుర్కొంది. సంపెంగ వాగు దగ్గర జరిగిన పోరులో పగిడిద్దరాజు, అతని సంతానమైన సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవిందరాజు వీరమరణం పొందారు. పరాజయాన్ని భరించలేని జంపన్న సంపెంగవాగులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆనాటి నుంచి సంపెంగవాగు జంపన్నవాగుగా మారింది. ఇక సమ్మక్క స్వయంగా యుద్ధ రంగంలోకి వచ్చి కాకతీయులపై కత్తి ఝుళిపించింది. అపర దుర్గాశక్తిగా వీరవిహారం చేసింది. సమ్మక్క ధాటికి కాకతీయ సైన్యం కకావికలమైంది. ఆమెను ఎదురొడ్డి పోరాడడం కష్టమని భావించిన కాకతీయ సైన్యం వ్యూహం పన్ని కుట్రతో ఆమెను వెన్నుపోటు పొడిచారు. గాయపడ్డ బెబ్బులిలా శత్రువులపై సమ్మక్క విరుచుకుపడింది. చివరవరకూ పోరాడి శత్రువుల చేతికి చిక్కకుండా నెత్తురోడుతూనే సమీపంలోని చిలుకలగుట్టపైకి వెళ్లింది. ఆ గుట్టపై నాగవృక్షం కింద ఓ కుంకుమ భరిణెలో తన రుధిరాన్ని నింపి తన జీవశక్తిని ఆ భరిణెలో ధారపోసింది. నేటికీ ఆ భరిణెను సమ్మక్క ప్రతిరూపంగా భక్తులు ఆరాధిస్తున్నారు. సమ్మక్క అంతర్ధానమైన ఆ ప్రదేశంలోనే చిలుకలగుట్టపై సమ్మక్కను వెదురురూపంలో ప్రతిష్ఠించారు. ధీరత్వానికి, శూరత్వానికి ప్రతీకలుగా సమ్మక్క-సారలమ్మలు నిలిచిపోయారు.



ఈ గడ్డపై పుట్టిన ప్రతి వ్యక్తి కర్తవ్యదీక్షలో పురోగతి సాధించాలి అని సమ్మక్క జాతికి సందేశమిచ్చింది. ఆమె వీరోచిత మరణం ప్రతాపరుద్రునిలో కూడా పరివర్తన కలిగించింది. సమ్మక్క సారలమ్మలను శక్తిమాతలుగా అతడు గుర్తించాడు. తమ వంశ దేవత అయిన 'కాకతి దేవత' అంశమూర్తులుగా వారిని సంభావించాడు.

సమ్మక్క-సారలమ్మ జాతరను ప్రతాపరుద్రుడే ప్రారంభించాడు. ఆ సంప్రదాయం నేటికీ నిరాటంకంగా కొనసాగుతోంది. రెండు వెదురుకర్రలకు కట్టిన కుంకుమ భరిణెల రూపంలో భక్తులకు జంట వనదేవతలుగా ఈ తల్లీబిడ్డలు దర్శనమిస్తారు. సమ్మక్క సారలమ్మ జాతరలో ప్రధానంగా అమ్మవారికి బెల్లం సమర్పిస్తారు. దీన్ని ఎత్తుబంగారం అని పిలుస్తారు. మొదట్లో చెరకు పానకం పొంగళ్లు, గుమ్మడికాయలు, అటవీ ఉత్పత్తులైన తేనె, ఇప్పపువ్వులను మొక్కుబడిగా చెల్లించేవారు. కానీ తర్వాత ఆ సంప్రదాయం కనుమరుగై కేవలం బెల్లపు దిమ్మల్నే ప్రధానంగా అమ్మ తల్లులకు సమర్పణ చేస్తున్నారు.

మేడారం జాతరలో రేపు తొలిరోజున సారలమ్మను మేడారం గద్దెల వద్దకు తీసుకు వస్తారు. గురువారం రెండో రోజు సమ్మక్క దేవతను చిలుకలగుట్ట నుంచి గద్దెలపైకి తీసుకువస్తారు. శుక్రవారం ప్రధాన జాతర జరుగుతుంది. సమ్మక్క పుట్టిల్లు బయ్యక్కపేట నుంచి చీరె, సారెలు అందుతాయి. సమ్మక్కను తమ ఆడబిడ్డగా కొలిచే చందావంశీయులు చీరె, రవిక, పసుపు, కుంకుమలు, గాజులు, ఒడివాల బియ్యం, పోక, ఖర్జూరాలను సమ్మక్క గద్దెకు సమర్పిస్తారు. జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు. ఎత్తుబంగారం, కానుకలను సమర్పిస్తారు. శనివారం నాడు వనదేవతలు తిరిగి వనప్రవేశం చేస్తారు.

నారద భక్తిసూత్రాలు – 11

వారు ధన్యులు

66 – 70 సూత్రాలు

త్రిరూప భంగపూర్వకం నిత్యదాస నిత్యాకాంతా భజనాత్మకం వా ప్రేమైవ కార్యమ్ ప్రేమైవ కార్యమ్ భక్తా ఏకాంతినో ముఖ్యాః కంఠావరోధ రోమాం చాశ్రుభిః పరస్పరం లపమానాః పావయంతి కులాని పృథివీం చ తీర్థీకుర్వంతి తీర్థాని సుకర్మీకుర్వంతి కర్మాణి సచ్ఛాస్త్రీ కుర్వంతి శాస్త్రాణి తన్మయాః



దాస్యభక్తితోనూ, మధురభక్తితోనూ భగవంతుని ప్రేమించాలి. అనన్యభక్తితో ఆయననే శరణువేడాలి. అటువంటి భక్తులే ముఖ్యులు. అనన్యభావము కలిగిన భక్తులు కంఠం గాద్గదిక మవుతుండగా, ఒడలు పులకరిస్తుండగా, నీటితో నిండిన కన్నులతో ఎలుగెత్తి భగవంతుని కీర్తిస్తారు. వారివల్లనే ఈ నేల పావన మవుతుంది. వారివల్లనే తీర్థక్షేత్రాలు పవిత్రతను సంతరించుకుంటాయి. సాధారణ జనులు మంచి కర్మలవైపు మరలుతారు. శాస్త్రవిజ్ఞానం పరిణతి చెందుతుంది. అటువంటివారే ధన్యులు.

72– 73 సూత్రాలు

నాస్తి తేషు జాతి విద్యారూప కులధన క్రియాదిభేదః యతస్తదీయాః

అటువంటి అనన్యభక్తి కలిగిన వారు అన్ని జాతులలోనూ ఉన్నారు. విద్యను బట్టి, కులాన్ని బట్టి, వారి లౌకిక సంపదలను బట్టి, చేస్తున్న వృత్తులను బట్టి భక్తులలో తేడాలు చూడలేం. అనన్య భక్తి కలిగినవారంతా భగవంతునితో సమానులే. వారిలో భేదబుద్ధి ఉండదు. వారిలో ఎవ్వరూ ఏ ఒక్క కారణం చేత కూడా తమను తాము అధికులుగా భావించుకోరు. అనన్యభక్తిని సాధించడానికి అందరూ అర్హులే. అటువంటి వారే దేశానికి అవసరం.

– ముకుందప్రియ



మాఘ పౌర్ణమి నాటికి చంద్రుడు మఖా నక్షత్రంలో ఉంటాడు. అఘము అంటే పాపం. మ అంటే పోగొట్టేది. పాపాలను నశింపచేసేది మాఘమాసం. శీతకాలం పూర్తయి చిరుఎండలు ప్రవేశించే రోజుల్లో మాఘపౌర్ణమి మానసిక ఉల్లాసాన్ని కలిగించే రోజుగా కూడా ప్రసిద్ధి పొందింది. ఈ పవిత్ర తిథినాడు ఆచరించవలసిన వాటిలో స్నానం తొలినియమం.

మహామాఘి

మాఘస్నాన వ్రతం గొప్ప ఫలాలను ఇస్తుంది. కోటిజన్మల పాపం సైతం మాఘస్నానం ప్రక్షాళన చేస్తుందంటారు. ఏ మాసంలో అయినా స్నాన ఫలితాన్ని పొందాలంటే సమయాన్ని గుర్తించాలి. ఆకాశంలో నక్షత్రాలు ఉండగానే తెల్లవారుజామున స్నానం చేయడం ఉత్తమం. నక్షత్రాలు అదృశ్యమై సూర్యోదయం కాకముందే స్నానం చేయడం మధ్యమం. సూర్యోదయం తరువాత చేసే స్నానం అధమం అన్నారు. అయితే కార్తికమాసంలో సూర్యోదయానికి ముందుగా, మాఘమాసంలో సూర్యోదయ వేళలో స్నానం చేయాలని కొందరు చెబుతారు. కార్తికంలో చంద్రకిరణాల శక్తి, మాఘంలో సూర్యుని లేతకిరణాల నుంచి వచ్చేశక్తి జలంలో సంపూర్ణంగా ఉన్నప్పుడే స్నానం చేయాలని పెద్దల సూచన. మాఘమాసం అంతా స్నానవ్రతాన్ని పాటించాలి. మాఘపౌర్ణమి నాడు సంకల్పం చెప్పుకుంటూ స్నానం చేస్తే ప్రయాగ స్నానఫలం లభిస్తుంది.

ప్రాతఃకాలపు స్నానం వల్ల అదృష్ట ఫలితం లభిస్తుంది. బ్రహ్మచారులు రోజుకోసారి, గృహస్థ రెండుసార్లు, సన్యాసి మూడుసార్లు స్నానం చెయ్యాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ప్రాతఃకాలపు స్నానం రుషిస్నానం, ఐదు-ఆరు గంటల మధ్య చేసే స్నానం దేవస్నానం, ఆరు-ఏడు గంటల మధ్య చేసే స్నానం మానవ స్నానం, ఆ తర్వాత చేసే స్నానం రాక్షస స్నానం. అనారోగ్య కారణంగా స్నానం చేయలేకపోతే విష్ణుస్మరణ చేస్తే అది మానస స్నానమవుతుంది. తులసి-మారేడు దళాలు కలసిన జలంతో శిరస్సుపైన సంప్రోక్షించుకుంటే అది ధ్యాన స్నానమవుతుంది. వేదవిదుల చేత 'స్నాతో భవతు' అని ఆశీర్వాదం పొందితే అది సారస్వత స్నానమవుతుంది. నదీ తీరాల్లోని మట్టిని శరీరం మీద పూసుకుని స్నానం చేస్తే అది మృత్తికా స్నానమవుతుంది. ఇలా ఎన్నో రకాల స్నానాల గురించి చెప్పుకున్నా మాఘమాసంలో ప్రాతఃకాలంలో చేసే స్నానానికి ఏ స్నానమూ సాటిరాదు.

సముద్ర స్నానం

మాఘ మాసంలో సముద్ర స్నానం తప్పనిసరిగా చేస్తారు. సముద్ర స్నానానికి ఆ కా మా వై అంటే ఆషాఢ, కార్తిక, మాఘ, వైశాఖ మాస పౌర్ణమి తిథులు శ్రేష్ఠం అంటారు. మహామాఘి నాడు గంగ యమున సంగమ ప్రదేశాల్లో స్నానం చేయడం వల్ల మహా పాతక నివారణ అవుతుంది. సముద్రస్నానం చేయడం కూడా గొప్ప ఫలాన్ని అనుగ్రహిస్తుంది. సముద్ర స్నానం చేసేటప్పుడు పాటించవలసిన నియమాలున్నాయి. అభ్యంగన స్నానం చేయకూడదు. అంటే వంటికి నూనె రాసుకోకూడదు. అశౌచం ఉన్నప్పుడు సముద్రాన్ని తాకకూడదు. పౌర్ణమి ఘడియలు ఉండగా ఏ సమయంలో అయినా స్నానం చేయవచ్చు. కానీ సూర్యాస్తమయం తరువాత పనికిరాదు. ఈ పౌర్ణమికి గ్రహణం కూడా ఉన్నందున ఉదయవేళలో మాత్రమే సముద్రస్నానం చేయాలి. గ్రహణ సమయంలో సముద్రాన్ని తాకరాదు.

సదాశివుని అర్ధాంగి సతీదేవి మాఘ పౌర్ణమి నాడే జన్మించింది. ఈ మాఘమాసంలోనే మళ్లీ ఆమె పార్వతిగా జన్మించి శివునికోసం తపస్సు ప్రారంభించింది. మాఘపౌర్ణమినాడు అమ్మవారికి పాయసం నివేదన చేయాలి. మహామాఘినాడు పుస్తకదానం చేయడం మంచిది. నువ్వులు దానం చేయడం, తినడం కూడా శ్రేయస్కరం. వస్త్రాలు, చెప్పులు, గొడుగు, నెయ్యి, వంటివి దానం చేసినందువల్ల నవగ్రహ అనుగ్రహం లభిస్తుంది. మాఘ మాసంలో ముల్లంగి తినకూడదు. మహామాఘినాడు మంత్రోపదేశం పొందినా, అంతకుముందే ఉపదేశం పొందిన మంత్రాన్ని పురశ్చరణ చేసినా చక్కటి ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ కాకునూరి సూర్యనారాయణ మూర్తి

రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం


తేదీ : జనవరి 31 బుధవారం
తిథి : మాఘపూర్ణిమ
నక్షత్రం : పుష్యమి, ఆశ్లేష
రాశి : కర్కాటకం
ప్రారంభసమయం : సా. గం. 5.18 ని.లు
గ్రహణ మధ్యకాలం : సా. గం. 6.59 ని.లు
ముగింపు సమయం : రా. గం. 8.40 ని.లు
ఫలితాలు : కన్య, ధనుస్సు, మేష, వృషభ రాశులవారికి శుభఫలితాలు. సింహ, వృశ్చిక, మకర, మీన రాశుల వారికి మధ్యమ ఫలితాలు. తుల, కుంభ, మిథున, కర్కాటక రాశుల వారికి అధమ ఫలితాలుంటాయి. పుష్యమి, ఆశ్లేష నక్షత్రం, కర్కాటక రాశులవారు గ్రహణం చూడకూడదు.
ఆహార నియమం : మధ్యాహ్న భోజనం పెందరాళే చేయాలి. రాత్రి గ్రహణం విడిచిపెట్టిన తరువాతే భుజించాలి.



మారేడుదళం

సురభిళసుమం... శివం

కావ్యాలు, ప్రబంధాలు శ్రీకారంతో ప్రారంభమవడం ఆచారం. దానినే మంగళాచరణ శ్లోకాలు లేదా పద్యాలంటారు. తరువాత ఇష్టదేవతాస్తుతి ఉంటుంది. 108 మంది శివభక్తులైన సంస్కృత, తెలుగు కవులు తమ కావ్యాలకు రచించిన మంగళాచరణ, ఇష్టదేవతా స్తోత్రశ్లోకాలను, పద్యాలను ఒకచోట గుదిగుచ్చారు డాక్టర్ తాడేపల్లి పతంజలి. శ్రీశివమంగళాచరణ సురభి అనే పేరుతో వెలువరించిన ఈ గ్రంథంలో నన్నెచోడుని కుమారసంభవము నుంచి ఆధునిక కవుల దాకా మెచ్చుతునకల వంటి పద్యాలకు ప్రతిపదార్థ తాత్పర్య వ్యాఖ్యానాలు అందించారు. కాళిదాసుని వంటి సంస్కృత కవుల శ్లోకాలు కూడా ఇందులో చోటుచేసుకున్నాయి. ఆయా కావ్యాల తొలి పద్య విశేషాలను చదవడం ద్వారా కావ్యవస్తువు, నేపథ్యం స్థూలంగా తెలుస్తుంది. మంగళాచరణ శ్లోకాలతో పాటు పద్మపాదాచార్యులు రచించిన శివపంచాక్షరీ భాష్యమ్, నమక భాగంలోని పాణి మంత్రాలకు వ్యాఖ్యానం అనుబంధంగా ఇచ్చారు. సాహిత్యప్రియులైన శివభక్తులకు ఇది చక్కని కానుక.



శ్రీ శివమంగళాచరణసురభి
వ్యాఖ్యాత: డాక్టర్ తాడేపల్లి పతంజలి, పేజీలు: 276, ప్రతులకు: రావికృష్ణకుమారి, 404, జంజనం కాంప్లెక్స్, చీరాల, ఫోన్ నెం.9866691587

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన మా చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016

మనం స్పోర్ట్స్
మంగళవారం, 30 జనవరి, 2018
www.manamnews.com

సింధు, సైనా ఫేవరెట్స్




బరిలో శ్రీకాంత్ కూడా ● నేటి నుంచి ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ సింధుతో పాటు ఫామ్‌లో ఉన్న సైనా నెహ్వాల్‌పై అందరి దృష్టి నిలిచింది. ఇండియా ఓపెన్ మంగళవారం ఇక్కడి సిరిఫోర్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభం కానుంది. ఈ మెగా ఈవెంట్‌లో 2014 చాంపియన్ కిదాంబి శ్రీకాంత్ కూడా బరిలోకి దిగనున్నాడు. గత వారం జరిగిన ఇండోనేషియా మాస్టర్స్‌లో పాల్గొనలేకపోయిన శ్రీకాంత్ ఈ టోర్నీలో ఈ ఏడాది సీజన్‌ను ప్రారంభించనున్నాడు. 2015 ఇండియా ఓపెన్ టైటిల్ గెలిచిన సైనా మడమ గాయం నుంచి కోలుకుని ఈ ఏడాది సీజన్‌ను ఆశావహంగా ప్రారంభించింది. గత వారంలో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. దీంతో ఇండియా ఓపెన్ ఫేవరెట్లలో సైనా కూడా ఉంది. 2016 రియో ఒలింపిక్స్ తర్వాత గాయపడిన సైనాకు తొలిసారి ఓ పెద్ద టోర్నీలో ఫైనల్ వరకు ఆడింది. ఫిట్‌నెస్ సరిగా లేకపోవడంతో 2017లో సైనా కనీసం రెండో రౌండ్ కూడా దాటలేకపోయింది. అయితే ఇండోనేషియా టోర్నీలో సైనా ఫిట్‌నెస్ లెవెల్‌ను ప్రదర్శించింది. ఇప్పుడు ఈ రెండో టోర్నీలోనూ అదే జోరును కొనసాగించాలని సైనా పట్టుదలగా ఉంది. డ్రాలోని రెండో అర్ధ భాగంలో ఉన్న సైనా తొలి రౌండ్ మ్యాచ్‌లో డెన్మార్క్‌కు చెందిన సోఫీ డాల్‌తో ఆడుతుంది. తర్వాత క్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ బీవెన్ ఝాంగ్‌తో సైనా తలపడే అవకాశముంది.

మరోవైపు ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచి సంచలనం సృష్టించిన సింధు గత సీజన్‌లో మూడు టైటిళ్లు, మూడు రజత పతకాలు సాధించింది. ప్రస్తుతం టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుంది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలిచిన సింధు తొలి రౌండ్ మ్యాచ్‌లో డెన్మార్క్‌కు చెందిన నటాలియా రోహ్డేతో ఆడనుంది. అయితే సింధుకు సెమీఫైనల్లో అసలు సవాలు ఎదురుకానుంది. ఎందుకంటే సెమీస్‌లో సింధు ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ ఇంతనాన్‌తో తలపడే అవకాశముంది. జకార్తాలో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్‌లో సింధు పోరాటం క్వార్టర్స్ ఫైనల్లోనే ముగిసింది. ఆ మ్యాచ్‌లో సైనా చేతిలో సింధు ఓటమిపాలైంది. అయితే వీరిద్దరూ అన్ని అడ్డంకులను దాటితే ఈ టోర్నీలో ఫైనల్లో తలపడే అవకాశముంది. పురుషుల సింగిల్స్ విషయానికొస్తే.. శ్రీకాంత్ గత సీజన్‌లో నాలుగు టైటిళ్లు గెలిచి ఒకసారి రన్నరప్‌గా నిలిచాడు. అయితే నాగపూర్‌లో జరిగిన సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాలి గాయానికి గురయ్యాడు. దీంతో గత డిసెంబర్‌లో జరిగిన చైనా ఓపెన్, హాంకాంగ్ ఓపెన్ టోర్నీలకు దూరమయ్యాడు. మళ్లీ దుబాయ్ సూపర్ సిరీస్ ఫైనల్లో పాల్గొన్నాడు. కానీ సరైన ప్రాక్టీస్ లేక గ్రూప్ దశలోని అన్ని మ్యాచ్‌ల్లో ఓటమిపాలయ్యాడు. నిజానికి ఈ నెల ఆరంభంలోనే జరిగిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లోనూ శ్రీకాంత్ సరిగా రాణించలేదు. అవధె వారియర్స్‌కు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలయ్యాడు. ఈ ఏడాది సీజన్‌ను కూడా శ్రీకాంత్ ఆలస్యంగా ప్రారంభిస్తున్నాడు. ఒక చిన్న గాయం వల్ల చివరి క్షణంలో ఇండోనేషియా మాస్టర్స్ నుంచి శ్రీకాంత్ తప్పుకున్నాడు. 2014 ఇండియా ఓపెన్‌లో సైనాతో పాటు శ్రీకాంత్ విజేతగా నిలిచాడు. కానీ గత టోర్నీలో తొలి మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ వన్ విక్టర్ యాక్సెల్‌సెన్ చేతిలో ఓటమిపాలై ఇంటిముఖం పట్టాడు. కానీ 2017లో తానేంటో నిరూపించుకున్నాడు. స్వల్ప కాల కెరీర్‌లో గతేడాదిని చిరస్మరణీయంగా చేసుకున్నాడు.



రెండో సీడ్‌గా బరిలోకి దిగనున్న శ్రీకాంత్ తొలి రౌండ్ మ్యాచ్‌లో హాంకాంగ్‌కు చెందిన లీ చుక్ యియుతో ఆడనున్నాడు. ఒకవేళ శ్రీకాంత్ ఫైనల్‌కు చేరుకోగలిగితే తుదిపోరులో యాక్సెల్‌సెన్‌తో తలపడే అవకాశముంది. గత సీజన్‌లో ప్రపంచ 10వ ర్యాంక్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా గత సీజన్‌లో స్ఫూర్తిదాయక ఆటను ప్రదర్శించాడు. ఇండోనేషియా, ఫ్రెంచ్ ఓపెన్‌లలో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. అంతేకాకుండా యూఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రీ, సీనియర్ నేషనల్స్ టైటిళ్లు గెలిచాడు. ఇక భారత ఇతర షట్లర్ల విషయానికొస్తే.. సింగపూర్ చాంపియన్ బి. సాయి ప్రణీత్ ఇంగ్లండ్‌కు చెందిన రాజీవ్ ఓసెఫ్‌తో, కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత పారుపల్లి కశ్యప్ డెన్మార్క్‌కు చెందిన హన్స్ క్రిస్టిన విట్టింగస్‌తో, అజయ్ జయరామ్ ఇండోనేషియాకు చెందిన టామ్మీ సుగియార్టోతో తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో తలపడనున్నారు.



కోహ్లీకి ఆల్ టైమ్ ప్లేయర్ ర్యాంక్

- బ్రియాన్ లారాను అధిగమించిన విరాట్
- ఐసీసీ ప్లేయర్ ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా కెప్టెన్, ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ విరాట్ కోహ్లీ కరేబియన్ లెజెండ్ బ్రియాన్ లారాను అధిగమించాడు. ఆల్ టైమ్ కెరీర్ అత్యధిక ప్లేయర్ ర్యాంకింగ్స్ ఫర్ టెస్ట్ బ్యాట్స్‌మన్‌గా కోహ్లీ నిలిచాడు. జొహన్నెస్‌బర్గ్ టెస్టు మ్యాచ్ తర్వాత కోహ్లీకి 12 పాయింట్లు లభించాయి. 900 పాయింట్లతో చివరి, మూడో టెస్టు ఆడిన కోహ్లీ 51, 41 పరుగులు చేయడంతో 12 పాయింట్లు వచ్చాయి. అంటే కోహ్లీ ఇప్పుడు 912 పాయింట్లతో ఆల్ టైమ్ జాబితాలో 26వ స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ 961 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. ప్రస్తుతం నంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా కొనసాగుతున్న స్టీవ్ స్మిత్ ఆల్ టైమ్ జాబితాలో 947 పాయింట్లతో ఉన్నాడు. 31 నుంచి 26వ స్థానానికి చేరుకున్న కోహ్లీ.. లారా (911), కెవిన్ పీటర్సన్ (909), హాషీం ఆమ్లా (907), శివ్‌నరైన్ చందర్‌పాల్ (901), మైకెల్ క్లార్క్ (900)లను అధిగమించాడు. 916 పాయింట్లతో ఉన్న సునీల్ గవాస్కర్‌కు కోహ్లీ చేరువగా ఉన్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జూన్‌లో జరగనున్న ఏకైక టెస్టులో లేదా ఆ తర్వాత అంటే ఆగస్టు/సెప్టెంబర్ మాసాల్లో ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో కోహ్లీ మరిన్ని పాయింట్లు సాధించే అవకాశముంది. ఐపీపీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఎటువంటి మార్పు లేదు. జేమ్స్ ఆండర్సన్ టాప్ ప్లేస్‌లో కొనసాగుతుండగా.. కగిసొ రబాడ, రవీంద్ర జడేజా, జోష్ హాజిల్‌వుడ్, రవిచంద్రన్ అశ్విన్ తర్వాతి ర్యాంక్‌ల్లో ఉన్నారు. భువనేశ్వర్ కుమార్ టాప్-20లో స్థానం సంపాదించాడు. ఇషాంత్ శర్మ 26వ ర్యాంక్‌లో, బుమ్రా 36వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

శాస్త్రి సారథ్యంలో టీమిండియా పార్టీ




జొహన్నెస్‌బర్గ్: సౌతాఫ్రికాతో ఇక్కడ జరిగిన చివరి టెస్టులో టీమిండియా సంచలన విజయం సాధించింది. ఈ సంబరాన్ని తమదైన స్టైల్లో చేసుకోవాలని కోహ్లీ సేన నిర్ణయించుకుంది. ఇటీవల అత్యంత కఠినమైన పిచ్‌లలో ఇది ఒకటి. ఆతిథ్య జట్టు సహకరించే పేస్, బౌన్సీ వాతావరణంలో కోహ్లీ సేన పోరాడింది. అయితే ఈ గెలుపు సంబరాలకు కోచ్ రవిశాస్త్రి సారథ్యం వహించారు. 'సండే మార్నింగ్. చీర్స్' అంటూ ట్విట్టర్‌లో ఫొటో పోస్ట్ చేసిన ట్యాగ్ పెట్టారు. విదేశాల్లో గెలిచిన విజయాల్లో అద్భుతమైన విజయంగా శాస్త్రి వాండరర్స్ విజయాన్ని అభివర్ణించారు. 'మా వాళ్లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇక్కడి వాతావరణం, పిచ్‌లను గమనిస్తే.. మేము వాటన్నింటినీ అధిగమించాం. గ్రీన్ పిచ్‌పై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నందుకు చాలా మంది నవ్వారు. కానీ మాకుండే కారణాలు మాకుంటాయి. తర్వాత మేము పోరాడాం. ప్రపంచ నంబర్ వన్ జట్టులా ఆడాం' అని శాస్త్రి అన్నారు. ఇక కోహ్లీ 'ప్రౌడ్.. ప్రౌడర్.. ప్రౌడెస్ట్. మ్యాచ్ ఆద్యంతం పోరాట పటిమను ప్రదర్శించిన సహచరులకు హ్యాట్సాఫ్. ఈ రోజు ఎల్లప్పుడు ప్రత్యేకంగా నిలుస్తుంది. జై హింద్' అని ట్విట్టర్‌లో పేర్కొన్నాడు. సౌతాఫ్రికా పర్యటనలోని మిగతా వన్డే, టీ20 సిరీస్‌ల కోసం వచ్చిన ధోనీ కూడా ఈ పార్టీలో కలిశాడు. ధోనీతో పాటు వన్డే ఆటగాళ్లతో దిగిన ఫొటోను పాండ్యా పోస్ట్ చేశాడు.

గాల్లో తేలినట్టుందే...



పట్టరాని ఆనందంలో ఉనద్కత్

న్యూఢిల్లీ: గాల్లో తేలినట్టుందే.. గుండె పేలినట్టుందే.. తేనె తుట్టె మీద రాయి పెట్టి కొట్టినట్టుందే.. అని భారత యువ క్రికెటర్ జైదేవ్ ఉనద్కత్ పాడుకుంటున్నాడు. ఎందుకంటే ఐపీఎల్-11లో అత్యధిక ధర పలికిన భారత యువ క్రికెటర్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఐపీఎల్ వేలం పాటలో ఉనద్కత్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టు రూ. 11.5 కోట్లకు (దాదాపు 1.8 మిలియన్ యూఎస్ డాలర్లకు) కొనుగోలు చేసింది. దీంతో పట్టరాని ఆనందంతో ఉన్నాడు. ఐపీఎల్ వేలం పాటను తన కుటుంబ సభ్యులతో కలిసి పరంబదూర్‌లోని తన ఇంట్లో కూర్చొని చూడాలనుకున్నాడు. కానీ విజయ్ హజారే ట్రోఫీకి శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఉనద్కత్ రాజ్‌కోట్‌కు వెళ్లాల్సి వచ్చింది. అయితే తన పేరు వచ్చినప్పుడు చెప్పమని సహచరులకు చెప్పాడు. 'నా పేరు వచ్చినప్పుడు వేలం పాటను ఫోన్‌లో చూశాం. ఐదు నిమిషాలు నెట్ ప్రాక్టీస్‌ను ఆపేసి అందరం వేలం పాటను చూశాం. నా వేలం పాటను చూసి సహచరులు పిచ్చోళ్లయ్యారు. నిమిషనిమిషానికి కేకలు వేశారు. నాకు శుభాకాంక్షలు తెలిపారు. వాళ్లు కూడా ఒకరితో ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నా కంటే వాళ్లే ఎక్కువగా ఆనందించారు. ఇతరుల కోసం మనస్ఫూర్తిగా సంతోషించడం గొప్ప విషయం. సహచరులు నన్ను ఊరికే వదల్లేదు. పార్టీ ఇవ్వాలని పట్టుబ ట్టారు. ప్రస్తుతం దాన్ని వాయిదా వేశారు. విజయ్ హజారే ట్రోఫీ కోసం హైదరాబాద్ వచ్చినప్పుడు పార్టీ చేసుకోవాలని అనుకున్నాం. ఖచ్చితంగా సహచరులందరికీ ఒక మంచి హోటల్లో గ్రేట్ పార్టీ ఇస్తా' అని ఉనద్కత్ ఆనందంగా చెప్పాడు.



సిరీస్ గెలిస్తే టాప్ ర్యాంక్

గురువారం నుంచి ఇండియా, సౌతాఫ్రికా వన్డే సిరీస్

దుబాయ్: వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను చేజిక్కించుకునేందుకు ఇండియా, సౌతాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ప్రస్తుతం ఈ రెండు జట్లు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. గురువారం తొలి మ్యాచ్ జరగనుంది. అయితే ఈ సిరీస్‌ను టీమిండియా 4-2 లేదా అంతకంటే మెరుగైన నిష్పత్తితో గెలిస్తే ప్రస్తుతం రెండో ర్యాంక్‌లో ఉన్న కోహ్లీ సేన టాప్ ర్యాంక్‌కు చేరుకుంటుంది. ప్రస్తుతమున్న టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకోవాలంటే ఈ సిరీస్‌ను సౌతాఫ్రికా డ్రా చేసుకోవాలి. ఒకవేళ ఈ సిరీస్‌ను సౌతాఫ్రికా 5-1తో గెలిస్తే దశాంశ బిందువు పాయింట్లతో టీమిండియా రెండో స్థానం నుంచి మూడుకు పడిపోతుంది. ఇంగ్లండ్ రెండో ర్యాంక్‌కు చేరుకుంటుంది. వన్డే ప్లేయర్స్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ 876 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సౌతాఫ్రికాకు చెందిన ఏబీ డివిలియర్స్ (872), ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ వార్నర్ (823) రెండు, మూడు ర్యాంక్‌ల్లో ఉన్నారు. రోహిత్ శర్మ (816), పాకిస్థాన్‌కు చెందిన బాబర్ అజీం (813) నాలుగైదు స్థానాల్లో కొనసాగుతున్నారు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 13వ ర్యాంక్‌లో ఉన్నాడు. శిఖర్ ధావన్ 14వ ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల విషయానికొస్తే.. భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా (728) మూడో స్థానంలో ఉన్నాడు. ఇమ్రాన్ తాహిర్ (743), ట్రెంట్ బౌల్ట్ (729) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. ఎడమ చేతి స్పిన్నర్ అక్షర్ పటేల్ ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. 643 పాయింట్లతో 10వ స్థానంలో నిలిచాడు.

ఇండియా, పాకిస్థాన్ అమీతుమీ

నేడు అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ సెమీఫైనల్ ● ఫైనల్‌కు చేరుకున్న ఆస్ట్రేలియా



క్రైస్ట్‌చర్చ్: ఐపీఎల్ వేలంలో లాభదాయక ఒప్పందాలను పొందుకున్న భారత అండర్-19 క్రికెట్ జట్టు ఆటగాళ్లు చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో అమీతుమీకి సిద్ధమయ్యారు. ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్‌లో మంగళవారం ఇండియా, పాకిస్థాన్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఆస్ట్రేలియా జట్టు ఇప్పటికే ఫైనల్‌కు చేరుకుంది. ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్ ఈ టోర్నీలో తిరుగులేని జట్టుగా కొనసాగుతోంది. పాకిస్థాన్ బౌలింగ్‌లో ఎడమ చేతి పేస్ సంచలనం షహీన్ అఫ్రీది ఇప్పటి వరకు జట్టును గెలిపిస్తూ వస్తున్నాడు. కానీ బ్యాటింగ్‌లో మాత్రం ఆ జట్టు చాలా బలహీనంగా ఉంది. అలి జర్యాబ్ ఆసిఫ్ మిడిలార్డర్‌లో భారీ స్కోర్లు చేస్తున్నాడు. రెండుసార్లు జట్టును క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకున్నాడు. శ్రీలంకపై 59 పరుగులు చేసిన ఆసిఫ్ క్వార్టర్ ఫైనల్లో సౌతాఫ్రికాపై 74 పరుగులు సాధించాడు. అయితే భారత జట్టులోని మిగతా వాళ్లు కూడా రాణించాల్సిన సమయం ఆసన్నమైంది. పేసర్ నగర్‌కోటి, శివం మవి నిప్పులు చెరిగే బౌలింగ్‌లో ప్రత్యర్థి బ్యాటింగ్ బలహీనతపై దెబ్బ కొట్టాలి. ఐపీఎల్ వేలంలో తమ జీవితాలనే మార్చేసే ధర పలకడంతో పాకిస్థాన్‌ను చిత్తు చేసేందుకు భారత యువ క్రికెటర్లు రెట్టించిన ఆత్మ విశ్వాసంతో ఉన్నారు. నగర్‌కోటి, మవిలను కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు రూ. 3.2, రూ. 3 కోట్లకు కొనుగోలు చేసింది. అనుకుల్ రాయ్‌ని ముంబై ఇండియన్స్ రూ. 20 లక్షలకు, అభిషేక్ శర్మను ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు రూ. 55 లక్షలకు సొంతం చేసుకున్నాయి. బ్యాటింగ్‌లో కెప్టెన్ పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్ జట్టుకు అండగా నిలుస్తున్నారు. క్వార్టర్ ఫైనల్లో 86 పరుగులు మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన గిల్ భారత జట్టులో అత్యధిక పరుగులు (239) చేసిన క్రికెటర్‌గా నిలిచాడు. ఇతడిని కేకేఆర్ జట్టు రూ. 1.8 కోట్లకు, షాను ముంబై ఇండియన్స్ రూ. 1.2 కోట్లకు కొనుగోలు చేశాయి. షా ఓపెనింగ్ భాగస్వామి మనోజ్ కల్రాను ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ. 20 లక్షలకు సొంతం చేసుకుంది.



ఆఫ్ఘనిస్థాన్‌పై ఆస్ట్రేలియా గెలుపు

అండర్-19 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సోమవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 6 వికెట్లతో ఆఫ్ఘనిస్థాన్‌పై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్థాన్ 48 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. తర్వాత ఆస్ట్రేలియా 37.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 182 పరుగులు సాధించింది.

సుమిత్, సర్జుబాలలకు పతకాలు ఖాయం

క్వార్టర్ ఫైనల్లో శివ థాపా

ఇండియా ఓపెన్ బాక్సింగ్

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ పురుషులు, మహిళల బాక్సింగ్ టోర్నీలో ఆసియా రజత పతక విజేత సుమిత్ సంగ్వాన్ (91 కిలోల కేటగిరి), ప్రపంచ రజత పతక విజేత సర్జుబాల దేవి (51)తో పాటు మరో ఇద్దరు బాక్సర్లు పతకాలను ఖాయం చేసుకున్నారు. రెండోసీడ్ సుమీత్ 5-0తో సహచరుడు వీరేంద్ర కుమార్‌ను ఓడించాడు. కానీ కంటి దగ్గర గాయం కావడంతో సుమీత్ సెమీఫైనల్లో పాల్గొనే అవకాశం లేదు. మహిళల విభాగంలో సర్జుబాల, పింకీ జంగ్ర (51కిలో) సెమీఫైనల్‌కు చేరుకున్నారు. హెవీవెయిట్ (91కిలో) టాప్‌సీడ్ నమన్ తన్వర్ జోర్డాన్‌కు చెందిన ఇషాయిష్ హుస్సేన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరాడు. కాగా మూడుసార్లు ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకాలు గెలిచిన శివ థాపా (60కిలో) తొలి రౌండ్‌లో భూటాన్‌కు చెందిన డోర్జి వాంగ్డిపై సునాయాసంగా గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మంగళవారం జరగనున్న పోరులో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన షెర్బెక్ రఖ్మతుల్లోవ్‌తో శివ తలపడతాడు. మహిళల విభాగంలో పింకి జంగ్ర 5-0తో జోర్డాన్‌కు చెందిన అల్ మ్రిహీల్‌పై నెగ్గింది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.